అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 12-03-2025 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 సంచిక : 20 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు వెల : 6.50



గత లోక్‌సభ ఎన్నికల వరకే
ఇండియా బ్లాక్

2024 తర్వాత ఎలా ఉండాలనే ఆలోచనలేం లేవు

సీపీఐ(ఎం) సమన్వయకర్త ప్రకాశ్ కరత్

కొల్లాం : గతేడాది లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీపై పోరాటం జరపాలన్న ప్రత్యేక ప్రయోజనంతోనే 26 బీజేపీయేతర పార్టీలతో కలిసి ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్, ఇంక్లూజివ్ అలయన్స్ (ఇండియా) రూపొందిందని సీపీఐ(ఎం) సమన్వయకర్త ప్రకాశ్ కరత్ చెప్పారు. 2024 తర్వాత అది ఎలా వుండాలనే అంశంపై ఎవరికీ ఎలాంటి ఆలోచనలు లేవని అన్నారు. కొల్లాంలో ఆదివారం కేరళ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని హిందూ పత్రికకు ప్రకాశ్ కరత్ ఇంటర్వ్యూ ఇచ్చారు.

"మా పార్టీ సీపీఐ(ఎం) ఇటువంటి తరహాలో సంస్థాగత నిర్మాణాన్ని వ్యతిరేకిస్తుంది. ఎందుకంటే విభిన్నమైన విధానాలు, సిద్ధాంతాలు, వ్యక్తిత్వాలు కలిగిన 26పార్టీలు కలిసి కేంద్ర స్థాయిలో అటువంటి ఏకీకరణ నిర్మాణాన్ని కలిగి వుండలేవు." అని కరత్ చెప్పారు. సమన్వయ కమిటీని ఏర్పాటు చేయడానికి ఆ పార్టీలు ప్రయత్నించాయి. కానీ అది సరిగా పనిచేయదని మేం చెప్పాం. కేవలం నేతలందరూ సమావేశమవుతున్నారు అంతే. కొన్ని కమిటీలను ఏర్పాటు చేశాం. కానీ వాటిల్లో ఏదీ పనిచేయడం లేదు. అఖిల భారత స్థాయిలో చర్చలు జరపడం సాధ్యం కాదు కాబట్టే ఎన్నికల అవగాహన లేదా సీట్ల సర్దుబాటు అనేది రాష్ట్రాలవారీగా వుండాలని మేం చెప్పాం. ఉదాహరణకు, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, సీపీఐ(ఎం) కలిసి పనిచేయలేవు. అలాగే కేరళలో సీపీఐ(ఎం), కాంగ్రెస్‌లు కలిసి పనిచేయలేవు. కాబట్టి, లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే రాష్ట్రాల స్థాయిలో ఎన్నికల అవగాహన వుండాలని భావించాం. దానివల్ల మంచి ఫలితాలే వచ్చాయి. బీజేపీ మెజారిటీని కోల్పోయింది. 240సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అందువల్ల ఇండియా బ్లాక్ దార్శనికత లేదా దృక్పథం అనేది కేవలం లోక్‌సభ ఎన్నికల వరకు మాత్రమే." అని కరత్ స్పష్టం చేశారు.

లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికలు, ఉప ఎన్నికల్లో ఇండియా బ్లాక్ వెనుకపట్టు పట్టింది. ఎందుకంటే గ్రూపులోని పార్టీల మధ్య కలహాలే ...11లో

నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

ఉదయం 11 గంటలకు ప్రారంభం

- ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించనున్న గవర్నర్




వివరాలు 12లో

ఆర్థిక మాంద్యంలో అమెరికా

కుదేలవుతున్న స్టాక్ మార్కెట్లు | మదుపరుల సంపద రూ.350 లక్షల కోట్లు ఆవిరి | ట్రంప్ వాణిజ్య విధానాలే కారణం

దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిర్ణయాలతో అమెరికా స్టాక్ మార్కెట్ కకావికల మవుతోంది. మదుపరుల సంపద నిలువునా ఆవిరైపోతోంది. ట్రంప్ ప్రకటించిన వాణిజ్య యుద్ధంతో అమెరికా స్టాక్ మార్కెట్లు నాలుగు ట్రిలియన్ డాలర్ల మేర నష్టపోయాయి. ఇది బ్రిటన్, ఫ్రాన్స్ జీడీపీల కంటే ఎక్కువేనని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ట్రంప్ అనాలోచిత నిర్ణయాల కారణంగా నాస్‌దాక్ సూచీ నాలుగు శాతం, ఎస్ అండ్ పీ -500 సూచీ 2.7 శాతం నష్టపోయాయి. ఒక దశలో 3.6 శాతం నష్టపోయిన ఎస్ అండ్ పీ -500 సూచీ ఆ తర్వాత కొద్దిగా తేరుకుంది. 2022 తర్వాత అమెరికా స్టాక్ మార్కెట్‌లో ఇదే అత్యంత దారుణమైన రోజని నిపుణులు వ్యాఖ్యానించారు. ప్రపంచంలోని అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో చిక్కుకుపోతోందని, వాణిజ్య యుద్ధాన్ని ఎదుర్కొంటోందని ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో స్టాక్ మార్కెట్ అనేక ట్రిలియన్ డాలర్లు నష్టపోతోంది. ట్రంప్ అనుసరిస్తున్న వాణిజ్య విధానాలతో పెట్టుబడిదారులు బెంబేలెత్తుతున్నారు.

తోసిపుచ్చని ట్రంప్... ఇది పరివర్తన దశ అంటూ మేకపోతు గాంభీర్యం



వాషింగ్టన్ : 2022 తర్వాత అమెరికాలో టెక్నాలజీ షేర్ల ధరలు ఈ స్థాయిలో పతనం కావడం ఇదే మొదటిసారి. కేవలం షేర్ల విలువ మాత్రమే కాదు...కార్పొరేట్ బాండ్లు, అమెరికా డాలర్, క్రిప్టో కరెన్సీలు కూడా భారీగా నష్టపోతున్నాయి. ఇంత జరుగుతున్నా ట్రంప్ మాత్రం మేకపోతు గాంభీర్యాన్ని వీడడం లేదు. సుంకాలకు సంబంధించి తాను అనుసరిస్తున్న విధానాలు దేశానికి ఎంత చేటు తెస్తున్నాయో ఆయన అర్థం చేసుకోవడం లేదు. సుంకాలతో అమెరికాకు ఏ మేరకు ప్రయోజనం చేకూరుతుందో తెలియదు కానీ అగ్రరాజ్యం ఆర్థిక మాంద్యంలోకి జారుకుంటుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ట్రంప్ కూడా దీనిని తోసిపుచ్చడం లేదు. దీంతో మదుపరుల నమ్మకం సడలిపోతోంది. ఫిబ్రవరి 19న జీవితకాల గరిష్ట స్థాయిని తాకిన ఎస్ అండ్ పీ -500 సూచీ ఆ తర్వాత 8 శాతానికి పైగా విలువను కోల్పోయింది. అమెరికా మార్కెట్ల పతనానికి అనేక కారణాలు కన్పిస్తున్నప్పటికీ వాణిజ్య విధానంలో ట్రంప్ తెచ్చిన మార్పులు, ఆర్థిక మాంద్యం భయాలు ప్రధాన కారణాలని లాజర్డ్ సీఈఓ పీటర్ ఓర్స్‌జాగ్ అభిప్రాయపడ్డారు.

అమెరికాకు ప్రధాన వాణిజ్య భాగస్వామ్య దేశాలైన కెనడా, మెక్సికో, యూరో పియన్ యూనియన్ ఇప్పుడు తమ వ్యాపార వ్యూహాలను మార్చు కుంటున్నాయని ఆయన చెప్పారు. మార్కెట్లలో అనిశ్చితి కారణంగా మదుపరులు సురక్షితమైన ట్రెజరీ బాండ్లలో పెట్టుబడులు పెట్టేం దుకు ఆసక్తి కనబరు స్తున్నారు. అమెరికాలో రాబోయే సంవత్సర కాలంలో మాంద్యం ఏర్పడేందుకు 15-20 శాతం అవకాశాలు ఉన్నాయని గోల్డ్‌మన్ శాక్స్ సంస్థ అంచనా వేసింది. గతంలో వేసిన వృద్ధి రేటు అంచనా 2.2 శాతాన్ని ఆ సంస్థ 1.7 శాతానికి తగ్గించింది.

ట్రంప్ ఏమన్నారు?

ట్రంప్ వాణిజ్య విధానాలు అమెరికా ఆర్థిక వ్యవస్థపై ఎంత దారుణమైన ప్రభావం చూపుతున్నాయో తాజా పరిణామాలను గమనిస్తే అర్థమవుతుంది. వాణిజ్య యుద్ధం అమెరికాను మాంద్యంలోకి నెడుతుందని ఇన్వెస్టర్లు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ట్రంప్ కూడా ఏమీ చెప్పడం లేదు. అమెరికా మాంద్యం దిశగా వెళుతోందా అని ఫాక్స్ న్యూస్ ప్రతినిధి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానాన్ని దాటవేశారు. 'అలా అంచనాలు వేయడాన్ని నేను ఇష్టపడను. ఇది పరివర్తన దశ. మేము చాలా పెద్ద పని పెట్టుకున్నాము. సంపదను తిరిగి అమెరికాకు తీసుకువస్తున్నాము. అందుకు సమయం పడుతుంది' అని చెప్పుకొచ్చారే తప్ప మాంద్యం అవకాశాలను తోసిపుచ్చలేదు.

హామీలేవీ ఇవ్వలేదు : భారత్

అమెరికా ఉత్పత్తులపై సుంకాలు తగ్గిస్తానని తాను ఎలాంటి హామీ ఇవ్వలేదని భారత్ స్పష్టం చేసింది. సుంకాలను తగ్గించేం దుకు భారత్ అంగీకరించిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై కేంద్రం స్పందించింది. అలాంటి హామీ ఏదీ ఇవ్వలేదని ఓ పార్లమెంటరీ కమిటీకి తెలియజేసింది. 'సమస్య పరిష్కారానికి సెప్టెంబర్ వరకూ గడువు కావాలని మాత్రమే అడిగాము' అని వివరించింది. రెండు దేశాలు పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందం దిశగా కృషి చేస్తున్నాయని వాణిజ్య కార్యదర్శి సునీల్ భర్త్వాల్ తెలిపారు. తక్షణం సుంకాల సర్దుబాటు కుదుర్చుకునే కంటే దీర్ఘకాల వాణిజ్య సహకారంపై దృష్టి సారిస్తున్నామని ఆయన చెప్పారు.

ట్రంప్ స్నేహితుడు, అమెరికా ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న ఎలన్ మస్క్‌కు చెందిన టెస్లా కంపెనీ షేర్ల ధరలు కూడా పది శాతానికి పైగా పతన మయ్యాయి. అమెరికాలో ఇప్పుడు ఎక్కడ చూసినా మాంద్యం పైనే చర్చలు సాగు తున్నాయి. కెనడా, మెక్సికో, చైనాపై ట్రంప్ విధిం చిన సుంకాలు గత వారమే అమలులోకి వచ్చాయి. దీంతో తన విధానాలపై ట్రంప్ వెనక్కి తగ్గబోరని అందరికీ అర్థమైపోయింది. ఫలితంగా స్టాక్ మార్కెట్‌లో కుదుపులు మొదలయ్యాయి. ఇది ఇన్వెస్టర్లలో అనిశ్చితికి కారణమవుతోంది. బుధవారం విడుదలయ్యే ద్రవ్యోల్బణ సమాచారం కోసం వారు ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది తమ సంపద కండ్ల ముందే భారీగా ఆవిరైపోతుండడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు.



గ్రూప్-2 టాపర్
ఎన్‌వి హరవర్ధన్

447.088 మార్కులతో అగ్రస్థానం

- వడ్లకొండ సచిన్‌కు రెండోస్థానం
- మహిళల్లో వినిషారెడ్డి ప్రథమం
- గ్రూప్-2 జీఆర్‌ఎల్ విడుదల
- 2.36 లక్షల మంది అర్హత : టీజీపీఎస్సీ చైర్మెన్ బుర్రా వెంకటేశం వెల్లడి

వివరాలు 10లో

పేదల భూముల్ని కార్పొరేట్లకు అప్పగించే కుట్ర

ఫోర్త్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం

- ఫార్మాసిటీపై సీఎం స్పష్టమైన హామీ ఇవ్వాలి
- భూములను నిషేధిత జాబితాలో పెట్టడమే చట్టవిరుద్ధం :
- కుర్మిద్దలో బాధిత రైతు సదస్సులో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- రైతు సమస్యలపై కార్యాచరణ రూపొందిస్తాం
- ఫార్మా బాధిత గ్రామాల్లో 20, 21 తేదీల్లో పాదయాత్ర
- 21న కలెక్టరేట్ ముట్టడికి పిలుపు



నవతెలంగాణ-యాచారం

ఫార్మాసిటీ, ఫోర్త్ సిటీ, గ్రీన్ ఫీల్డ్ రకరకాల పేర్లతో రాష్ట్ర ప్రభుత్వం పేద రైతుల భూములను గుంజుకొని కార్పొరేట్లకు అప్పజెప్పే కుట్ర చేస్తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఫోర్త్ సిటీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని, ఫార్మాసిటీపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల ...10లో



యువత కోసం
రాజీవ్ యువ వికాసం

- మార్చి 15 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 6 నుంచి పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక
- ఎంపిక చేసిన వారికి జూన్ 2న మంజూరు పత్రాలు : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

రూ.6వేల కోట్లతో 5 లక్షల మందికి స్వయం ఉపాధి పథకాలు

దశాబ్ద కాలంగా విస్మరించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం 11లో..



డిప్యూటీ లీడర్లను నియమిస్తాం

సభలో సమన్వయంతో ముందుకెళ్లాలి

- ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలి : బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బీఆర్‌ఎస్ అధ్యక్షులు కేసీఆర్ దిశానిర్దేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

శాసనసభ, మండలిలో ప్రజాసమస్యలపై ఇంకా ప్రతిభా వంతంగా పోరాడేందుకు, సభ్యులను ఎప్పటికప్పుడు సమ న్వయం చేసుకుంటూ ముందుకెళ్లేందుకు డిప్యూటీ లీడర్లను నియమించనున్నట్టు బీఆర్‌ఎస్ అధ్యక్షులు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన బీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశం మూడు గంటల పాటు జరిగింది. అందులో ఆయన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. బీఆర్‌ఎస్ ...11లో




పాల రైతులకు బకాయి
బిల్లులు చెల్లించాలి

మదర్‌డెయిరీ సంస్థ ఆస్తులను నష్టాల పేరుతో విక్రయించొద్దు

- రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

మదర్‌డెయిరీ నాలుగు బిల్లులు, విజయ డెయిరీ రెండు బిల్లుల బకాయి మొత్తం రూ.85 కోట్లను వెంటనే పాల రైతులకు చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ సంబంధిత యాజమాన్యాలను డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద పాడి రైతులు మంగళవారం పెద్దఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం తర్వాత రైతులకు పాడి పరిశ్రమ పెద్ద జీవనోపాధి వనరుగా ఉన్నద న్నారు. ఉపాధినిస్తున్న పాడి ...11లో



పాకిస్తాన్‌లో రైలు హైజాక్

బందీలుగా 182 మందికిపైగా ప్రయాణికులు

- ఆపరేషన్‌లో 20 మంది సైనికులు మృతి?
- ఎయిర్ స్ట్రైక్‌కు రంగం సిద్ధం
- తమదే బాధ్యత అన్న బీఎల్‌ఏ

ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌లోని వాయవ్య బెలూచిస్తాన్‌లో ప్రయాణికుల రైలును మంగళవారం సాయుధ తీవ్రవాదులు హైజాక్ చేశారు. 182మందికిపైగా ప్రయాణికులను బందీలుగా చేశారు. క్వెట్టా నుంచి పెషావర్‌కు రైలు ప్రయాణిస్తుండగా, బోలన్ జిల్లాలో ఈ దాడి జరిగిందని ప్రభుత్వ ప్రతినిధి షాహిద్ రిండ్ తెలిపారు. రైలు డ్రైవర్‌నూ గాయపర్చడంతో నిర్జన ప్రదేశంలో రైలు ఆగిపోయిందని చెప్పారు. కాగా సైనిక బలగాలు సంఘటనా స్థలానికి చేరుకోగా.. ఉగ్రవాదులతో జరిగిన కాల్పుల్లో 20 మంది సైనికులు మృతి చెందినట్టు మీడియా కథనాలు వస్తున్నాయి. బందీలను విడిపించు కోవటానికి పాక్ ప్రభుత్వం ఎయిర్ స్ట్రైక్‌కు రంగం సిద్ధం చేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. అయితే రైలులో ప్రయాణికుల పరిస్థితి ఎలా వుందో వెంటనే తెలియరాలేదు. మంగళవారం ఉదయం 9గంటల ప్రాంతంలో రైలు క్వెట్టా నుంచి బయలుదేరింది. పెషావర్‌కు చేరుకోవడానికి 30 గంటలకు పైగా సమయం పడుతుంది. పాకిస్తాన్‌లో ఏండ్ల తరబడి తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న వేర్పాటువాద బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) ఈ దాడికి తమదే బాధ్యత అని ప్రకటించింది. అత్యవసర చర్యలు చేపట్టాల్సిందిగా బలూచిస్తాన్ ప్రభుత్వం స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఆ రైలుకు 9 బోగీలు వున్నాయని, దాదాపు 500మంది ప్రయాణికులు వుంటారని రైల్వే కంట్రోలర్ తెలిపారు. అయితే సొరంగం నెంబరు 8లో రైలును సాయుధులు ఆపేశారు. ట్రాక్‌ను పేల్చేసి.. ట్రైన్‌ను హైజాక్ చేశారు. ప్రయాణికులు, సిబ్బందితో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నామని కంట్రోలర్ చెప్పారు. సైనిక ఆపరేషన్ ప్రారంభిస్తే బందీలందరినీ ఊచకోత కోస్తామని ముందస్తుగా బీఎల్‌ఏ హెచ్చరించింది. ఈ రక్తపాతానికి పూర్తిగా ప్రభుత్వం, సైన్యానిదే బాధ్యత అవుతుందని ప్రకటించింది. మరోపక్క హోం మంత్రి మొహిసిన్ నక్వి ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. అమాయకులైన ప్రయాణికులపై దాడులు చేసిన వీరు ఎలాంటి క్షమాభిక్షకు అర్హులు కాదని విమర్శించారు. సీబీ ఆస్పత్రిలో అత్యవసర పరిస్థితిని విధించారు. అంబులెన్సులు, భద్రతా బలగాలు సంఘటనా స్థలానికి వెళుతున్నాయి. రాకెట్లు, రిమోట్ కంట్రోల్ బాంబులు ఉపయోగించి గతంలో రైలు పట్టాలను పేల్చివేసిన చరిత్ర బీఎల్‌ఏకు వుంది. గతేడాది కాలంలో పాకిస్తాన్‌లో తీవ్రవాద దాడుల్లో 1600మంది మరణించారని ఇస్లామాబాద్ కేంద్రంగా పని చేసే విశ్లేషక గ్రూపు పేర్కొంది.

ప్రధాని మోడీకి మారిషస్ అత్యున్నత పురస్కారం

పార్లమెంట్ సమావేశాలు వదిలి.. విదేశీ టూర్లా..! : ప్రతిపక్షాలు 11లో



కేంద్ర విద్యాశాఖమంత్రి క్షమాపణ చెప్పాలి

- పార్లమెంట్‌లో డీఎంకే ఎంపీల ఆందోళన
- ఆయనకు వ్యతిరేకంగా కనిమొళి ప్రివిలేజ్ నోటీస్

వివరాలు 11లో

యూపీఐ చెల్లింపులపైనా ఫీజు..

కేంద్రం యోచన

వివరాలు 11లో

ఏసీబీకి చిక్కిన డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్

- కాంట్రాక్టర్ నుంచి రూ.2లక్షల డిమాండ్
- రూ.50 వేలు తీసుకుంటూ పట్టుబడ్డ వైనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ జిన్నంవార్ శంకర్ ఏసీబీకి చిక్కారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.50వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ (బాలికల) భవనం నిర్మాణానికి మంజూరైన రూ.2కోట్ల బిల్లు ఇచ్చేందుకు డిప్యూటీ ఎగ్జికూటీవ్ ఇంజినీర్ జిన్నంవార్ శంకర్ కాంట్రాక్టర్‌ను రూ.2 లక్షలు లంచం అడిగారు. ఆ తర్వాత బాధితుడి అభ్యర్థన మేరకు రూ.లక్ష తగ్గించాడు. ఈ క్రమంలో మొదటి దఫా రూ. 50వేలు ఇచ్చేందుకు ఒప్పుకోగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. మంగళవారం మైనార్టీ స్కూల్‌లో నగదు తీసుకుంటుండగా పట్టుకున్నారు. డీఈఈని అరెస్టు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టుకు తరలించారు.

కానిస్టేబుల్‌పై అంతర్రాష్ట్ర దొంగ కత్తితో దాడి

- నాలుగు చోట్ల తీవ్రగాయాలు, ఖమ్మం తరలింపు

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఐడీ పార్టీ కానిస్టేబుల్ నరేశ్‌పై అంతర్రాష్ట్ర దొంగ ఒకరు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో సోమవారం రాత్రి జరిగింది. విధి నిర్వహణలో భాగంగా కానిస్టేబుల్ నరేశ్ స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నిఘాలో ఉన్నారు. బస్టాండులో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండటాన్ని కానిస్టేబుల్ గమనించాడు. అతడిని పట్టుకుందామని దగ్గరకు వెళ్లేలోపే గమనించిన సదరు వ్యక్తి పారిపోయే ప్రయత్నం చేశాడు. అతన్ని వెంబడించి వేంసూరు రోడ్డు శివారులోని శ్రీమెట్టాంజనేయస్వామి ఆలయం వద్ద కానిస్టేబుల్ అడ్డగించాడు. దాంతో తన వెంట తెచ్చుకున్న కత్తితో సదరు వ్యక్తి నాలుగు చోట్ల కానిస్టేబుల్ నరేశ్‌ను తీవ్రంగా గాయపర్చి పరారయ్యాడు. తలపై రెండుచోట్ల, నమరగంతకు కింది భాగంలో, ఛాతీపై తీవ్రంగా గాయపర్చడంతో కానిస్టేబుల్ నరేశ్ శరీరమంతా రక్తసిక్తమైంది. గమనించిన స్థానికులు నరేశ్‌ను 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. కానిస్టేబుల్ నరేశ్‌పై దాడికి పాల్పడింది ఏపీలోని చాత్రాయి మండలం చిత్తాపూర్‌కు చెందిన అంతర్రాష్ట్ర దొంగ తిరువీధుల సురేందర్‌గా పోలీసులు గుర్తించారు. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితిని స్థానిక పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటున్నారు. పోలీసు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

సింబియాసిస్ యూనివర్సిటీలో విద్యార్థి మృతి

- రంగారెడ్డి జిల్లా నందిగామలో ఘటన



నవతెలంగాణ-షాద్‌నగర్ రూరల్

ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని సింబియాసిస్ విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగింది. పోలీసులు, తోటి విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీకి చెందిన షాగ్నిక్ బాసు (22) యూనివర్సిటీ హాస్టల్‌లో ఉంటూ న్యాయశాస్త్రం మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి బాత్‌రూమ్‌కి వెళ్ళిన షాగ్నిక్ ఎంతకీ బయటికి రాకపోవడంతో తోటి విద్యార్థులు కిటికీ లోంచి గమనించగా అపస్మారక స్థితిలో కిందపడి ఉన్నాడు. వెంటనే విద్యార్థులు కళాశాల సిబ్బందికి సమాచారం అందిం చారు. సిబ్బంది అక్కడికి చేరుకుని బాత్ రూమ్ తలుపులు పగులగొట్టి.. అతన్ని చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలిం చారు. షాగ్నిక్‌ను వైద్యులు పరిక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారిం చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలిం చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. విద్యార్థి మృతికి గల కారణాలు తెలియరాలేదు. యువసత్తా యూత్ అధ్య క్షులు లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఎదుట యువకులు నిరసన తెలిపారు. విద్యార్థి మృతిపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య



నవతెలంగాణ-చిట్యాల

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని కైలాపూర్ గ్రామ శివారు శాంతినగర్ గ్రామంలో జరిగింది. ఎస్ఐ-2 ఈశ్వరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్ గ్రామానికి చెందిన మోత్కూరి కుమారస్వామి(35) తనకున్న మూడు ఎకరాల భూమిలో రెండేండ్లుగా పత్తి, మిర్చి పంట వేయగా దిగుబడి సరిగా రాలేదు. దీంతో పెట్టిన పెట్టుబడి రాక చేసిన అప్పులు పెరిగి వాటిని ఎలా తీర్చాలోనని మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున తన చేను వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి మోత్కూరి సారయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పారిశ్రామిక వ్యర్థాలతో..మంజీరాకు ముప్పు

విషం కక్కుతున్న నక్కవాగు
15 కిలో మీటర్ల మేర భూగర్భ జలాలు కలుషితం
పంటలు పండించొద్దన్న వ్యవసాయ నిపుణులు
మత్స్య సంపద, పశుపోషణపై తీవ్ర ప్రభావం
పీసీబీ అధికారుల మొక్కుబడి తనిఖీలు
మంజీరాను రక్షించాలి.. వ్యర్థాలను అరికట్టాలి : సీపీఐ(ఎం)



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

దేశంలోనే ఔషధ కేంద్రమైన తెలంగాణలోని పటాన్‌చెరు-బొల్లారం పారిశ్రామిక ప్రాంతంలో దశాబ్దాల కాలంగా బల్క్ డ్రగ్ తయారీదారులు పర్యావరణాన్ని పాడు చేస్తున్నాయని 1997లోనే సుప్రీంకోర్టు తప్పుపట్టింది. పరిశ్రమల నుంచి వెలువడే అత్యంత విషపూరిత వ్యర్థాలను నీటి వనరుల్లోకి వదులుతున్నారని హెచ్చరించింది. అప్పట్లో కొన్ని వ్యర్థ శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసినా రసాయన వ్యర్థాలతో కూడిన కాలుష్య జలాలు పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలో ప్రవహించే నక్కవాగు, సమీపంలో ఉన్న చెరువుల్లో కలుస్తున్నాయి. అక్కడి నుంచి దిగువన ఉన్న మంజీరాలో కలుస్తుండటంతో కాలుష్య ధారగా మారింది. నీటి వనరుల్లోకి విడుదలయ్యే పారిశ్రామిక వ్యర్థాలు ఆ నీటి భౌతిక రసాయన కూర్పును మార్చి నీటి నాణ్యతను మార్చి దాన్ని తాగడానికి పనికిరానివిగా, జీవులకు విషపూరితం చేస్తాయని శాస్త్రీయంగా రుజువైంది. నక్కవాగు ప్రవహించే ప్రాంతమంతా భూగర్భ జలాలు కలుషితం అయినందున పంటలు పండించడానికి భూసారం పనికిరాదని వ్యవసాయ నిపుణులు తేల్చారు.

నక్కవాగులో రసాయన వ్యర్థాలు

పటాన్‌చెరు మండలంలో ప్రారంభమయ్యే నక్కవాగు సంగారెడ్డి మండలంలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేట, గౌడిచర్ల, హనుమాన్‌నగర్, దాసుగడ్డతండా కంది మండలంలోని బ్యాతోల్, ఆరుట్ల, చిద్రుప్ప, బేగంపేట, ఎర్దనూర్ హత్నూర మండలంలోని పల్పనూర్, గుండ్లమాచనూర్ గ్రామాల మీదుగా మంజీరలో కలుస్తుంది. పటాన్‌చెరు, పాశమైలారం, జిన్నారం, గడ్డపోతారం, ఖాజీపల్లి, ఐడీఏ బొల్లారం, బండ్లగూడ, హత్నూర ఇండస్ట్రీయల్ ఏరియాలో ఉన్న 17 చెరువుల్లోకి పరిశ్రమల నుంచి వెలువడే శుద్ధి చేయని వ్యర్థాలు విడుదల చేస్తున్నారు. నిత్యం పరిశ్రమల వ్యర్థాలను యద్దేచ్ఛగా వదులుతుండటంతో ఉసికవాగు నుంచి నక్కవాగులో కలుస్తున్నాయి. ఒక్కప్పుడు నక్కవాగుకు ఇరువైపుల బోర్లు, బావులు తవ్వి పంటలు పండించుకునేది. పారిశ్రామిక వ్యర్థాల వల్ల నక్కవాగు నిత్యం రసాయనాలతో కూడిన వ్యర్థ జలాలతో నిండిపోయి నురగలు కక్కుతుంది. పారిశ్రామిక జలాలను శుద్ధి చేయకుండానే విడుదల చేయడంతో అవి నక్కవాగు నుంచి మంజీరలో కలుస్తున్నాయి.

15 కిలో మీటర్ల పరిధిలో భూగర్భ జలాలు కలుషితం

వందలాది ఫార్మా, బల్క్‌డ్రగ్స్, పెట్రో పరిశ్రమల వ్యర్థాలను ఇష్టానుసారంగా విడుదల చేయడంతో నక్కవాగు, అనేక చెరువులన్నీ కాలుష్యమయంగా మారాయి. వ్యర్థ రసాయనాలు, విషపూరిత జలాలు భూమి పొరల్లో చేరడంతో నక్కవాగుకు ఇరువైపులా 15 కిలో మీటర్ల మేర భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. బోరు నీరు ఘాటైన కెమికల్ వాసన వస్తాయి. రంగు మారి నీళ్ల వస్తుండటంతో ఏ పంటలూ పండించవద్దని వ్యవసాయ నిపుణులు సూచించడంతో వరి, ఇతర ఆహార ధాన్యాల సాగునే బంద్ అయింది. 17 చెరువుల్లో మత్స్యకారులు చేపలు పెంచుకుని జీవనాధారం పొందేవారు. ఇటీవల వరుసబెట్టి చిట్కూల్, ఇతర చెరువుల్లో వర్థాల వల్ల చేపలు చనిపోయాయి. దాంతో వేలాది కులుంబాలకు ఉపాధిలేకుండా పోయింది. భూగర్భ జలాలు కలుషితం కావడంతో పచ్చిగడ్డి తినే పాడి గేదెలు, పశువులు అనారోగ్యం పాలవుతున్నాయి. ఇటీవల చెరువుల్లోని నీరు తాగి పటాన్‌చెరు ఏరియాలో 20 పాడి గేదెలు మరణించాయి. దాంతో పాల ఉత్పత్తి కూడా దెబ్బతినిపోయింది.



యజమానుల లాభాపేక్ష..

రసాయన, బల్క్ డ్రగ్ పరిశ్రమలు, ఫార్మా, పెట్రో కెమికల్, రంగుల అద్దకం పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను శుద్ధి చేసి వదిలేందుకు పటాన్‌చెరు ఎన్విరోటెక్ లిమిటెడ్ (పీఈటీఎల్) ఆధ్వర్యంలో కాలుష్య వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంట్ ఏర్పాటు చేశారు. పీఈటీఎల్ పనితీరు సరిగ్గా లేకపోవడంతో పటాన్‌చెరు నుంచి మూసీ పక్కన ఉన్న అంబర్‌పేట ట్రీట్‌మెంట్ ప్లాంట్ వరకు పైప్‌లైన్ వేసి రసాయన వ్యర్థాలను తరలించాలి. అయితే పరిశ్రమల్లో ఉంటే ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో 50 శాతం శుద్ధి చేయబడాలి. మిగతా 50 శాతం వ్యర్థాలను పీఈటీఎల్‌లో శుద్ధి చేయాలి. ఘన వ్యర్థాలను దుండిగల్ శివారులో ఉన్న రాంకీ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌కు తరలించాలి. ఇదంతా కూడా ఖర్చుతో కూడిన పని కావడంతో లాభాపేక్షతో స్థానికంగానే వ్యర్థాలను వదులుతున్నారు. ఇప్పటి వరకు పటాన్‌చెరు, జిన్నారం, కంది, సంగారెడ్డి, హత్నూర మండలాల్లోని గ్రామాల్లో భూగర్భ జలాలు, చెరువులు, పర్యావరణం దెబ్బతిన్నది. ఇప్పుడు హైదరాబాద్ జంటనగరాలు, మిషన్ భగీరథ ద్వారా ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాలకు తాగునీరందించే మంజీర జలాలు సైతం కలుషితం అవుతున్నాయి. స్వచ్ఛమైన తాగునీటి వనరుల్లో రసాయన వ్యర్థాలు వదలకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

తూతూమంత్రంగా తనిఖీలు

రసాయన వ్యర్థాలతో ఉసికవాగు, నక్కవాగు, చెరువులు, కుంటలు కలుషితమై అదంతా వచ్చి మంజీరలో చేరుతుంది. ఇంతటి ప్రమాదకర పరిస్థితులకు కారణమైన పరిశ్రమలపై మొక్కుబడి చర్యలు తప్ప శాశ్వత పరిష్కారం చూపడంలేదు. కాలుష్య నియంత్రణ మండలి(పీబీసీ) అధికారులు తూతూమంత్రంగానే తనిఖీలు చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు కూడా తమకేమీ పట్టనట్టు ఉంటున్నారు. నీటి వనరుల కాలుష్యాన్ని తగ్గించడం, ఆ ప్రాంతంలో భూగర్భ జలాల నాణ్యతను పెంచడం కోసం పని చేయాల్సిన అధికారులు కంపెనీల తాయిలాలతో తలూపుతున్నారన్న ఆరోపణలున్నాయి.

మంజీరా జలాలను కాపాడాలి.. పారిశ్రామిక వ్యర్థాలను అరికట్టాలి : సీపీఐ(ఎం)



పటాన్‌చెరు ఇతర ప్రాంతాల్లోని పారిశ్రామిక వ్యర్థాలను అరికట్టేందుకు కఠినమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. లక్షలాది మందికి తాగునీరు, లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే మంజీర జలాలను రక్షించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. నక్కవాగులో చేరే కాలుష్య జలాలు ఏటిగట్ట లింగంపల్లి వద్ద మంజీరలో కలుస్తున్నాయని తెలిపారు. కలెక్టర్, ఇరిగేషన్, పీసీబీ క్షేత్రస్థాయి పరిస్థితిని అధ్యయనం చేసి చర్యల కోసం ప్రభుత్వానికి నివేదించాలన్నారు. లేని పక్షంలో ప్రజల్ని సమీకరించి ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు.

ఏజెన్సీ గ్రామాల్లో నీటి ఎద్దడి

వాగుల్లోని చెలమల నీరే వారికి జీవనాధారం



నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

ఏండ్లు గడిచినా ప్రభుత్వాలు మారినా ఏజెన్సీ గ్రామాల్లో మాత్రం నీటి ఎద్దడి తీరడం లేదు. వేసవికాలం ప్రారంభమైందంటే తాగు నీటి కోసం గిరిజనులు, గిరిజనేతరులు అరిగోస పడాల్సిందే. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని గిరిజన గ్రామాలైన చలపాక, బానాజీ బందం, ఎలిశెట్టిపల్లి, అల్లవారి గణపురంతోపాటు గొత్తి కోయగూడాలైన పులుకమ్మ వాగు, గుర్రాలబావి, గంటల గుంట, గుండెం గవాయి గ్రామాలన్నీ వాగు తీరం ఒడ్డు వెంబడి ఉంటాయి. ఈ గ్రామాలు రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉండటంతో బోర్లు వేసుకోవడానికి అటవీశాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ అనుమతులిచ్చినా ఊరికి ఒకటో రెండు బోర్లు మాత్రమే వేసుకోవాల్సి ఉంటుంది. ఈ బోర్లలోని నీరు చిలుము వాసనగా ఉంటుంది. ఇతర అవసరాలకు తప్ప తాగడానికి పనిచేయవు. ఒక్క ఊరికి సుమారు 150 నుంచి 200 మంది జనాభా ఉంటారు. వేసవి కాలం మొదలైతే ఈ ఊర్లో ఉన్న చెరువు నీరు కూడా అడుగంటి పోతుంది. దాంతో గిరిజనులు, గిరిజనే తరులందరూ పిల్లాపాపలతో వారి సమీపాన ఉన్న వాగు నీటిపై ఆధారపడతారు. ప్రస్తుతం ఉదయం, సాయంత్రం సమయంలో వాగుల్లోకి వెళ్లి చలమలు తీసి ఆ నీటిని తెచ్చుకుంటున్నారు. మార్చి, ఏప్రిల్, మే ఈ మూడు నెలలు మాత్రం వారికి నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది. వేసవిలో గిరిజనులు ఆ వాగుల్లో నీటినే జీవనాధారంగా భావిస్తారు. సంవత్సరాలుగా నీటి ఎద్దడి నెలకొన్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఏజెన్సీ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

12 మంది ఆర్‌ఎంపీలపై కేసులు నమోదు

తెలంగాణ మెడికల్ కౌన్సిల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా 12 మంది ఆర్‌ఎంపీలపై కేసులు నమోదు చేసినట్టు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ తెలిపింది. ఈ మేరకు మంగళవారం కౌన్సిల్ వైస్ చైర్మెన్ డాక్టర్ జి.శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లో ఎనిమిది మంది, సంగారెడ్డిలో ముగ్గురు, దుండిగల్‌లో ఇద్దరు, కామారెడ్డిలో ఒకరిపై నకిలీ వైద్యం చేస్తుండటంతో కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఆయా పోలీస్ స్టేషన్లలో ఎన్ఎంసీ 34, 54, టీఎస్ఎంపీఆర్ చట్టం 22 ప్రకారం ఈ కేసులు నమోదు చేసినట్టు వెల్లడించారు.

ఎన్నికల కేసు కొట్టేయండి

- హైకోర్టులో ఈటల పిటిషన్
- ప్రతివాదులకు నోటీసులు

నవతెలంగాణ-హైదరాబాద్

కమలాపూర్ పోలీస్ స్టేషన్లో 2021లో జరిగిన ఉప ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారంటూ తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ మేడ్చల్ మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాన్ని న్యాయమూర్తి జస్టిస్ కె లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టి ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు తదుపరి విచారణను ఏప్రిల్ ఒకటో తేదీకి వాయిదా వేశారు ఈలోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వానికి, డిఫాక్టో ఫిర్యాదుదారు ఎస్ .విజయ్, కరీంనగర్ జిల్లా ఎల్కతుర్తి తహశీల్దార్‌కు నోటీసులు జారీ చేశారు. ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘించి ఉప్పల్ గ్రామంలో బీజేపీ పార్టీ కార్యకర్త తోట సురేష్ ఇంటికి ఈటల వెళ్లడంపై కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు హైదరాబాద్‌లోని ప్రజాప్రతినిధుల కేసుల విచారణ ప్రత్యేక కోర్టులో విచారణలో ఉంది. తనపై నమోదైన కేసు అక్రమమనీ, వెంటనే కొట్టివేయాలని కోరుతూ ఈటల దాఖలు చేసిన పిటిషన్ పై తదుపరి విచారణ ఏప్రిల్ ఒకటికి హైకోర్టు వాయిదా వేసింది.

సమస్యల ఊబిలో మదర్ డెయిరీ

భూముల అమ్మకానికి రంగం సిద్ధం

రూ.35 కోట్ల అప్పుకు ఏటా నాలుగు కోట్ల వడ్డీ
నిర్వహణా లోపంతో పూర్వ వైభవం కోల్పోయిన సంస్థ
ఆస్తుల అమ్మకానికి పాలకవర్గం నిర్ణయం



నవ తెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

పాడి రైతుల శ్రేయస్సు కోసం ఏర్పాటు చేసిన నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం మదర్ డెయిరీ సమస్యల ఊబిలో కొట్టుమిట్టాడుతోంది. డెయిరీ ప్రారంభంలో లాభాల్లో నడిచింది. వచ్చిన ఆదాయంతో అనేక స్థిరాస్తులు కొనుగోలు చేశారు. ఆ తర్వాత నిర్వహణ కొరవడటం, మార్కెట్లో పోటీకి అనుగుణంగా కొత్త ఉత్పత్తులపై దృష్టిసారిం చకపోవడంతో డెయిరీ నిర్వహణ అదుపుతప్పింది. అప్పులు పేరుకుపోయాయి. పాల రైతులకు బిల్లులు పెండింగ్ పెట్టాల్సి వస్తోంది. చివరకు ఉన్న ఆస్తులను అమ్మితే తప్ప సంస్థ బయట పడే పరిస్థితులు కనిపించడం లేదని డెయిరీ పాలకవర్గం నిర్ణయించింది. 30 ఎకరాలు అమ్మి అప్పులు తీర్చాలని తీర్మానించింది.

పూర్వ వైభవం ఇలా..

నార్మల్ మదర్ డెయిరీ 2003లో స్వయంప్రతిపత్తి సంస్థగా ఏర్పడింది. సంస్థ సేకరించిన పాల మార్కెటింగ్‌కు ఢిల్లీకి చెందిన మదర్ డెయిరీతో 2005లో ఒప్పందం కుదిరింది. అప్పటి నుంచి క్రమంగా లాభాల బాటలో కొనసాగుతూ వచ్చింది.

2015 నుంచి కష్టాలు మొదలు

2015లో అమూల్ పాలను ప్యాకింగ్ చేసేందుకు వీలుగా నార్మల్ ఒప్పందం చేసుకుంది. మార్కెట్లో తమతో పోటీ ఉన్న అమూల్ పాల ప్యాకింగ్ ఒప్పందం చేసుకోవడంతో ఢిల్లీ మదర్ డెయిరీ తమ ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. దాంతో నార్మల్ మదర్ డెయిరీ బ్రాండ్‌తో తిరిగి మార్కెట్లోకి వెళ్లినా.. పోటీని తట్టుకునేలా పాల ఉత్పత్తులు, విక్రయాలపై సరైన దృష్టి కేంద్రీకరించకపోవడంతో క్రమంగా వెనకపట్టు పడుతూ వస్తోంది.

ఏటా నాలుగు కోట్ల వడ్డీ

వచ్చే ఆదాయంతో పోలిస్తే ఖర్చులు అధికంగా పెరిగి సంస్థకు గుదిబండలా మారాయి. పాలకమండలి అవగాహనా లేమితో ఆదాయానికి మించి భారం పెరిగి బ్యాంకుల్లో దశలవారీగా తీసుకున్న రుణాలు రూ.35కోట్లకు చేరాయి. ఏడాదికి రూ.4 కోట్ల వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాడి రైతుల 2 నెలల పాల బిల్లు సుమారు రూ.20 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఉద్యోగులకు తొలిసారి సగం వేతనం చెల్లించారు. మితిమీరిన రాజకీయ జోక్యం, మార్కెట్లో పెరిగిన పోటీ తదితర కారణాలతో నాడు గడించిన లాభాలతో కొనుగోలు చేసిన భూమిని నేడు అమ్మితే తప్ప పరిస్థితి గట్టెక్కే పరిస్థితి కనిపించడం లేదు. ఒకేసారి 26 మందికి ప్రమోషన్లు ఇచ్చినా నెలకు రూ.20,00,000 అదనపు భారం పడుతోంది.

భూముల అమ్మకానికి రంగం సిద్ధం

రంగారెడ్డి, నల్లగొండ నార్మల్ డెయిరీ చైర్మెన్ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో స్థిరాస్తులను విక్రయించేందుకు మెజారిటీ సొసైటీల అధ్యక్షులు ఆమోదం తెలిపారు. చిట్యాలలో సుమారు 29 ఎకరాల 30 గుంటలు, మిర్యాలగూడ శివారులోని ఎకరన్నర భూముల అమ్మకానికి రంగం సిద్ధం చేశారు. భూములను అమ్మితే రూ.50 కోట్ల వరకు సమకూరుతుంది. దాంతో అప్పులు తీర్చాలని తీర్మానం చేసినట్టు తెలుస్తోంది.

డెయిరీని చక్కదిద్దడానికి భూముల అమ్మకం
రంగారెడ్డి, నల్లగొండ నార్మల్ డెయిరీ చైర్మెన్ మధుసూదన్‌రెడ్డి

నల్లగొండ, రంగారెడ్డి నార్మల్ డెయిరీ రూ.60 కోట్ల అప్పుల్లో ఉంది. దాని నుంచి బయట పడాలంటే సంస్థకు చెందిన 30 ఎకరాల భూములు అమ్మాలని తీర్మానం చేశాం. రైతులకు రూ.20 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. బ్యాంకులో రూ.35 కోట్ల అప్పు ఉంది. డెయిరీని చక్కదిద్దడానికి తప్పనిసరి పరిస్థితుల్లో భూముల వేలం చేపడుతున్నాం.

మదర్ డెయిరీ ఆస్తులు అమ్మొద్దు



మాటూరి బాలరాజు గౌడ్
రైతు సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి

పాల రైతులకు మదర్ డెయిరీ 6 బిల్లులు, విజయడెయిరీ 2 బిల్లుల చొప్పున పెండింగ్‌లో ఉన్నవి. మదర్‌డెయిరీ పరిధిలోని పాల రైతులకు సుమారు 25 కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయి. సంస్థ 34 కోట్ల రూపాయల అప్పుల్లో కూరుకుపోయిందని, గట్టెక్కాలంటే ఆస్తులను అమ్మాలని డెయిరీ చైర్మెన్ ప్రకటించడం సరైంది కాదు. విజయ డెయిరీ పాడి రైతులకు సుమారు రూ.60 కోట్ల బకాయి పడింది. మదర్ డెయిరీ, విజయ డెయిరీ నుంచి సుమారు రూ.85కోట్లు పాల బిల్లులు రైతులకు చెల్లించాల్సి ఉంది. వాటిని వెంటనే రైతుల ఖాతాల్లో వేయాలి. మదర్ డెయిరీ సంస్థ ఆస్తులను అమ్మొద్దు. ప్రభుత్వం గ్రాంట్స్ ఇచ్చి ఆదుకోవాలి. పలు ప్రయివేటు సంస్థలు అతి తక్కువ ధరకు రైతుల నుంచి పాలు సేకరించి నష్టం కలిగిస్తున్నాయి.

సవాలుగా మారిన ఎన్ఈపీ-2020 అమలు

'త్రిభాషా ఫార్ములా'తో రాజుకున్న వివాదం

తమిళనాడు, కేంద్రం మధ్య మాటల యుద్ధం

పలు రాష్ట్రాల నుంచి వ్యతిరేకత

న్యూఢిల్లీ : కేంద్రం తీసుకొచ్చిన వివాదాస్పద జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ, 2020) ప్రస్తుతం దేశంలో తీవ్ర చర్చకు దారి తీస్తున్నది. మోడీ సర్కారుకు దాని అమలు సవాలుగా మారింది. ముఖ్యంగా, ఎన్ఈపీ తప్పనిసరి చేసిన 'త్రిభాషా ఫార్ములా' తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ఆందోళనకు కారణమవుతున్నది. హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ఆ రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్రాన్ని తప్పుబడుతున్నది. అయితే, ఏ రాష్ట్రం పైనా హిందీని బలవంతంగా రుద్దటం ఉండదని కేంద్రం అంటున్నది. ప్రస్తుతం ఇది 'కేంద్రం వర్సెస్ తమిళనాడు ప్రభుత్వం'గా మారింది.

భాషాబోధన గురించి ఎన్ఈపీ ఏం చెప్తోంది?

ఇప్పటి వరకూ అమలులో ఉన్న 1986 విద్యా విధానం స్థానంలో కేంద్రంలోని మోడీ సర్కారు ఎన్ఈపీ, 2020ను తీసుకొచ్చింది. 2030 నాటికి భారతదేశ విద్యా వ్యవస్థను మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లోని విద్యార్థులకు ఐదో తరగతి వరకు (ప్రాధాన్యంగా ఎనిమిదో తరగతి మరియు అంతకు మించి) బోధనా మాధ్యమం స్థానిక లేదా మాతృ లేదా ప్రాంతీయ భాషల్లో ఇది తప్పనిసరి చేసింది.

భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మాజీ చైర్మెన్ కె.కస్తూరీరంగన్ నేతృత్వంలోని నిపు ణులు ఎన్ఈపీ,2020ని రూపొందిం చారు. చిన్నపిల్లలు తమ మాతృ భాషలో చిన్న విషయాలు కాని భావ నలను మరింత త్వరగా నేర్చుకుని గ్రహిస్తారని సూచించారు. "రెండు నుంచి ఎనిమిది సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలు భాషలను చాలా త్వరగా నేర్చుకుంటారని పరిశోధన స్పష్టంగా చూపిస్తున్నది. బహుభాషా విధానం యువ విద్యార్థులకు గొప్ప అభిజ్ఞా ప్రయోజనాలను కల్పిస్తుంది" అని ఎన్ఈపీ 2020 డాక్యుమెంట్ తెలియజేస్తున్నది.



'అమలు తీరు పేలవం'

కేంద్రం, రాష్ట్రాల మధ్య చిచ్చు రేపుతున్న త్రిభాషా ఫార్ములా అమలు పేలవంగా ఉన్నదని విద్యావేత్తలు, నిపుణులు అంటున్నారు. ఉదాహరణకు, 1969లో తమిళంను అప్పటి హర్యానా ముఖ్యమంత్రి బన్సీలాల్ రెండో భాషగా చేశారు. అయితే, తమిళం మాట్లాడేవారు లేకపోవటంతో ఆ భాషను 2010లో దాని హోదా నుంచి తొలగించారు. ఇదేవిధంగా, ఉపాధ్యాయులు దొరకని కారణంగా హిమాచల్‌ప్రదేశ్‌లోని రాష్ట్ర విద్యా శాఖాధికారులు తెలుగు, తమిళంలను లాంగ్వేజ్ ఆప్షన్లుగా అందించలేకపోతున్నారు.

విదేశీ భాషల సంగతి ఏమిటీ?

సెకండరీ స్థాయిలో విదేశీ భాషలు ఉంటాయని ఎన్ఈపీ-2020 పేర్కొంటున్నది. ఇందులో కొరియన్, జపనీస్, థాయ్, ఫ్రెంచ్, జర్మన్, స్పెయిన్, పోర్చ్‌గీసు, రష్యన్ వంటి లాంగ్వేజేస్ ఉంటాయని వివరించింది. వాస్తవానికి విద్య అనేది ఉమ్మడి జాబితాలో ఉన్నది. కాబట్టి, కేంద్రం తీసుకొచ్చిన ఎన్ఈపీ-2020 అమలుపై రాష్ట్రాలు కూడా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అయితే, తమిళనాడుతో పాటు పలు రాష్ట్రాలు ఎన్ఈపీ-2020ని వ్యతికిస్తుండటంతో కేంద్రం, రాష్ట్రాల మధ్య వివాదం నెలకొన్నదని విద్యావేత్తలు అంటున్నారు.

త్రిభాషా విధానం అంటే ఏమిటి?



ప్రస్తుతం దేశంలో, ముఖ్యంగా కేంద్రం, తమిళనాడు మధ్య వివాదానికి దారి తీసిన త్రిభాషా విధానాన్ని ఎన్ఈపీ-2020 ప్రతి పాదిస్తుంది. ఇది 1968లో ప్రకటించిన విధానానికి భిన్నంగా ఉన్నది. ఆనాటి విధానం హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో హిందీ, ఇంగ్లీష్, ఒక ఆధునిక భారతీయ భాష (ప్రధానంగా దక్షిణ భాషల్లో ఒకటి), హిందీ మాట్లాడని రాష్ట్రాల్లో హిందీ, ఇంగ్లీష్, ఒక ప్రాంతీయ భాషలను స్టడీ చేయటాన్ని నొక్కి చెప్పింది. ఎన్ఈపీ-2020 త్రిభాషా సూత్రం ప్రకారం విద్యార్థులు తమ పాఠశాలలో మూడు భాషలను నేర్చుకోవాలని సిఫారసు చేస్తున్నది. మూడు భాషల్లో కనీసం రెండు భాషలైనా భారత్‌లో ఉండాలని వివరిస్తున్నది. దేశంలోని ఏ రాష్ట్రం పైనా భాషను బలవంతంగా రుద్దటమనేది ఉండదని స్పష్టం చేస్తున్నది. కొన్ని భాషలను ప్రోత్సహిస్తుందని వివరించింది. త్రిభాషా సూత్రంలో ఒక ఆప్షన్‌గా సంస్కృతానికి ప్రాధాన్యతనిస్తూ స్థానం కల్పించింది. తెలుగు, తమిళం, కన్నడ, మళయాళం, ఒడియా, అదనంగా పాలీ, పర్షియన్, ప్రాకృతి వంటి క్లాసికల్ లాంగ్వేజేస్ ఆప్షన్లుగా అమలులో ఉంటాయని పాలసీ డాక్యుమెంట్ వివరిస్తున్నది.

మాతృభాషలో నేర్చుకోవటాన్ని ప్రమోట్ చేయటానికి సైన్స్ వంటి హైక్వాలిటీ పుస్తకాలను మాతృ, స్థానిక భాషల్లో అందుబాటులోకి తీసుకురానున్నట్టు ఎన్ఈపీ-2020 పేర్కొన్నది. ఇందుకోసం ఎన్‌సీఈఆర్‌టీ 2004లో 104 ప్రాంతీయ భాషలు, మాండలికాలలో డిజిటల్ పుస్తకాల సెట్‌ను విడుదల చేసింది. తమ భాషల్లోకి అనువదించటమనేది సంబంధిత రాష్ట్ర విద్యా పరిశోధక, శిక్షణ కౌన్సిల్ (ఎస్‌సీఈఆర్‌టీలు)ల బాధ్యత అని ఎన్‌సీఈఆర్‌టీ అధికారులు అంటున్నారు.

ఏఐఎస్ఈఎస్ కనుగొన్నదేమిటి?

భాషలు, బోధనా మాధ్యమం గురించి దేశవ్యాప్తంగా ఎనిమిదో ఆలిండియా స్కూల్ ఎడ్యుకేషన్ సర్వే (ఏఐఎస్ ఈఎస్)ను నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) నిర్వహించింది. మెజారిటీ సంఖ్యలోని స్కూళ్లు బోధనా మాధ్యమంగా తమ మాతృభాషను కలిగి ఉన్నప్పటికీ.. 2022 నుంచి 2009 మధ్య ఈ సంఖ్య పడిపోయిందని ఈ సర్వే గుర్తించింది.

86.62 శాతం స్కూళ్లు ప్రాథమిక దశలో మాతృ భాష ద్వారా బోధన జరుపుతున్నాయి. ఏడో సర్వేలో గుర్తించిన స్కూళ్ల సంఖ్య 92.07 శాతం కావటం గమనించాల్సిన అంశం. గ్రామీణ ప్రాంతాల్లో 87.56 శాతం స్కూళ్లు, పట్టణ ప్రాంతాల్లో 80.99 శాతం పాఠశాలలు బోధనా మాధ్యమంగా తమ మాతృభాషను కలిగి ఉన్నాయి. ఏడు సర్వే ప్రకారం.. ఈ సంఖ్య గ్రామీణ ప్రాంతాల్లో 92.39 శాతం, పట్టణ ప్రాంతాల్లో 90.39 శాతంగా ఉండటం గమనార్హం.

కనీసవేతనాల సవరణ గెజిట్లను ప్రచురించండి

హైకోర్టు ఆదేశాలను వెంటనే అమలు పర్చాలి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



కనీస వేతనాల గెజిట్‌లను రాష్ట్ర ప్రభుత్వం నాలుగు వారాల్లోగా విడుదల చేయాలని హైకోర్టు ఆదేశించిన నేప థ్యంలో వెంటనే వాటిని ప్రచురించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లలో పదేండ్లకుపైగా కనీస వేతనాల సవరణ జరగలేదనీ, దీనిపై కార్మిక సంఘాలు పోరాడుతున్నా రాష్ట్ర సర్కారు పట్టించుకోవడం లేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీవోలు సవరించకుండా కార్మికులకు అన్యాయం చేసిందని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు వేతనాలు పెంచుకుండా డీఏలను కలిపి వేతనాలు పెంచినట్టు మొక్కు బడిగా కొన్ని ముసాయిదా గెజిట్‌లను ప్రచురించిందని తెలిపారు. కనీస వేతనాలు పెంచితే ప్రభుత్వాలపై పైసా భారం పడకున్నా ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. పారిశ్రామికవేత్తలకు అధిక లాభాలు గడించిపెట్టేందుకు కార్మికులకు వేతనాలు పెంచకుండా పొట్టగొడుతారా? అని నిలదీశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీసవేతనాలను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించిన కార్మికులకు ప్రయోజనం చేకూరేలా కనీస వేతనాల జీవోలను సవరించాలని కోరారు.

సిబ్బంది కొరతతో ఇబ్బంది

సాంస్కృతిక శాఖలో భర్తీకి నోచని 42 శాతం పోస్టులు



న్యూఢిల్లీ : కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతోంది. దేశవ్యాప్తంగా మ్యూజియంలు, లైబ్రరీలు, అనుబంధ సంస్థలు సహా 42 సబార్డినేట్ కార్యాలయాలను పర్యవేక్షిస్తున్న ఈ మంత్రిత్వ శాఖ తీవ్రమైన సిబ్బంది కొరతను ఎదుర్కొంటోంది. ఈ శాఖలోని 42 శాతం పోస్టులు నేటికీ భర్తీ కాలేదు. మంత్రిత్వ శాఖకు మొత్తం 280 పోస్టులు మంజూరు కాగా వీటిలో 79 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. సాంస్కృతిక శాఖకు అనుబంధంగా ఉండే ఏజెన్సీలలో ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) కీలకమైనది. ఇది దేశవ్యాప్తంగా ఉన్న 3,698 వారసత్వ కట్టడాలను పరిరక్షించాల్సి ఉంది. ఈ ఏజెన్సీ కూడా సిబ్బంది కొరతతో కూనారిల్లుతోంది. ఈ నెల 10వ తేదీ నాటికి ఏఎస్ఐలోని 45 శాతం పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. దేశ రాజధానిలో ఉన్న నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్ (ఎన్‌జీఎంఏ)లో 82, నేషనల్ మ్యూజియంలో 103 పోస్టులు భర్తీకి నోచుకోలేదు.

మంత్రిత్వ శాఖ పరిధిలో దేశంలోని 42 సబార్డినేట్ కార్యాలయాలు, స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలు, అనుబంధ సంస్థల్లో మొత్తం 15,276 పోస్టులు ఉండగా వాటిలో 6,516 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తీవ్రంగా ఉన్న సిబ్బంది కొరతను మజ్లిస్ పార్టీ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ లోక్‌సభలో ప్రస్తావించారు. ముఖ్యంగా ఏఎస్ఐలో ఖాళీలను ఆయన ఎత్తిచూపుతూ అరకొర సిబ్బందితో స్మారక చిహ్నాలను పరిరక్షిస్తామని ఎలా హామీ ఇవ్వగలుగుతున్నారని ప్రశ్నించారు. దీనిపై కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ స్పందిస్తూ ఖాళీల సమాచారాన్ని యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ దృష్టికి తీసికెళ్లామని, వాటిపై పరిశీలన జరుగుతోందని తెలిపారు. ఖాళీల భర్తీకి త్వరలోనే నియామకాలు చేపడతామని చెప్పారు.

హిందూత్వ సిద్ధాంతాన్ని ఏఎస్ఐ అమలు చేస్తోందంటూ వస్తున్న ఆరోపణలను షెకావత్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. గత పది సంవత్సరాల ఎనిమిది నెలలుగా మోడీ ప్రభుత్వం సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ (అందరి మద్దతుతో అందరి అభివృద్ధి) అనేతత్వంతో పనిచేస్తోందని ఆయన చెప్పుకొచ్చారు.

జెడ్డాలో అమెరికా, ఉక్రెయిన్ చర్చలు ప్రారంభం



జెడ్డా : అమెరికా, ఉక్రెయిన్‌ల మధ్య ఉన్నత స్థాయి చర్చలు మంగళవారం సౌదీ అరేబియాలోని జెడ్డా నగరంలో ప్రారంభమయ్యాయి. రెడ్‌సీ ఓడరేవు నగరమైన జెడ్డాలో విలాసవంతమైన హోటల్‌లో సమావేశం ప్రారంభం కాగానే అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రూబియో జర్నలిస్టులను చూసి చిరునవ్వు నవ్వగా, ఉక్రెయిన్ అధికారులు మాత్రం ముఖాల్లో ఎలాంటి భావ ప్రకటన లేకుండా కూర్చున్నారు. గత నెల 28న ట్రంప్, జెలెన్‌స్కీల మధ్య అసాధారణ రీతిలో వాదన జరిగిన నేపథ్యంలో కొత్త దౌత్యానికి నాందీ ప్రస్తావనగా ఈ చర్చలు జరుగుతున్నాయి. నల్ల సముద్రంలో నౌకల రాకపోకలకు వీలుగా కాల్పుల విరమణ, ఖైదీల విడుదల, ఉక్రెయిన్‌లో పౌరుల స్థావరాలపై జరుగుతున్న దీర్ఘశ్రేణి క్షిపణుల దాడులను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని తాము కోరనున్నట్లు ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. కాగా ఎలాంటి రాయితీలను ఇస్తున్నట్లు క్రెమ్లిన్ బహిరంగంగా ప్రకటించలేదు. నాటోలో చేరాలన్న ఆలోచనలను ఉక్రెయిన్ విడనాడితేతనే తాము దాడులు విరమిస్తామని రష్యా తేల్చి చెప్పింది. రష్యా ఆక్రమించిన ప్రాంతాలన్నీ రష్యన్ ప్రాంతాలుగా గుర్తించాలని కూడా డిమాండ్ చేస్తోంది. తాము ప్రత్యేకంగా ఎలాంటి ప్రతిపాదనలతో ఇక్కడకు రాలేదని మార్క్ రూబియో చెప్పారు. ఉక్రెయిన్ ఏం చెబుతుందో వినాలనే వచ్చామన్నారు. ఏం చర్యలు చేపట్టడానికి వారు సుముఖంగా వున్నారో తెలియాలని అన్నారు.

పునర్విభజనపై డీఎంకే సదస్సుకు బీజేడీ

భువనేశ్వర్ : లోక్‌సభ స్థానాల పునర్విభజనపై 22న డీఎంకే నిర్వహించనున్న సదస్సుకు బీజేడీ హాజరుకానుంది. ఈ సదస్సుకు హాజరుకావాలని డీఎంకే నాయకులు దయానిధి మారన్, తమిళనాడు మంత్రి టీఆర్‌బి రాజాజ శ్రీ పట్నా యక్ స్వయంగా అందించిన ఆహ్వానం తరువాత బీజేడీ అధ్యక్షులు నవీన్ పట్నాయక్ ఈ సదస్సులో పాల్గొనడానికి అంగీకారం తెలిపారు. ఈ విషయాన్ని బీజేడీ ఉపాధ్యక్షులు దేబీ ప్రసాద్ మిశ్రా విలేకరులకు తెలిపారు. 'ఇద్దరు సభ్యుల డీఎంకే ప్రతినిధి బృందం మంగళవారం తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ సందేశాన్ని నవీన్ పట్నాయక్‌కు తెలియజేసింది, డీలిమిటేషన్ సమస్యపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశాలపై చర్చల్లో పాల్గొనాలని కూడా అభ్యర్థించారు. కాబట్టి మార్చి 22న జరిగే సమావేశానికి హాజరు కావడానికి నవీన్ తన సమ్మతిని తెలిపారు' అని తెలిపారు. దయానిధి మారన్ మాట్లాడుతూ 'సదస్సుకు పట్నాయక్‌ను సమావేశానికి ఆహ్వానించడానికి వచ్చాం. అన్యాయమైన డీలిమిటేషన్ మన రాష్ట్రాలకు మంచిది కాదనే మా ఆందోళనలు, భయాలను పట్నాయక్‌కు వెల్లడించాం. తమిళనాడు, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, పంజాబ్ అనే ఏడు రాష్ట్రాలు డీలిమిటేషన్ ద్వారా తీవ్రంగా నష్టపోతాయి. ఎంపీ స్థానాల్లో మా వాటా తగ్గుతుంది, ఉత్తరాది రాష్ట్రాల వాటా పెరుగుతుంది' అని తెలిపారు.

డైట్ చార్జీలు రూ.96 కోట్ల బకాయిలను విడుదల చేయండి

సీఎం రేవంత్‌రెడ్డికి జూలకంటి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డైట్, ఇతర చార్జీలు రెండేండ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న రూ.96 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంగళవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కీం (బీఏఎస్) ద్వారా ఎస్సీ,ఎస్టీ పేద పిల్లలను జిల్లాల్లో గుర్తింపు పొందిన ప్రయివేటు పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం చదివిస్తున్నదని వివరించారు. ఈ స్కీం 1990 నుంచి కొనసాగుతున్నదనిగుర్తు చేశారు. ఒకటి నుంచి పదో తరగతి వరు ప్రయివేటు విద్యాసంస్థల్లో సీట్లు పొందిన విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతోపాటు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫారాలు, బూట్లు వంటి వాటిని విద్యాసంస్థలే సమకూరుస్తున్నాయని తెలిపారు. మెరిట్ లేకున్నా, ప్రవేశ పరీక్ష పెట్టకుండా నేరుగా లాటరీ పద్ధతిన విద్యార్థులను ఎంపిక చేసి ప్రయివేటు విద్యాసంస్థల్లోకి రాష్ట్ర ప్రభుత్వం పంపుతున్నదని పేర్కొన్నారు. ఎన్ని ఇబ్బందులున్నా వాటిని అధిగమించి ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు 90 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారని వివరించారు. ఒక్కో విద్యార్థికి గురుకులాల్లో ఏడాదికి రూ.42 వేలు, డేస్కాలర్‌కు రూ.28 వేల చొప్పున చెల్లిస్తున్నదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 26 వేల మంది పేద ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు ఈ పథకం కింద విద్యనభ్యసిస్తున్నారని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఏడాదికి మూడు దఫాలుగా ప్రయివేటు విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం డైట్, ఇతర చార్జీలను సుమారు రూ.96 కోట్లు బకాయిలున్నట్టు తెలుస్తున్నదని వివరించారు. ప్రభుత్వానికి దళిత, గిరిజన విద్యార్థి సంఘాలతోపాటు ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు అనేకసార్లు విన్నవించుకున్నా ఇంత వరకు చెల్లించడం లేదని తెలిపారు. ఈ బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెల్లించేంత వరకు తల్లిదండ్రులే ఫీజులను చెల్లించాలంటూ ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని తెలిపారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతారనీ, చదువులను కొనసాగించలేని పరిస్థితి ఏర్పడే ప్రమాదముందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న రూ.96 కోట్ల బకాయిలను మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



కులదురహంకారులకు తగిన గుణపాఠం

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

నవతెలంగాణ- చిట్యాల

ప్రణయ్ హత్య కేసులో నల్లగొండ జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పు కులదురహంకారులకు గుణపాఠం చెబుతుందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. చిట్యాల మండల కేంద్రంలోని మేకల లింగయ్య స్మారక భవనంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయస్థానం, పోలీసు అధికారుల కృషి వల్ల ఈ కేసులో న్యాయం గెలిచిందన్నారు. హంతకుడికి ఉరి శిక్ష, సహకరించిన వారికి యావజ్జీవ శిక్ష పడిందని చెప్పారు. ప్రణయ్ కుటుంబానికి రక్షణగా, దోషులకు శిక్ష పడే విధంగా పని చేసిన వారందరికీ ధన్యవాదాలు, అభినం దనలు తెలిపారు. అయితే, యాదాద్రి భువనగిరి జిల్లాలో 2017లో జరిగిన అంబోజు నరేష్, స్వాతి ఘటనలో పోలీసులుగానీ, ప్రభుత్వంగానీ సరైన శ్రద్ధ చూపకపోవడం వల్ల కేసు కోర్టులో కొట్టేయబ డిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసును హైకోర్టులో అప్పీలు చేసి, కేసు మిస్టరీని ఛేదించాలని డిమాండ్ చేశారు. రాష్టంలో 126 కులదురహంకార హత్యలు జరిగినా, కేసుల దర్యాప్తు విషయంలో ప్రణయ్ హత్య కేసులో తీసుకున్న జాగ్రత్తలు లేకపోవడం విచారకం మన్నారు. కులాంతర వివాహాలను ప్రోత్సహిం చాల్సిన బాధ్యత ప్రజాసంఘాల మీదనే కాకుండా, ప్రజా ప్రతినిధులపై, ప్రభుత్వ యంత్రాంగంపై ఉన్నదని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంక రయ్య, నాయకులు ఐతరాజు నర్సింహా, బొబ్బిలి సుధాకర్‌రెడ్డి, ఐతరాజు యాదయ్య, మెట్టు నర్సింహా, పాలమాకుల అర్జున్, నలపరాజు శేఖర్ ఉన్నారు.

అత్యంత కాలుష్య రాజధానిగా ఢిల్లీ

న్యూఢిల్లీ : భారతదేశంలో అత్యంత కాలుష్యంగా వున్న టాప్ 20 నగరాల్లో 13 నగరాలు భారత్‌లోనే వున్నాయి. వాటిల్లో అస్సాంలోని బైర్నిహట్ ప్రథమ స్థానంలో వుందని మంగళవారం ప్రచురితమైన కొత్త నివేదిక పేర్కొంది. ప్రపంచ నగరాల్లోని వాయు నాణ్యతపై స్విస్ ఎయిర్ టెక్నాలజీ కంపెనీ ఐక్యు ఎయిర్ 2024 సంవత్సరానికి వెలువరించిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. అంతర్జాతీయంగా ఢిల్లీ అత్యంత కలుషితమైన రాజధాని నగరంగా వుందని పేర్కొంది. ప్రపంచంలోనే అత్యంత కలుషితమైన దేశంగా భారత్ 2023లో మూడో స్థానంలో వుండగా, 2024నాటికి మరింత దిగజారి ఐదవ స్థానంలోకి వచ్చింది. ప్రపంచంలోని టాప్ 20నగరాల్లో పొరుగునున్న పాకిస్తాన్‌లో నాలుగు నగరాలుండగా, చైనాలో ఒకటి వుంది. క్యూబిక్ మీటర్‌కు 50.6 మైక్రోగ్రాములు చొప్పున గతేడాది భారత్‌లో పిఎం 2.5 కాన్‌సెంట్రేషన్‌ల్లో ఏడు శాతం క్షీణత నమోదైంది. 2023లో ఇది 54.4 మైక్రోగ్రామ్స్‌గా వుంది. గాలి నాణ్యత ఢిల్లీలో చాలా అధ్వాన్న స్థితికి చేరుకుంది. 2023లో క్యూబిక్ మీటర్ గాలిలో 102.4 మైక్రో గ్రాములుండగా, 2024కి వచ్చేసరికి అది 108.3కి చేరుకుంది. భారత్‌లోని అత్యంత కలుషితమైన నగరాల్లో బైర్నిహట్, ఢిల్లీ, పంజాబ్‌లోని ముల్లాన్‌పూర్, ఫరిదీబాద్, లోని, గురుగ్రామ్, గంగానగర్, గ్రేటర్‌నొయిడా, భివాండి, ముజఫర్‌నగర్, హనుమాన్‌ఘడ్, నొయిడాలు వున్నాయి. డబ్ల్యుహెచ్‌ఓ పరిమితి విధించిన కాలుష్యం కన్నా 10రెట్లు అధికంగా వున్న నగరాలు భారత్‌లో 35శాతం వున్నాయని నివేదిక పేర్కొంది. డిస్టిలరీలు, ఉక్కు, స్టీల్ ప్లాంట్లతో సహా స్థానిక ఫ్యాక్టరీల కారణంగా అస్సాం, మేఘాలయ సరిహద్దుల్లో వున్న బైర్నిహట్ నగరంలో అధిక స్థాయిలో కాలుష్యం నెలకొంది.

సంపాదకీయం

కొత్త నిబంధనల దారెటూ?

పైనుండి నరుక్కొచ్చే పనిలో బీజేపీ ఉంది. అందుకు యూజీసీని వాడుకుంటోంది. యూనివర్సిటీల్లో కుల వివక్షపై ఏనాటి నుండో చర్చ ఉన్నా రోహిత్ వేముల, పాయల్ తడ్విల ఆత్మహత్య తర్వాత దేశంలో ఇది తీవ్రమయ్యింది. 2012 నాటి థోరట్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తుండగా, సంఘ్‌పరివార్ కనుసన్నల్లో రూపొందించిన కొత్త నిబంధనలు అమలు చేయడానికి యూజీసీ ప్రయత్నిస్తోంది. కడుపు కోతకు గురైన తల్లులేమో కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

యూనివర్సిటీల్లోని కులవివక్షను తట్టుకోలేక రోహిత్ వేముల, పాయల్ తడ్వి ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు అప్పట్లో దేశం యావత్తును శోక సంద్రంలో ముంచేశాయి. తమలా మరే తల్లీ కడుపు కోతకు గురికాకూడదని వారి తల్లులు పోరాటానికి దిగారు. అందులో భాగంగానే 2019 ఆగస్టులో విద్యాసంస్థల్లో వివక్షను నిర్మూలించేలా చర్యలు చేపట్టాలని కొన్ని డిమాండ్లను రూపొందించి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీటిలో అత్యంత ముఖ్యమైనది 2012లో యూజీసీ రూపొందించిన నిబంధనను పటిష్టంగా అమలు చేయడం. ఆరేండ్ల తర్వాత పిటిషన్ ఈ జనవరిలో రెండోసారి విచారణకు వచ్చింది. పిటిషనర్ల డిమాండ్లపై సమాధానం ఎందుకు చెప్పలేదని యూజీసీపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో యూజీసీ గత నెలలో హడావుడిగా తన ముసాయిదా నిబంధనలు విడుదల చేసింది. పాత నిబంధల స్థానంలో వీటిని అమలు చేస్తామంటూ ప్రకటించింది.

> 2012లో యూజీసీ మాజీ చైర్మెన్ డాక్టర్ సుఖ్‌దేవ్ థోరట్ నేతృత్వంలో ఏర్పడిన కమిటీ ఆనాటి నిబంధనలను రూపొందించింది. విశ్వవిద్యాలయాల్లో కుల వివక్ష అనే అంశంపై విస్తృతంగా అధ్యయనం చేసిన వ్యక్తి ఆయన. కానీ నేడు కొత్త నిబంధనలను రూపొందించిన కమిటీని పరిశీలిస్తే ఇందులోని సభ్యులందరూ కాషాయ దళానికి వారసులే అని తేలింది. పైగా కమిటీలో ఒక్క దళితుడుకి మాత్రమే అవకాశం కల్పించారు. అలాంటప్పుడు ఆ ముసాయిదా ఎవరికి అనుకూలంగా ఉంటుందో ఇట్టే ఊహించవచ్చు. అందుకే మేధావులు, విద్యావేత్తలు, విద్యార్థులు ముక్తకంఠంతో దీన్ని వ్యతిరేకిస్తున్నారు.



తమ పిటిషన్‌లో ఆ తల్లులు గత యూజీసీ నిబంధనలను విశ్వవిద్యాలయాల్లో పటిష్టంగా అమలు చేయాలని కోరారు. అయితే నేటి యూజీసీ వారేమో ఉన్న నిబంధనలను మార్పులు చేసి వాటిని అమలు చేస్తామంటున్నారు. ఇక్కడే అసలు కిటుకు దాగుంది. నిజానికి కొత్త నిబంధనలు రూపొందించాలని వారు కోరలేదు. కోర్టు కూడా కొత్త నిబంధనలను రూపొందించమని యూజీసీకి చెప్పలేదు. సరే, చేసిన ఆ మార్పులైనా కులవివక్షను అంతం చేసేలా ఉన్నాయా అంటే అదీ లేదు. ఉన్న నిబంధనలను కూడా నీరుకారుస్తున్నాయి.

కొత్త నిబంధనల ప్రకారం, చేసిన ఫిర్యాదు తప్పని తేలితే ఫిర్యాదుదారుపై చర్యలు తీసుకోవచ్చంటూ విద్యా సంస్థలకు యూజీసీ ఆదేశాలు జారీ చేసింది. ఇది అత్యంత ప్రమాదకరం. యూనివర్సిటీల్లో వివక్షను రూపుమాపడం కంటే, తప్పుడు కేసులకు జరిమానాలు విధించాలన్న తపనే యూజీసీలో ఎక్కువగా ఉన్నట్టు దీన్ని బట్టి కనిపిస్తోంది. పైగా ఈ నిబంధనను అడ్డుపెట్టుకొని ఫిర్యాదులో వాస్తవం ఉన్నప్పటికీ తప్పుడు ఫిర్యాదుగా చిత్రీకరించే అవకాశం ఉంటుంది. అంతేకాదు అసలు ఫిర్యాదు చేయడానికే భయపడే ప్రమాదమూ లేకపోలేదు. ఇక ఓబీసీల ప్రస్తావనే ముసాయిదాలో లేదని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సమానత్వం సాధించడం కోసం ఏర్పాటు చేసే ఈక్విటీ కమిటీలకు సంబంధించిన నిబంధనలు కూడా ఆందోళన కలిగించేలా ఉన్నాయనే వాదన కూడా బలంగా వినిపిస్తోంది. ఇలా ఎవరికీ అక్కరకు రాని ఈ కొత్త మార్పులను యూజీసీ ఎవరి ప్రయోజనం కోసం చేసినట్టో!

2012 నాటి నిబంధనల్లో కుల వివక్షను రూపుమాపేందుకు అవసరమైన ఎన్నో క్లాజులు ఉన్నాయి. విశ్వ విద్యాలయాల్లో వివక్ష ఎన్ని రకాలుగా జరుగుతుందో స్పష్టంగా వివరించారు. అంతేకాదు కులతత్వం ఎలా వేళ్లూనుకుంటోందో కూడా చెప్పారు. అయితే కొత్త నిబంధనల్లో వీటి ప్రస్తావనే లేకపోవడం గమనార్హం. నిజానికి మేధావులకు నిలయాలైన విశ్వవిద్యాలయాలను తమ గుప్పెట్లో పెట్టుకొని దేశ వ్యాప్తంగా మతోన్మాదాన్ని పెంచి పోషించాలని బీజేపీ ఎప్పటి నుండో పావులు కదుపుతోంది. ఇప్పటికే యూనివర్సిటీలలో తమకు అనుకూలమైన వారిని వీసీలుగా నియమించుకొని యథేచ్ఛగా తన ఎజెండాను ముందుకు తీసుకెళుతోంది. ఇక యూజీసీనైతే తన ఆధీనంలో ఉంచుకుని ఇష్టానుసారం వాడుకున్నది. దీనికి నిదర్శనమే ఈ కొత్త నిబంధనలు.

వాస్తవానికి 2012లో యూజీసీ మాజీ చైర్మెన్ డాక్టర్ సుఖ్‌దేవ్ థోరట్ నేతృత్వంలో ఏర్పడిన కమిటీ ఆనాటి నిబంధనలను రూపొందించింది. విశ్వవిద్యాలయాల్లో కుల వివక్ష అనే అంశంపై విస్తృతంగా అధ్యయనం చేసిన వ్యక్తి ఆయన. కానీ నేడు కొత్త నిబంధనలను రూపొందించిన కమిటీని పరిశీలిస్తే ఇందులోని సభ్యులందరూ కాషాయ దళానికి వారసులే అని తేలింది. పైగా కమిటీలో ఒక్క దళితుడుకి మాత్రమే అవకాశం కల్పించారు. అలాంటప్పుడు ఆ ముసాయిదా ఎవరికి అనుకూలంగా ఉంటుందో ఇట్టే ఊహించవచ్చు. అందుకే మేధావులు, విద్యావేత్తలు, విద్యార్థులు ముక్తకంఠంతో దీన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికైనా యూజీసీ తన తప్పును సరిదిద్దుకోవాలి. కాషాయ పాలకులకు జీ హుజూర్ అనకుండా స్వతంత్రంగా వ్యవహరించాలి. ఎలాంటి మార్పులు లేకుండా ఆ తల్లులు కోరినట్టు 2012 నాటి నిబంధనలనే పటిష్టంగా అమలు చేయాలి. మరో రోహిత్ వేములను బలికాకుండా, మరో తల్లి కడుపు కోతకు గురికాకుండా చూడాలి.

మెయిల్ @ నవతెలంగాణ

రేషన్ కార్డులకు మోక్షమెప్పుడు?

పేదల సంక్షేమం, వివిధ పథకాల అర్హుల గుర్తింపు కోసం ప్రభుత్వం రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటుంది. అలాంటి ప్రాధాన్యత ఉన్న రేషన్ కార్డుల మంజూరు విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వమైన రేషన్ కార్డులిస్తుందేమోనని ప్రజలు గంపెడాశతో ఎదురుచూస్తుంటే కాలయాపనే కనిపిస్తున్నది. రేషన్ కార్డులు కావాలంటే ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ఆర్భాటం చేసింది. దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా కార్డుల జారీలో అతీగతి లేదు. దీని మూలంగా పేదలు అనేక సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు నలభై లక్షల మందికి పైగారేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రతి సంవత్సరం కుటుంబాల సంఖ్య పెరుగుతున్నప్పటికీ దానికి అనుగుణంగా రేషన్ కార్డుల సంఖ్య మాత్రం పెరగటం లేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మాటలు పేపరు ప్రకటనకే పరిమితమయ్యాయి తప్ప కార్డులు మాత్రం వచ్చింది లేదు. రేషన్ కార్డుల కోసం మీసేవా కేంద్రాల్లో దరఖాస్తులను చేసుకోవాలని సర్కార్ చెప్పగా అక్కడ కూడా వంద రూపాయలు ఖర్చు చేసి దరఖాస్తు చేసుకుంటే రేపు,మాపు, ఉగాది పండగకు కార్డులిస్తామంటూ వాయిదాలు వేస్తున్నారే తప్ప పేద ప్రజల సమస్యల్ని అర్థం చేసుకోవడం లేదు.

ఈ పదకొండు సంవత్సరాల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది నూతనంగా వివాహం చేసుకున్నవారు పెళ్లి తర్వాత ఉమ్మడి కుటుంబం నుండి విడిపడిన కుటుంబాలు లక్షల సంఖ్యలో ఉన్నవి.కాని వారికి నేటికీ రేషన్ కార్డులు లేవు. రేషన్ కార్డు కావాలని తహసీల్దార్ మీసేవా కేంద్రాల చుట్టూ పేదలు చెప్పులు అడిగేలా తిరుగుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. కొత్తగా వివాహం చేసుకుని పిల్లలు పుట్టి సంవత్సరాలు గడుస్తున్నా రేషన్ కార్డులు వారికి లేకపోవడం వల్ల పౌరసరఫరాల ద్వారా పంపిణీ చేసే రేషన్ బియ్యం అందడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టామంటున్న ఆరు గ్యారెంటీ స్కీములతో పాటు పలు సంక్షేమ పథకాలకు అర్హతకు కూడా ఇదే రేషన్ కార్డు తప్పనిసరి చెబుతున్నారు.మరి అలాంటడప్పుడు రేషన్‌కార్డులు ఇవ్వకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని దరఖాస్తుదారులు వాపోతున్నారు.ముఖ్యంగా ప్రభుత్వ సబ్సిడీ స్కీములు, విద్యార్థుల స్కాలర్ షిప్‌లు, ఫ్యామిలీ, ఇన్కమ్ సర్టిఫికెట్, ఉచిత కరెంటు, సబ్సిడీ గ్యాస్, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రుణమాఫీ ఇవి గాక అనేక ప్రభుత్వం ద్వారా లబ్ది పొందే అనేక అవసరాలకు రేషన్ కార్డులేక పేదలు తీవ్రంగా నష్టపోతున్నారు.పేదలకు ఎంతో అవసరమైన రేషన్ కార్డుల ప్రాధాన్యతను అర్థం చేసుకుని తెలంగాణ ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇకనైనా కార్డులు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

- మట్టిపెల్లిసైదులు, 8106778287

ట్రంప్ యాభై రోజుల పాలన : మాంద్య భయంతో స్టాక్‌మార్కెట్ల పతనం!



ఎం కోటేశ్వరరావు
8331013288

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అధికారానికి వచ్చి యాభై రోజులు దాటింది. రోజుకొక మాట, ఎప్పుడేం చేస్తాడో తెలియని అనిశ్చితి ప్రపంచాన్నే కాదు, అమెరికాను సైతం ఆవరించింది. ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారే అవకాశం ఉందా అన్న ప్రశ్నకు 'చెప్పలేను, ఇప్పుడు సంధికాలంలో ఉన్నాం' అన్న ట్రంప్ వ్యాఖ్యతో సోమవారం నాడు అమెరికా స్టాక్ మార్కెట్ భారీగా పతనమైంది. నాలుగు లక్షల కోట్ల డాలర్ల మేర సంపద విలువ పడిపోయింది. ఈ ప్రభావంతో చైనా, హాంకాగ్ స్టాక్ మార్కెట్లు కూడా మంగవారం నాడు పతనమైనా తిరిగి కోలుకున్నట్లు వార్తలు. గత ఏడాది కాలంగా కొంతమంది మాంద్య భయాలను వ్యక్తం చేస్తున్నారు. అయితే ట్రంప్ గెలిస్తే నివారిస్తాడని అనేక మంది ఆర్థికవేత్తలు ఆశలు పెట్టుకున్నారు. వర్తమాన పరిణామాలను బట్టి సందేహమే అని పెదవివిరుస్తున్నారు." జోశ్యాలను నేను అసహ్యించుకుంటాను. మనం చాలా పెద్ద కసరత్తు చేస్తున్నాం గనుక సంధికాలం ఉంటుంది. అమెరికాకు సంపదలను తిరిగి తీసుకువస్తున్నాం, అదే పెద్ద విషయం. అది కొంత సమయం తీసుకోవచ్చు గానీ మనకు ఎంతో గొప్పది." అని ఆదివారం నాడు ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు. చైనాపై సుంకాల గురించి మాట మార్చలేదు గానీ మెక్సికో, కెనడాల మీద అమలు జరుపుతానని ఒక మాట, నెల రోజుల వాయిదా అని మరో మాట, అంతలోనే అబ్బే అదేం లేదంటూ చేస్తున్న ప్రకటనలు కొంత గందరగోళానికి దోహదం చేస్తున్నాయి. రానున్న పన్నెండు నెలల కాలంలో మాంద్య అవకాశాలు 15 నుంచి 20శాతానికి పెరిగినట్లు శుక్రవారం నాడు గోల్డ్‌మన్ శాచస్ ప్రకటించింది. ట్రంప్ ప్రకటించిన సుంకాలు అమల్లోకి వస్తే ధరలు,ద్రవ్యోల్బణ పెరుగుదలతో వృద్ధి రేటు దెబ్బతిని మాంద్యంలోకి పోవచ్చని స్టాక్‌మార్కెట్‌లో మదుపుదార్లు భయపడుతున్నారు.

ఉక్రెయిన్ సంక్షోభ ముగింపుకోసం అమెరికా,ఉక్రెయిన్ ప్రతినిధులు మరోసారి మంగళవారం నాడు సౌదీ అరేబియా నగరం జెడ్డాలో సమావేశం జరిపారు. సంప్రదింపులకు తాను పూర్తిగా కట్టుబడి ఉన్నట్లు సోమవారం నాడే అక్కడకు చేరుకున్న జెలెన్‌స్కీ ప్రకటించాడు. యుద్ధం ప్రారంభమైన మరుసటి రోజునుంచే తాము శాంతిని కోరుతున్నామని, కొనసాగటానికి రష్యాయే కారణమని సామాజిక మాధ్యమంలో ఆరోపించాడు. ఒకవైపు మిలిటరీ సాయం, గూఢచార సమాచార అందచేత నిలిపివేసి ఉక్రెయిన్ మీద, దారికి రాకపోతే మరిన్ని ఆంక్షలు విధిస్తానని రష్యాను ట్రంప్ బెదిరించాడు. తాము ఇరుపక్షాల పట్ల సమవైఖరితో ఉన్నట్లు కనిపించేందుకు ఒక ఎత్తుగడగా ఇలా చేసినట్లు కొందరు చెబుతున్నారు. పుతిన్ దాడులను మరింతగా పెంచినట్లు కనిపిస్తోంది.తమ కురుస్కు ప్రాంతంలో తిష్టవేసిన జెలెన్‌స్కీ సేనలను అదుపులోకి తెచ్చుకొనేందుకు రష్యా ఏడువైపుల నుంచి చక్రబంధాన్ని బిగిస్తున్నట్లు వార్తలు. దీన్ని బ్రిటన్ మిలిటరీ గూఢచారులు కూడా ధృవీకరించారు. ఉక్రెయిన్ వైపు నుంచి కురుస్కు వచ్చే రోడ్లను మూసివేసినట్లు చెబుతుండగా తమకు ఎలాంటి ముప్పులేదని జెలెన్‌స్కీ మిలిటరీ ప్రకటించింది. కొద్ది నెలల క్రితం ఉక్రెయిన్ సేనలు ఈ ప్రాంతంలో పదమూడువేల చదరపు కిలోమీటర్ల మేర రష్యా ప్రాంతాన్ని ఆక్రమించుకున్నాయి. దాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవటం కంటే రష్యా ఉక్రెయిన్ మీద దాడులు కేంద్రీకరించింది. రష్యాతో జరిపే చర్చల్లో తాను ఆక్రమించుకున్న ప్రాంతాన్ని తురుపుముక్కగా వినియోగించు కోవాలని జెలెన్‌స్కీ చూశాడు. అయితే దాని గురించి పుతిన్ ఎలాంటి ప్రస్తావన తేవటం లేదు. ఫిబ్రవరి నాటికి 800 చదరపు కిలోమీటర్ల మేర స్వాధీనం చేసుకున్నట్లు ఇప్పుడు మిగిలిన ప్రాంత విముక్తికి కేంద్రీకరించినట్లు వార్తలు. రష్యన్ల మాదిరే క్లిష్టమైన నిర్ణయాలు చేసేందుకు జెలెన్‌స్కీ సిద్ధం కావాలని జెడ్డాకు వస్తూ అమెరికా విదేశాంగ మంత్రి మారియో రూబియో విమానంలో విలేకర్లతో చెప్పాడు.

ఏం జరుగుతుందో చూద్దామన్నట్లుగా ఉన్న ఐరోపా యూనియన్ మంగళవారం నాడే పారిస్‌లో భేటీ అయింది. ముప్పై దేశాలు పాల్గొంటాయని చెబుతున్న ఈ సమావేశాల్లో ఉక్రెయిన్ భద్రత గురించి చర్చించనున్నారు. ఒకవేళ శాంతి ఒప్పందం కుదిరితే రష్యా మరోసారి దాడులు జరపకుండా చూడటం వంటి అంశాలు వీటిలో ఉన్నాయి. శనివారం నాడు బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్ ప్రపంచ నేతలతో అంతర్జా లంలో మాట్లాడేం దుకు నిర్ణయించారు. కలసి వచ్చే వారితో ఒక కూటమి ఏర్పాటు చేస్తామని గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే.అమెరికాతో తాము దగ్గర కావటం తమ ప్రయోజనాలకు భంగకరమని బ్రిటన్ భావిస్తున్నదని రష్యన్ విదేశీ గూఢచార సంస్థ ఒకటి పేర్కొన్నది.గూఢచర్య ఆరోపణలతో ఇద్దరు తమ దౌత్యవేత్తలను బహిష్కరిస్తూ రష్యా తప్పుడు ఆరోపణలు చేసిందని బ్రిటన్ ఆరోపించింది. ఇదే తొలిసారి కాదని గతంలో కూడా ఇలాగే చేసిందని పేర్కొన్నది. గతేడాది ఏడుగురు బ్రిటీష్ దౌత్య సిబ్బందిని రష్యా ఇదే ఆరోపణలతో బహిష్కరించింది. తాజా బహిష్కరణకు ముందు లండన్‌లోని రష్యా దౌత్యసిబ్బందిలో ఒకరి నియామకాన్ని రద్దుచేసింది, కార్యాలయ వ్యవహారాలను పరిమితం కావించింది. దీనికి ప్రతిగా రష్యా బ్రిటీష్ దౌత్యవేత్తలను బహి ష్కరించింది.వారు తప్పుడు సమాచారంతో రష్యాలో ప్రవేశించినట్లు తెలిపింది. తొలి రోజుల్లో ఉక్రెయిన్ శాంతి ఒప్పందానికి ముందుకు వచ్చినప్పటికీ బ్రిటన్ అడ్డుపడినట్లు గతంలో వార్తలొచ్చాయి, అప్పటి నుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు సజావుగా లేవు. తాజాగా ఉక్రెయిన్‌కు మద్దతుగా అనేక దేశాలను బ్రిటన్ సమీకరిస్తున్నది. ఉక్రెయిన్‌కు శాంతి పరిరక్షణ పేరుతో మిలిటరీని పంపితే తీవ్ర పర్యవసానాలు ఉంటాయని, ఆస్ట్రేలియాను అక్కడి రష్యా రాయబార కార్యాలయం ఒక ప్రకటనలో హెచ్చరించింది. పశ్చిమ దేశాల బూట్ల చప్పుళ్లను చూస్తూ ఊరుకోబోమని పేర్కొన్నది. తమ గడ్డ నుంచి రిమోట్ ద్వారా ప్రయోగించే 45లక్షల డ్రోన్లను తయారు చేయనున్నట్లు ఉక్రెయిన్ ప్రకటించింది. వాటిలో బాంబులను పెట్టి సరిహద్దులో లేదా రష్యా ఆధీనంలోని ప్రాంతాల మీద దాడులకు వీటిని వినియోగిస్తారు.

అనూహ్యమైన రాజకీయ పరిణామాల పూర్వరంగంలో చైనా మధ్యవర్తిత్వంతో ఉప్పు నిప్పుగా ఉన్న సౌదీ అరేబియా, ఇరాన్ రాజీకి వచ్చి సాధారణ సంబంధాలు నెలకొల్పుకుంటున్నాయి. రాజు మహమ్మద్‌బిన్ సల్మాన్ అధికారానికి వచ్చాక అమెరికాకు దూరం జరుగుతూ అంతర్జాతీయ సమావేశాలకు తటస్థ వేదికగా తయారవుతున్నారు. అరబ్‌లీగ్ సమావేశాలు అక్కడే జరిగాయి, ఉక్రెయిన్‌పై చర్చలకు సైతం తెరతీశారు. మధ్య ప్రాచ్యంలో తిరుగులేని శక్తిగా కనిపించేందుకు చూస్తున్నారు. అందరూ ఎదురుచూస్తున్న శాంతి కావాలో లేదో ఉక్రెయిన్ తేల్చుకోవాలని సౌదీ చర్చలపై రష్యా స్పందించింది. సముద్ర, వాయుదాడుల నిలిపివేతకు ఒప్పందం కుదుర్చుకోవాలని ఉక్రెయిన్ ప్రతిపాదించే అవకాశం ఉందని, మరోసారి రష్యా దాడులు జరగకుండా రక్షణ కోసం పట్టుబట్టవచ్చని వార్తలు. గతంలో ఐరోపా యూనియన్ కూడా దీన్నే ప్రతిపాదించింది. వీటిని మాత్రమే సులభంగా పర్యవేక్షించవచ్చని చెబుతున్నారు. ఈ వారంలో అమెరికాతో చర్చలు జరిగే అవకాశం లేదని, ఆవైపు నుంచి ఎలాంటి వర్తమానం రాలేదని రష్యా విదేశాంగశాఖ ప్రకటించింది. వారితో సంబంధాల పునరుద్ధరణ గురించి సంప్రదింపులు ప్రాథమికదశలో ఉన్నాయని రష్యా ప్రతినిధి దిమిత్రి పెట్కోవ్ చెప్పాడు. మార్గం ఎంతో క్లిష్టంగా, సుదీర్ఘంగా ఉందని అయినప్పటికీ రెండు దేశాల నేతలు రాజకీయ సంకల్పాన్ని ప్రకటించారని అన్నాడు.ఉక్రెయిన్‌కు తన స్టార్‌లింక్



ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలను నిలిపివేసిన ఎలన్ మస్క్ ప్రశ్నించిన వారిని 'మీరెంత, మీ బతుకెంత నోరు మూసుకోండి' అంటూ విరుచుకుపడుతున్నాడు.తన సేవలు నిలిపివేస్తే జెలెన్‌స్కీ సేనలు కుప్పకూలిపోతాయని కూడా అన్నాడు. ఉక్రెయిన్ తరపున స్టార్‌లింక్‌కు రుసుము చెల్లిస్తున్న పోలాండ్ దీని మీద స్పందిస్తూ తాము ప్రత్యామ్నాయ కంపెనీ సేవలను ఎంచుకుంటామన్నది. మస్క్‌కు అంత అహంకారం పనికి రాదని పేర్కొన్నది. స్టార్‌లింక్ లేకపోతే ఉక్రెయిన్ ఎప్పుడో ఓడిపోయి ఉండేదని అమెరికా మంత్రి రూబియో వ్యాఖ్యానించాడు. ఈ పరిణామం తరువాత ఫ్రాంకో-బ్రిటీష్ యూటెల్‌సాట్ కంపెనీ వాటాల ధరలు 650శాతం పెరిగాయి.

సౌదీలో మంగళవారం నాడు జరిగే చర్చలతో వెంటనే తేలేదేమీ ఉండదని వాషింగ్టన్-మాస్కో సంప్రదింపులకు తెరతీస్తాయని, ఈ లోగా రష్యా తాను చేయదలచుకున్నది చేస్తుందని పశ్చిమ దేశాలు భావిస్తున్నాయి.దానికి నిదర్శనంగా గత కొద్ది రోజులుగా పెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నాయి. ఈ పూర్వరంగంలోనే ట్రంప్ ఒక ప్రకటన చేస్తూ అవసరమైతే రష్యా మీద కొత్త ఆంక్షలు, సుంకాలు విధిస్తామని ప్రకటించాడు. పుతిన్‌తో కంటే జెలెన్‌స్కీతో వ్యవహరించటం ఎంతో క్లిష్టంగా ఉందని కూడా అన్నాడు. ట్రంప్ ప్రకటనను రష్యా ఖాతరు చేయలేదు. తర్వాత దాడులను మరింతగా పెంచింది. సరిహద్దుల నుంచి రష్యా రేపే వెళ్లిపోతుందని తాము అనుకోవటం లేదని, కాల్పుల విరమణ కొన్ని నెలలు, సంవత్సరాలు ఉన్నప్పటికీ తమ తరువాత భద్రత గురించి ఉక్రెయిన్ ఆలోచిస్తున్నది. కొద్ది రోజుల క్రితం సౌదీలో జరిగిన చర్చల్లో తాత్కాలిక కాల్పుల విరమణకు షరతులతో రష్యా సుముఖత చూపింది. అంతిమంగా కుదరాల్సిన శాంతి ఒప్పందంలో ఉండాల్సిన అంశాల గురించి ముందే వెల్లడించాలని, ఏయే దేశాలు భాగస్వాములౌతాయి, శాంతి పరిరక్షణ ఎలా జరుగుతుంది అన్నది స్పష్టం కావాలని షరతులు పెట్టింది. ఉక్రెయిన్ గడ్డపై నాటో దళాల ఏర్పాటును వ్యతిరేకించింది. ఆ తర్వాతే శాంతి పరిరక్షణకు అంగీకరించే దేశాలతో కూటమి ఏర్పడాలని ఐరోపా యూనియన్ ఒక ప్రతిపాదనను ముందుకు తెచ్చింది.చైనా, భారత్ వంటి దేశాలతో కూడినది తమకు అనువుగా ఉంటుందనే సంకేతాలను రష్యా పంపింది.

అమెరికాతో సహా ప్రపంచం మొత్తాన్ని పుతిన్ వంగదీశాడని, విజయం సాధించాడని మీడియా పండితులు వాపోయారు. నాలుగోయేటా ప్రవేశించిన ఉక్రెయిన్ సంక్షోభంలో ఎటువైపు ఎందరు మరణించారన్నది ఇప్పటికీ వెల్లడికాలేదు. పశ్చిమ దేశాలు లక్షా యాభైవేల నుంచి రెండులక్షల మంది రష్యా సైనికులు మరణించినట్లు చెబుతుండగా ఇంతవరకు 5,937 మంది మరణించినట్లు రష్యా రక్షణ మంత్రిత్వశాఖ చెప్పింది.ఉక్రెయిన్ అధికారికంగా చెప్పినదాని ప్రకారం 45,100 మంది మరణించగా 3.9లక్షల మంది గాయపడ్డారు. మొత్తం 80లక్షల మంది పౌరులు విదేశాలకు శరణార్థులుగా వెళ్లటం గానీ తమ నెలవులు తప్పినట్లు చెబుతున్నారు. ఊహించని మలుపులు తిరుగుతున్న ఈ సంక్షోభంలో ఇంతకాలం రష్యాను దురాక్రమణదారుగా వర్ణించిన అమెరికా భద్రతా మండలిలో గతనెలలో ప్రవేశపెట్టిన అలాంటి తీర్మానాన్ని వీటో చేయటం విశేషం. నాటో కూటమిలో ఒక్క ఐరోపా దేశాలు మాత్రమే రష్యాను వ్యతిరేకిస్తున్నాయి. తమ రక్షణకు హామీ ఇవ్వకపోతే ఖనిజాల ఒప్పందం మీద సంతకం చేసేది లేదంటూ ట్రంప్ సమక్షంలో అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్‌తో పదినిమిషాల పాటు జెలెన్‌స్కీ వాదులాటకు దిగి వెళ్లిపోయాడు. తర్వాత మెత్తబడి మరోసారి అమెరికాతో చర్చలకు వచ్చాడు. రష్యా వైఖరిలో ఎలాంటి మార్పులు లేవు. తమ స్వాధీనంలోకి వచ్చిన ఉక్రెయిన్ ప్రాంతాలను తిరిగి అప్పగించేది లేదని, వాటిని స్వతంత్ర దేశాలుగా గుర్తించాలని పుతిన్ పట్టుబడుతున్నాడు. వాటి మీద ఆశలు వదులుకోవాలని ట్రంప్ కూడా జెలెన్‌స్కీకి చెప్పాడు. ఈ పూర్వరంగంలో సౌదీ చర్చలు ఏ పరిణామాలు, పర్యవసానాలకు దారితీసేది ఎవరూ చెప్పలేని స్థితి నెలకొన్నది. ■

> అనూహ్యమైన రాజకీయ పరిణామాల పూర్వరంగంలో చైనా మధ్యవర్తిత్వంతో ఉప్పు నిప్పుగా ఉన్న సౌదీ అరేబియా, ఇరాన్ రాజీకి వచ్చి సాధారణ సంబంధాలు నెలకొల్పుకుంటున్నాయి. రాజు మహమ్మద్‌బిన్ సల్మాన్ అధికారానికి వచ్చాక అమెరికాకు దూరం జరుగుతూ అంతర్జాతీయ సమావేశాలకు తటస్థ వేదికగా తయారవుతున్నారు. అరబ్‌లీగ్ సమావేశాలు అక్కడే జరిగాయి, ఉక్రెయిన్‌పై చర్చలకు సైతం తెరతీశారు. మధ్య ప్రాచ్యంలో తిరుగులేని శక్తిగా కనిపించేందుకు చూస్తున్నారు. అందరూ ఎదురుచూస్తున్న శాంతి కావాలో లేదో ఉక్రెయిన్ తేల్చుకోవాలని సౌదీ చర్చలపై రష్యా స్పందించింది. సముద్ర, వాయుదాడుల నిలిపివేతకు ఒప్పందం కుదుర్చుకోవాలని ఉక్రెయిన్ ప్రతిపాదించే అవకాశం ఉందని, మరోసారి రష్యా దాడులు జరగకుండా రక్షణ కోసం పట్టుబట్టవచ్చని వార్తలు.

> ఉక్రెయిన్‌కు తన స్టార్‌లింక్ ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలను నిలిపివేసిన ఎలన్ మస్క్ ప్రశ్నించిన వారిని 'మీరెంత, మీ బతుకెంత నోరు మూసుకోండి' అంటూ విరుచుకుపడుతున్నాడు.తన సేవలు నిలిపివేస్తే జెలెన్‌స్కీ సేనలు కుప్పకూలిపోతాయని కూడా అన్నాడు. ఉక్రెయిన్ తరపున స్టార్‌లింక్‌కు రుసుము చెల్లిస్తున్న పోలాండ్ దీని మీద స్పందిస్తూ తాము ప్రత్యామ్నాయ కంపెనీ సేవలను ఎంచుకుంటామన్నది.మస్క్‌కు అంత అహంకారం పనికి రాదని పేర్కొన్నది. స్టార్‌లింక్ లేకపోతే ఉక్రెయిన్ ఎప్పుడో ఓడిపోయి ఉండేదని అమెరికా మంత్రి రూబియో వ్యాఖ్యానించాడు. ఈ పరిణామం తరువాత ఫ్రాంకో-బ్రిటీష్ యూటెల్‌సాట్ కంపెనీ వాటాల ధరలు 650శాతం పెరిగాయి.

మత విద్వేష దాడులకు ప్రతిఘటన

సంఘ పరివార్ రాజకీయ వ్యవస్థలోకి అంతకంతకూ ఎక్కువగా మతతత్వ విషాన్ని ఎక్కిస్తున్నది. సామాన్య జనంలో, అధికార యంత్రాంగంలో పెరుగుతున్న దాని మద్దతుదారులు ముస్లింలపై లెక్కలేనన్ని దాడులకు కారణమవుతున్నారు. ఈ దాడులకు పిల్లలు, శిశువులు కూడా లక్ష్యాలుగా మారుతున్నారని ఇటీవలి ఘటనలు వెల్లడించడం మరీ విషాదకరం.

మహారాష్ట్ర సింధుర్గ్ జిల్లాలో చిన్న పట్టణం మాల్వన్‌లో పదిహేనేళ్ల వయసుగల ఒక ముస్లిం కుర్రాణ్ని పోలీసులు నిర్బంధించారు. అతని తల్లిదండ్రులను కూడా అరెస్టు చేశారు. వారికి వున్న చిన్నషాపును మునిసిపల్ కార్పొరేషన్ ఫిబ్రవరి 25న నేలమట్టం చేసింది. విశ్వహిందూ పరిషత్‌కు చెందిన ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన ఎఫ్.ఐ.ఆర్ దీనంతటికి ఆధారమైంది. తాను ఆ బాలుని ఇంటి ముందు నుంచి పోతుండగా ఆ అబ్బాయి భారత్-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ తిలకిస్తున్న సమయంలో పాకిస్తాన్ అనుకూల నినాదాలు వినిపించాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. తాడూ బొంగరం లేని ఈ ఫిర్యాదు ఎలాంటిదో తెలిసి కూడా ఎలాంటి దర్యాప్తు జరపకుండానే పోలీసులు ఆ బాలుడి ఇంటికి వచ్చారు. భయంతో హడలిపోయిన ఆ అబ్బాయిని బలవంతంగా లాక్కుపోయారు. అతని తల్లి దండ్రులను జైలుకు పంపేసి అతన్ని మాత్రం పరిశీలన గృహానికి చేర్చారు. భారతీయ న్యాయ సంహిత 196వ సెక్షన్ (అంటే మతం ప్రాతిపదికగా వివిధ తరగతుల మధ్య శతృత్వం సృష్టించడం), సెక్షన్ 1973(5) (జాతీయ సమైక్యతకు హాని చేసే ఆరోపణలు, నిర్ధారణలు చేయడం), సెక్షన్ 3(5) (ఒక పథకం ప్రకారం వేర్వేరు వ్యక్తులు అనేకమంది కలిసి చర్యలు చేపట్టడం) కింద వారిపై ఆరోపణలు చేశారు. మైనార్టీలకు వ్యతిరేకంగా సిగ్గుచేటైన రీతిలో పద్ధతి ప్రకారం నిరంతరాయంగా బనాయించబడుతున్న కేసులు ఇవే. నిజానికి వీటికి అసలైన కారకులుగా వున్న హిందూత్వ విద్వేష ప్రచారకులను మాత్రం యథేచ్ఛగా వదిలివేస్తున్నారు.

విధ్వంసంతో భయోత్పాతం

ఆ మరుసటి రోజున కొంతమంది మోటారు సైకిల్ ప్రదర్శన జరిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ కుటుంబాన్ని వుంటున్న చోటు నుంచి తరిమేయాలని వారు కోరారు. అదేరోజు వారి తుక్కు కొనుగోలు దుకాణాన్ని ధ్వంసం చేశారు. ఆ తల్లిదండ్రులకు బెయిల్ రాగా ఆ పిల్లవాడిని మామయ్యకు అప్పగించారు. అయితే వారి కష్టాలు అంతటితో ముగియలేదు. వారికి అసలే జీవనోపాధి లేకుండా పోయింది. వారి పిల్లాడు భయోత్పాతంతో హడలిపోయి నోరు తెరచి మాట్లాడటానికే జంకుతున్నాడు. కాగా ఈ ఘటన నుంచి సాధ్యమైనంత రాజకీయ లబ్ధి పొందడాని స్థానిక బీజేపీ ఎమ్మెల్యే నిలేష్ రాణే ప్రయత్నిస్తున్నారు. ఆ బాలుడి తండ్రి అత్యంత అనుమానాస్పదమైన వ్యక్తి అనీ, ఆ జిహాదీని జిల్లా నుంచి పంపించేయడానికి తను చేయగలిగిందంతా చేస్తానని చిందులు తొక్కుతున్నారు.చిన్న పిల్లలు విషపూరితమైన మతదాడులకు బలవుతున్నారనేది ఒకటైతే అతన్ని అరెస్టు చేసిన పోలీసులు అమానుషంగా చట్ట విరుద్ధంగా ప్రవర్తించారు. మునిసిపల్ అధికారులు అతని తండ్రి దుకాణాన్ని బుల్డోజర్లతో ధ్వంసం చేశారు. ముందుగా చట్టబద్ధమైన అనుమతి తీసుకోకుండా బుల్డోజర్లు వాడరాదనే సుప్రీంకోర్టు తాజా తీర్పును కూడా తోసి రాజని ఈ విధ్వంసానికి పాల్పడ్డారు.



PEOPLE'S DEMOCRACY

పసికందు బలి

మాల్వన్ తర్వాత దాన్ని వెంటనంటి అంతకన్నా ఘోరమైన ఘటన జరిగింది. మార్చి 2న రాజస్థాన్ అల్వార్ జిల్లాలో పోలీసులు బాగా రాత్రి వేళ ఇమ్రాన్ ఇంటిపై దాడి చేశారు. మహిళా పోలీసులు లేకుండానే వెళ్లారు. ఇమ్రాన్ భార్య రజిదా, నెల కూడా నిండని తన బిడ్డ అలిష్టా నిద్రపోతున్నారు. పోలీసులు రజిదాను ఇంట్లో నుంచి వీధిలోకి ఈడ్చడమేగాక కొంతమంది ఆమె మంచం పైకి దూకి ఆ బిడ్డను నలిపేయడంతో అక్కడే ప్రాణం పోయింది. ఆ పోలీసులు వారంట్ తీసుకుపోవడంగానీ ముందే నోటీసు జారీ చేయడంగానీ జరగలేదు. రోజు కూలీగా పనిచేసే ఇమ్రాన్‌కు ఎలాంటి నేర చరిత్ర కూడా లేకపోయినా ఇలా జరిగింది. ఆ కుటుంబ సభ్యులు పోలీసుస్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయాలని ప్రయత్నించారుగానీ ఎవరూ పట్టించుకోలేదు. ఆ మరురోజు ఇరు మతాలకూ చెందిన అనేకమంది గ్రామస్తులు దీనిపై ఎస్.పి కార్యాలయం ముందు ప్రదర్శన జరపగా ఎఫ్.ఐ.ఆర్ నమోదైంది.

పొంచిన ప్రమాద సంకేతం

మతతత్వ విద్వేషంతో పోలీసు సిబ్బంది అమ్మ చేతుల్లోని అమాయక కసికందుపై అమానుషమైన నేరానికి పాల్పడ్డం ఓ ప్రమాదకర సంకేతం. సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కరత్, రాష్ట్ర కార్యదర్శి కిషన్ పరీఖ్‌ల నాయకత్వంలో ఒక ప్రతినిధి బృందం మార్చి 4న అల్వార్‌లో ఆ కుటుంబాన్ని సందర్శించి పోలీసులు ఘోర నేరానికి పాల్పడినట్టు ధృవీకరించింది. అపరాధులైన పోలీసులపై వెంటనే చర్య తీసుకోవాలనీ, హత్యానేరం నమోదు చేసి విచారించాలని వారు డిమాండ్ చేశారు.అధికార యంత్రాంగం సుప్రీంకోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేయడానికి సిద్ధపడటం, మహిళలు, శిశువులపై పోలీసు సిబ్బంది నేరాలకు పాల్పడటం జరుగుతున్న వేళ వారికి వ్యతిరేకంగా ప్రజల నిరసన ప్రజ్వరిల్లాల్సిన అవసరముంది. సంఘ పరివార్ తీసుకొస్తున్న ఈ విభజన రాజకీయాలను గట్టిగా తిప్పికొట్టవలసిన అవసరం ఎప్పటికంటే ఇప్పుడు మరింత తక్షణావసరంగా ముందుకొస్తున్నది. అల్వార్ అమానుషం నేపథ్యంలో ఆ అభాగ్య ముస్లిం కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రజాస్వామిక శక్తులన్నీ ఒక్కుమ్మడిగా కదలవలసి వుంది.

('పీపుల్స్ డెమోక్రసీ' మార్చి5 సంపాదకీయం)

> మాల్వన్ తర్వాత దాన్ని వెంటనంటి అంతకన్నా ఘోరమైన ఘటన జరిగింది. మార్చి 2న రాజస్థాన్ అల్వార్ జిల్లాలో పోలీసులు బాగా రాత్రి వేళ ఇమ్రాన్ ఇంటిపై దాడి చేశారు. మహిళా పోలీసులు లేకుండానే వెళ్లారు. ఇమ్రాన్ భార్య రజిదా, నెల కూడా నిండని తన బిడ్డ అలిష్టా నిద్రపోతున్నారు. పోలీసులు రజిదాను ఇంట్లో నుంచి వీధిలోకి ఈడ్చడమేగాక కొంతమంది ఆమె మంచం పైకి దూకి ఆ బిడ్డను నలిపేయడంతో అక్కడే ప్రాణం పోయింది. ఆ పోలీసులు వారంట్ తీసుకుపోవడంగానీ ముందే నోటీసు జారీ చేయడంగానీ జరగలేదు. రోజు కూలీగా పనిచేసే ఇమ్రాన్‌కు ఎలాంటి నేర చరిత్ర కూడా లేకపోయినా ఇలా జరిగింది. ఆ కుటుంబ సభ్యులు పోలీసుస్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయాలని ప్రయత్నించారుగానీ ఎవరూ పట్టించుకోలేదు.

రైళ్లలో మిడిల్ బెర్త్‌లను తొలగించాలి

భారతీయ రైల్వేశాఖ మారుతున్న కాలానికి అనుగుణంగా రైళ్లలో కూడా ఆధునిక సాంకేతికతతో కూడిన వ్యవస్థలను నెలకొల్పుతున్నది. ఇది ఆహ్వానించదగ్గ విషయం. దేశంలో రైళ్లు ప్రవేశపెట్టినప్పుడు మూడో తరగతి బోగీలు కూడా ప్యాసింజర్ రైళ్లలో ఉండేవి. ఇందులో కూర్చోవడానికి సీట్లు కూడా ఉండేవి కావు. ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా ప్రస్తుతం జనరల్, స్లీపర్, థర్డ్ , సెకండ్, ఫస్ట్ ఏసీ క్లాస్ బోగీలతో రైళ్లు నడుస్తున్నాయి. గతంలో జనరల్ బోగిలో కట్టే చెక్కలతో కూడిన సీట్లుండేవి. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా వాటిని కుషన్ సీట్లుగా మార్చారు. కానీ స్లీపర్, థర్డ్, ఏసీ క్లాస్ బోగిల్లో మార్పులు తీసుకుని రాకపోవడం వల్ల ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థలో పెనుమార్పులు చోటుచేసుకోవడం వలన కొంతమంది ఐపాడ్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు విరివిగా ఉపయోగించుకుంటున్నారు. ఫలితంగా లోయర్ మిడిల్ బెర్త్‌ల్లో ప్రయాణం చేయడం కష్టతరమవుతున్నది. మారుతున్న ఆహారపు అలవాట్లు, ఇతర ఒత్తిళ్ల వలన ప్రజలు ప్రయాణంలో కూడా విశ్రాంతిని కోరుకుంటున్నారు. అందుకని స్లీపర్ , థర్డ్ ఏసీ బోగిలను పూర్తిగా తొలగించి వాటి స్థానంలో టూ టైర్ స్లీపర్, సెకండ్ ఏసీ బోగిలను ఏర్పాటు చేయాలి. టిక్కెట్ ధరలు కూడా అధికంగా వసూలు చేయ కుండా నిర్దిష్ట ధరలు నిర్ణయిస్తే ప్రయాణికులు ఎక్కువగా ఆకర్షితులై రైళ్లలో ప్రయాణం చేయుటకు ఉత్సాహం చూపుతారు.

- డి.రాంచందర్ రావు, 9849592958

రెండు పాఠశాలల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ

నవతెలంగాణ - కరీంనగర్ :


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రెండు పాఠశాలలలో సీడ్ బాల్ తయారీ, వర్మి కంపోస్ట్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎలగందల్‌లోని మోడల్ స్కూల్‌లో జరిగిన ఈ కార్యమానికి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మొక్కల పెంపకం అవశ్యకత వివరించారు. సైన్స్ ఉపాధ్యాయిని శ్రీలక్ష్మి తదితరులు మాట్లాడారు. అనంతరం వర్మి కంపోస్ట్ తయారీ విధానం, ఉపయోగం గురించి రిసోర్స్ పర్సన్ కేఎస్ అనంతాచార్య తెలిపారు. మాడిశెట్టి గోపాల్ సీడ్స్ బాల్ ఆవశ్యకతను తెలిపి పిల్లలచే వాటిని తయారు చేయించారు. అలాగే స్థానిక జెడ్పీహెచ్ఎస్ ఆరేపల్లి పాఠశాలలో కార్యక్రమం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత, సైన్స్ ఉపాధ్యాయులు నరేష్, పుష్పలత పాల్గొన్నారు. కాగా రెండు పాఠశాలలో 8, 8 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉదయం పదైనా తెరవరే..

- సాయంత్రం అయితే అంతే సంగతి
- కోటా పూర్తైందని మూసివేస్తున్న రేషన్ దుకాణాలు
- ఇబ్బందులు పడుతున్న లబ్దిదారులు
- పలు చోట్ల బియ్యం బదులుగా డబ్బులు


ఉదయం 10 గంటలకు మూసి ఉన్న రేషన్ దుకాణం


సాయంత్రం తెరుచుకోని రేషన్ షాప్


మూసివేసి ఉంచిన ఓ రేషన్ షాపులో బియ్యం స్టాక్ ఉన్న దృశ్యం

ఐదు రోజుల్లోనే కోటా పూర్తి... ఆ తర్వాత మూసివేత

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలో 30గ్రామాల్లో 34 రేషన్ దుకాణాలు ఉన్నాయి. బస్వాపూర్, బాలమల్లుపల్లె, చిన్న లింగాపూర్, నరసింహులపల్లె, దేశాయిపల్లె, అంకిరెడ్డిపల్లె, ఓబులాపూర్, చీర్లవంచ, ఇందిరమ్మ కాలనీ, తంగళ్లపల్లి, పద్మనగర్, అంకుసాపూర్, నేరెళ్ల, సారంపల్లి, రాళ్లపేట, తాడూరు, గోపాలరావుపల్లె, లక్ష్మీపూర్ తదితర గ్రామాల్లోని రేషన్ షాపుల్లో నిబంధనలు పాటించడం లేదు. ఒకటో తేదీ నుంచి పంపిణీ చేస్తున్న రేషన్ దుకాణాల్లో కేవలం ఐదు రోజుల్లోనే కోటా పూర్తవుతోంది. ఆ తర్వాత షాపులు మూసివేస్తున్నారు. లబ్ధిదారులు షాపులు మూసివేయడంతో వెనుదిరుగుతున్నారు. ఎవరైనా అడిగితే దుకాణ నిర్వాహకులు దురుసుగా సమాధానం చెబుతున్నట్టు తెలిసింది.

నిబంధనలకు నీళ్లు..

ప్రభుత్వం ఏర్పాటు చేసిన రేషన్ షాపుల్లో ఏ ఒక్క నిర్వాహకుడూ నిబంధనలు పాటించడం లేదని లబ్దిదారులు వాపోతున్నారు. 20రోజులు తెరవాల్సిన షాపులు కనీసం 10రోజులు కూడా తెరవడం లేదన లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యక్తిగత పనులకు, శుభకార్యాలకు వెళ్లినప్పుడు సమాచారం లేకుండానే షాపులు మూసివేస్తున్నారు. పలు చోట్ల మహిళల పేరుపై ఉన్న రేషన్ దుకాణాలను వారి కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్నారు. రేషన్ షాపు నిర్వాహకులు ఎవరూ షాపు నిర్వహణ చేయడం లేదు. రేషన్ షాపులకు వచ్చే లబ్ధిదారులకు ప్రథమ చికిత్స కిట్టు ఏర్పాటు చేయాలి. ఫిర్యాదు పెట్టెలు కూడా కనిపించడం లేదు.

బియ్యం బదులు డబ్బులు పంపిణీ..

లబ్ధిదారులకు వచ్చే బియ్యం కోటాను వేలిముద్ర ద్వారా తీసుకుని, బియ్యం పంపిణీ చేయకుండా నగదు రూపంలో డబ్బులు ఇస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కిలో బియ్యానికి రూ.10 నుంచి రూ.15 వరకు నగదు ఇస్తున్నారు. రేషన్ డీలర్లు పోగు చేసిన బియ్యం రాత్రిపూట ఇతరులకు కిలో రూ.20 నుంచి రూ.25 వరకు విక్రయిస్తున్నట్టు సమాచారం. తంగళ్లపల్లి మండలంలో 34రేషన్ షాపుల్లో సగం మంది లబ్ధిదారులు మాత్రమే రేషన్ బియ్యం తీసుకువెళుతున్నారని, మిగతా బియ్యాన్ని నిర్వాహకులు గన్ని సంచులతో సహా అక్రమంగా తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

> తంగళ్లపల్లి మండలంలో రేషన్ షాపుల నిర్వహణపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం పేద ప్రజల కోసం నిత్యవసర సరుకులను పంపిణీ చేసేందుకు ఏర్పాటుచేసిన రేషన్ షాపులు ఉదయం 10 గంటలైనా తెరవడం లేదు. అలాగే ఉదయం ఎనిమిది గంటలకు తెరిచిన రేషన్ షాపులు 10గంటలకే మూసివేస్తున్నారు. సొంత పనుల కోసం రేషన్ షాపు నిర్వాహకులు షాపులు మూసివేయడంతో లబ్ధిదారులు షాపుల చుట్టూ తిరగాల్సివస్తోంది. సాయంత్రం షాపులు అసలే తెరుచుకోవడం లేదు. ప్రభుత్వం నిర్దేశించిన సమయాన్ని పట్టించుకోకుండా కోటా పూర్తి కాగానే రేషన్ దుకాణాలు మూసివేస్తున్నారు. ఏ వ్యక్తి అయినా ఎక్కడైనా రేషన్ తీసుకునే అవకాశం కల్పించడంతో కోటా త్వరగా పూర్తవుతోంది. స్థానిక లబ్ధిదారులు షాపులకు వస్తే మూసి ఉంటున్నాయి.
>
> -నవతెలంగాణ , తంగళ్ళపల్లి

150 క్వింటాళ్ల పట్టివేత...

గత ఏడాది రామచంద్రాపూర్ శివారులో 150క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. బస్వాపూర్‌కు చెందిన పోషయ్య మాట్లాడుతూ, సాయంత్రం షాపులు తెరవడం లేదని, అడిగితే తమకు తీరికైనప్పుడే వస్తామని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తంగళ్లపల్లికి చెందిన బీరయ్య మాట్లాడుతూ, 10 గంటలకు వచ్చినా షాపు తెరవలేదని, ఫోన్ నంబర్ కూడా లేదని, అడిగితే కసురుకుంటున్నారని తెలిపారు.

ఇష్టానుసారం వ్యవహరిస్తే చర్యలు



ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా, ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. 20 రోజులైనా రేషన్ దుకాణం తెరచి ఉంచాలని, వచ్చిన ప్రతి లబ్ధిదారుడికి సమాధానం చెప్పాలి. అలాగే లబ్ధిదారులకు బియ్యం కు బదులు డబ్బులు ఇస్తున్నారని మా దృష్టికి వచ్చింది, అలాంటివి ఏవైనా ఎంక్వయిరీలో తేలితే మాత్రం శాఖ పరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తాం.

– తహసీల్దార్, జయంత్ కుమార్

కిమ్స్‌లో అవగాహన సదస్సు..

నవతెలంగాణ - కరీంనగర్ :



మాట్లాడుతున్న స్పీకర్

కరీంనగర్‌లోని స్థానిక కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాల, కిమ్స్ హెూటల్ మేనేజిమెంట్ కళాశాలల విద్యార్థులకు ధ్రువ కాలేజ్ ఆఫ్ మేనేజిమెంట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మేనేజిమెంట్ స్కిల్స్ మీద అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు మేనేజిమంఎట్ రంగంలో ఏ విధంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధించాలని, స్కిల్స్‌ను ఏ విధంగా పెంచుకోవాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ కళాశాలల వైస్ చైర్మెన్ పేర్యాల సాకేత్ రామారావు, జనరల్ మేనేజర్ ఆఫ్ ది హిందూ పి.రంగారెడ్డి, స్పీకల్ వావిలాల వెంకట్, కిమ్స్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అర్జున్ రావు, గౌతమ్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాన్ని ఆదుకోండి

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో మైనింజైటిస్ వ్యాధితో నీరటి సాయికుమార్(33) 15రోజుల నుండి హైదరాబాద్‌లో గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం సాయికుమార్ 15రోజుల క్రితం అనారోగ్యంతో ఉండగా సిరిసిల్లలోని ప్రైవేట్ హాస్పిటల్లో, కరీంనగర్‌లోని ప్రైవేట్ హాస్పిటలలో సుమారు రూ.2లక్షల వరకు అప్పు చేసి మెరుగైన వైద్యం అందించారు. చేతిలో ఉన్న డబ్బులు ఖర్చు అవడంతో అక్కడి నుండి వెంటిలేటర్‌పై హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్లో చేర్పించారు. చికిత్స పొందుతూ సాయికుమార్ మృతిచెందాడు. సాయి కుమార్ అంత్యక్రియలకు డబ్బులు లేకపోవడంతో కుటుంబీకులు ఇబ్బందులు పడుతున్నారు. దయా హృదయంతో అంత్యక్రియలకు, దినకర్మకు సహకరించి మానవత్వాన్ని చాటుకోగలరని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. సాయి కుమార్ బావ బత్తుల లక్ష్మణ్ ఫోన్ పే, గూగుల్‌పే నెంబర్ 9441341108కు ఆర్థిక సహాయం చేయలని కోరుతున్నారు. మృతుడికి భార్య నీరటి రమ్య, కూతురు హన్సిక(2) ఉన్నారు.


మృతిచెందిన సాయికుమార్ (ఫైల్ ఫోటో)

జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినీకి బంగారు పతకం

నవతెలంగాణ - కరీంనగర్ :


విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్

ఇంటర్నేషనల్ షావోలిన్ కుంగ్ ఫూ, పెద్దపల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి టోర్నమెంటులో కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఒద్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ తపస్విని బంగారు పతకం సాధించింది. ఈ టోర్నమెంట్లో ఏడు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు, తెలంగాణలోని పలు జిల్లాల విద్యార్థులు పాల్గొనగా తపస్విని కుంగ్ ఫు 14 సంవత్సరాల విభాగంలో బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినీ తపస్వినిని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. ఈ కార్యక్రమంలో గంగాధర మండల విద్యాధికారి ప్రభాకర్ రావు, ప్రధానోపాధ్యాయులు శ్రీవేణి, విజయ లక్ష్మి పాల్గొన్నారు.

వ్యవసాయ భూమిలోని బోర్ వద్ద రీచార్జీ స్ట్రక్చర్ పరిశీలన

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలోని వ్యవసాయ భూమిలో గల బోరు వద్ద రిచార్జ్ స్ట్రక్చర్‌ను మంగళవారం మండల ప్రత్యేక అధికారిని అఫ్జల్ బేగం, ఎంపిడివో సత్తయ్యలు పరిశీలించారు. ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీ పరిధిలోని కోనేటి లక్ష్మి వ్యవసాయ భూమిలో గల బోర్‌వెల్ వద్ద బోర్ వెల్ రిచార్జీ స్ట్రక్చర్ నిర్మించుకున్న పనిని పరిశీలించారు. ఈ పనిని ఎంజిఎన్ఆర్ఈఎస్ ద్వారా చేపట్టడం జరిగిందన్నారు. ఈ పని ద్వారా బోరు వద్ద వర్షపు నీటిని ఇంకించడం జరుగుతుందని, దాంతో భూగర్భ జలాలు పెరిగి బోరుకి నీటి లభ్యత పెరుగుతుందన్నారు. 2 మీటర్ల వెడల్పు, 2 మీటర్ల లోతు వరకు కంకర, జాలి, ఇసుక వంటి మెటీరియల్ ఉపయోగించడం జరుగుతుందన్నారు. ఈ పని చేసిన తర్వాత నీటి లభ్యత పెరిగి బోరు ఎక్కువ సేపు పోస్తుందని రైతు కుటుంబం తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. మండలంలోని రైతులు ఇటువంటి పనులు చేసుకొని నీటి నిల్వలు పెంచుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపివో, ఏఓ,ఈసి రాజు, టిఏఎస్ నాగరాజు, ప్రభాకర్, ఎఫ్ఏ నరేష్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు పంపిణీ

నవతెలంగాణ - కరీంనగర్ :



కరీంనగర్ 1వ డివిజన్ తీగలగుట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 31 విద్యార్థులకు హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంస్థ సభ్యుడు మునిగోపాల్ స్వప్నల పెళ్లిరోజు పురస్కరించుకొని పరీక్ష సామాగ్రి ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేసినట్టు సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. రాబోవు వార్షిక పరీక్షలో 9.8జీపీఏపై సాధించిన విద్యార్థులకు సంస్థ తరపున రూ.2016 నగదు పారితోషికం అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కరుణ, సంస్థ సభ్యులు శ్రీధర్ రెడ్డి, మన్ సాయి, హిమ సాయి, సాయి వర్ధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానం



నవతెలంగాణ-కరీంనగర్ : కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆపదలో ముగ్గురు రక్తదానం చేసి ఆదుకున్నట్లు ఆసరా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ రాపోలు గోపికృష్ణ తెలిపారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన మహమ్మద్ రజాక్(43) గుండెకు ఆపరేషన్ నిమిత్తం స్థానిక మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆపదలో మూడు యూనిట్ల 'బి' పాజిటివ్ రక్తం అవసరమై ఫౌండేషన్‌ను సంప్రదించగా వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల కామర్స్ అధ్యాపకుడు, ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ప్రోగ్రాం అధికారి బి.మహేష్ 7వ సారి రక్తదానం చేశారు. ఆయనతో పాటు కళాశాలకు చెందిన బీబీఏ రెండో సంవత్సరం విద్యార్థులు ఏ.సాయి స్వరూప్, బి.మహేష్ రక్తదానంతో ఆదుకున్నారు. ఈ సందర్భంగా రక్తదానంతో ప్రాణదాతలుగా నిలిచిన అధ్యాపకుడు, విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.శ్రీనివాస్, ఆసరా ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రాపోలు గోపికృష్ణ, సభ్యులు కే.సతీష్ కుమార్, కోలగాని శ్రీనివాస్, జి.తిరుపతి, కళాశాల ఏసీఓ బి.సంపత్ కుమార్, ఏవో బి.శ్రావణ్ కుమార్, అధ్యాపక బృందం అభినందించారు.

జ్యోతిబాపూలే డిగ్రీ కళాశాలలో దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :

మండల కేంద్రంలోని బాలుర జ్యోతిబాపూలే డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం ప్రిన్సిపాల్ కె. వీర ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు, 2024-25 విద్యాసంవత్సరంలో ఇంటర్ పూర్తి చేస్తున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డిగ్రిలో బిఎస్‌సి, బికాం, బిఎ, బిఎఫ్‌టి, బిబిఏ, బిహెచ్ఎంసిటి కోర్సులు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి క్యాస్ట్ సర్టిఫికేట్, ఇన్‌కమ్ సర్టిఫికేట్, 10వ తరగతి పాస్ సర్టిఫికేట్, ఇంటర్ మెమో, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్‌కార్డుతో https://mjpt-bcwreis.telagana.gov.in/ వైబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ - మానకొండూరు :

జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పోచంపల్లిలో చోటు చేసుకుంది. సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం పొలం అంజయ్య (53) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబంతో జీవిస్తున్నాడు. కొన్నేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చూపించినప్పటికీ వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. మంగళవారం కుటుంబ సభ్యులు నిద్రపోయిన సమయంలో ఇంటి సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుని కుమారుడు రఘు ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఘనంగా శ్రీచైతన్య పాఠశాల వార్షికోత్సవ సంబరాలు


సుడా చైర్మెన్‌ను సన్మానిస్తున్న ఏజీఎం

నవతెలంగాణ - కరీంనగర్ :

కరీంనగర్‌లోని స్థానిక ముకరంపురలో గల శ్రీచైతన్య ఐపీఎల్ పాఠశాల వార్షికోత్సవ ఉత్సవాలు చింతకుంటలోని శ్రీచైతన్య పాఠశాలలో ఘనంగా జరిగాయని పాఠశాలల ఏజీఎం ఎం.రాజు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కరీంనగర్ జోన్‌లోని లోకల్‌లో గల ఏడు బ్రాంచ్‌ల విద్యార్థులు సుమారు 5వేల మంది, వారి తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ముఖ్య అతిథులుగా మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొని విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు శ్రీచైతన్య విద్యాసంస్థలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ పి.ప్రవీణ్, ప్రిన్సిపల్ ఎం.సునీల్ కాంత్, ఐపీఎల్ ఇన్‌చార్జి జె.మోహన్, ఏవో మనోహర్ రెడ్డి, అధ్యాపక బృందం, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

శిశుమందిర్ విద్యార్థులకు చావా సినిమా

నవతెలంగాణ - కరీంనగర్ :


సినిమా హాల్‌లో విద్యార్థులతో బండి సంజయ్

కరీంనగర్‌లోని స్థానిక శ్రీసరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల సుమారు 650 విద్యార్థులు ఆచార్యులకు పాఠశాల పూర్వ విద్యార్థి బండి సంజయ్ కుమార్ కేంద్ర హెూం శాఖా సహాయ మంత్రి ఆధ్వర్యంలో శంభాజీ మహారాజ్ బలిదాన దినోత్సవం సందర్భంగా వారికి నివాళులర్పిస్తూ చావా సినిమా చూపించారు. ధర్మ రక్షణలో ప్రతి ఒక్కరూ ఒక శంభాజీ మహారాజ్ లాగా ఉండటమే ఆయనకు మనం ఇచ్చే నివాళి అన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు గాను కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ ప్రవీణ్ రావుకి ప్రధానాచార్యులు సముద్రాల రాజమౌళి, పాఠశాల అధ్యక్షులు బల్మూరి కరుణాకర్ రావు, కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, సమితి అధ్యక్షులు డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, సమితి కార్యదర్శి ఎలగందుల సత్యనారాయణ, విభాగ్ కార్యదర్శి మేచినేని దేవేందర్ రావు, సహ కార్యదర్శి కొండా గంగాధర్, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్, గట్టు శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్, డాక్టర్ నాళ్ల సత్య విద్యాసాగర్, తాటి రాజేశ్వరరావు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

సంవేదన-2 పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్

నవతెలంగాణ - కరీంనగర్ :

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో సంవేదన-2 పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..విద్యార్థులు తరచుగా రక్తదానం చేస్తూ ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. మార్చ్ 23న భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకొని నేషనల్ యూత్ ప్రాజెక్ట్, నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరం ఆఫ్ ఆర్టిస్ట్ అండ్ యాక్టివిటీస్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 23 వరకు జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామకృష్ణ, నిఫా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కే.యాదవరాజు, కొలగాని శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ రాపోలు గోపికృష్ణ, జి.తిరుపతి, ఎస్ఆర్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పడాల తిరుపతి పాల్గొన్నారు.

విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలి

- పాఠశాలల్లో కనీస వసతులు కరువు
- డాక్టర్ ప్రసన్న హరికృష్ణ

నవతెలంగాణ - కరీంనగర్ :


మాట్లాడుతున్న ప్రసన్న హరికృష్ణ

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ప్రసన్న హరికృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని నీళ్ల, నిధులు, నియామకాల ఏజెండాతో సాధించుకున్నప్పటికీ, గత 10 సంవత్సరాలుగా విద్యారంగానికి తగిన నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. దేశ సగటు బడ్జెట్‌లో విద్యకు 14.7 శాతం నిధులు వెచ్చిస్తుండగా, మన రాష్ట్రంలో గత దశాబ్ద కాలంగా సగటున 6.6 శాతమే కేటాయించారని, గత ఏడాది ఈ మొత్తాన్ని కేవలం 7.75శాతానికి మాత్రమే పెంచారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కిందని దుయ్యబట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు వాష్‌రూమ్‌లకు వెళ్లాలంటే క్యూలో నిలుచోవాల్సిన పరిస్థితి ఉందని హరికృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు విద్యా అభివృద్ధికి బడ్జెట్‌లో రెండంకెల శాతం నిధులు కేటాయిస్తున్నప్పటికీ, మన రాష్ట్రంలో మాత్రం సగానికీ చేరుకోలేదన్నారు. దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు విద్యకు డబుల్ డిజిట్ శాతం నిధులు కేటాయిస్తుండగా, తెలంగాణ మాత్రం సింగిల్ డిజిట్ కేటాయింపులతోనే సరిపెట్టుకోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఈ వాగ్దానం అమలవ్వాలని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్న హరికృష్ణ టీం సభ్యులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ - కరీంనగర్ :

వికసిత్ భారత్ 47లో భాగంగా కేంద్ర యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ పోర్టల్ ద్వారా యూత్ పార్లమెంట్ పోస్టర్‌ను జిల్లా పాలనాధికారి వికసిత్ భారత్ మోడల్ జిల్లా చైర్మెన్ ఆచార్య కలువకుంట రామకృష్ణ నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ ఆఫీసర్ రాంబాబుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. యువత వన్ ఎలక్షన్ వన్ నేషన్ అనే అంశంపై మైభారత్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని ఒక నిమిషం వీడియో అప్లోడ్ చేయాలన్నారు. దేశభక్తి, రాజ్యాంగ విలువల పట్ల యువత దృష్టిని కేంద్రీకరించాలన్నారు. ఈనెల 16 లోపు యువత రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాల్గొని జాతీయస్థాయిలో కరీంనగర్ జిల్లాకు మంచి గుర్తింపు తేవాలని జిల్లా కలెక్టర్ నోడల్ అధికారులు కోరారు. జిల్లా స్థాయి అంశం వన్ నేషన్ వన్ ఎలక్షన్ జాతీయ స్థాయిలో ఆన్‌లైన్‌లో వికసిత్ భారత్ అంటే ఏమిటి అంశంపై ఒక నిమిషం వీడియో అప్లోడ్ చేయాలి వికసిత్ భారత్ ప్రాముఖ్యత, వివరణాత్మక బ్రోచర్ పంపిణీ చేశారు. లక్ష్యాలు, పాల్గొనే విధానం, యువతకు లభించే అవకాశాలు, యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం దేశాభివృద్ధిలో భాగం కావడం తదితర అంశాలుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ అర్జున్, డాక్టర్ రాజేశం, ఎలిజబెత్ రాణి, డాక్టర్ పి.తిరుపతి, డాక్టర్ రాపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళ వైద్య శిబిరం..

నవతెలంగాణ - కరీంనగర్ :


పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్


రిబ్బన్ కట్ చేస్తున్న కలెక్టర్

కరీంనగర్‌లోని స్థానిక టీఎన్జీవోల సంఘ భవనంలో జిల్లా టీఎన్జీవోల సంఘం, టీజీవోల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు ఆటల పోటీలు, వైద్య ఆరోగ్యశాఖ సౌజన్యంతో ఆరోగ్య మహిళ వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ..మహిళలకు సంబంధించిన ప్రతి విషయంలో పురుషులు బాధ్యతాయుతంగా ప్రవర్తించి నవ సమాజానికి నిర్మాణం కోసం పాటుపడాలని కోరారు. మహిళలకు వివిధ రకాల ఆట పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. వివిధ డిపార్ట్మెంట్లకు సంబంధించి సుమారు 500 మంది మహిళా ఉద్యోగులు పాల్గొనగా, గెలుపొందిన వారికి కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా న్యాయమూర్తి ప్రతిమ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా ఎంప్లాయిస్ చైర్మెన్ ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగేం లక్ష్మణ్ రావు, టీజీవోల సంఘం జిల్లా అధ్యక్షులు మడిపల్లి కాళీ చరణ్ గౌడ్, కార్యదర్శి డాక్టర్ యెడ్ల అరవింద్ రెడ్డి, కేంద్ర సంఘం నాయకులు నాగుల నరసింహ స్వామి, గూడ ప్రభాకర్ రెడ్డి, సర్దార్ హర్మీందర్ సింగ్, హరికృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ఆశా ఫెసిలిరేటర్స్‌కు సమీక్షా సమావేశం

నవతెలంగాణ - కరీంనగర్ :


మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

కరీంనగర్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అధ్యక్షతన ఆశా ఫెసిలిరేటర్స్‌కు సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ..ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కేంద్రాలలో మొదటి కాన్పు, మొదటి కాన్పు నార్మల్‌గా అయిన గర్భిణులను పీహెచ్‌సీలో నార్మల్ డెలివరీ అయ్యేటట్లుగా వారికి అన్ని విధాలుగా సదుపాయాలు కల్పించి ప్రోత్సహించాలన్నారు. ఎండ దెబ్బ తగలకుండా ఉండటానికి అవగాహన కల్పించాలన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అతుల్ నిగమే మాట్లాడుతూ..సార్వత్రిక వ్యాధి నిరోధక కార్యక్రమంలో అందరూ ప్రతి హ్యాబిటేషన్ వారిగా మైక్రో యాక్షన్ ప్లాన్ తయారు చేసి ప్రతి ఒక్క పాపకు పూర్తి వ్యాధి నిరోధక టీకాలు 100శాతం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అడిషనల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (లెప్రసీ) డాక్టర్ సుధా రాజేంద్ర మాట్లాడుతూ..ఈనెల 17 నుంచి మార్చి 30 వరకు జరుగు కుష్ఠ వ్యాధి కేసు గుర్తింపు క్యాంపులలో అందరూ పాల్గొని కేసులు ముందే గుర్తించి వారికి పూర్తి చికిత్స అందించి లెప్రసీ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ సమీక్ష కార్యక్రమంలో పీఓడీటీటీ డాక్టర్ ఉమాశ్రీ రెడ్డి, పీఓఎంహెచ్ఎన్ డాక్టర్ సన జవేరియా, డీఐఓ డాక్టర్ సాజిదా, డెమో రాజగోపాల్, డీపీఓ స్వామి, డీసీఎం రవిందర్రెడ్డి, ఆశా ఫెసిలిటేటర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ

నవతెలంగాణ-పెద్దపల్లి



ప్రభుత్వ గురుకులాలలో చదివే బాలికలకు నాణ్యమైన భోజనం అందించాలని, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ అన్నారు. మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ పెద్దపల్లిలోని రంగంపల్లిలో ఉన్న మహాత్మజ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకులాన్ని తనిఖీ చేశారు. బాలికల గురుకులంలో డార్మెంటరీ, క్లాస్ రూమ్, పారిశుధ్య నిర్వహణ, భోజన హాల్, వంట గది, వంట సామాగ్రి భద్ర పర్చే ప్రదేశాలను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. పిల్లలతో మాట్లాడి హాస్టల్లో అందిస్తున్న భోజనం నాణ్యత, పారిశుధ్య నిర్వహణ , విద్య బోధన వంటి వివరాలను ఆరా తీశారు. గురుకులంలో విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం అందించాలని అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ పిల్లలతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ బాలికల గురుకులం ప్రిన్సిపాల్ మణీ దీప్తి, ఉపాధ్యాయినులు విద్యార్థులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాలు అందజేత

నవతెలంగాణ - మెట్‌పల్లి

మహాత్మజ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థులకు మున్సిపల్ కమిషనర్ మోహన్ మంగళవారం కంటి అద్దాలను పంపిణీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులకు ఇటీవల ఎస్బి హెచ్ కె స్క్రీనింగ్ టీం స్టూడెంట్‌కు జగిత్యాల హాస్పిటల్‌లో కంటి పరీక్షలు నిర్వహించగా కంటి లోపాలు ఉన్నా విద్యార్థులకు కమిషనర్ కంటి అద్దాలు పంపిణీ చేసారు .ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎండి జుబేర్, డాక్టర్ అంజిత్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, జూనియర్ అసిస్టెంట్ ప్రగతి, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, టిఎంసి సోమిడి శివ, అశోక్, అనిల్, మెడికల్ ఆఫీసర్ అఫ్సాన్ నిషాత్ రాధా, ఫార్మసిస్ట్, సరిత ఏఎన్ఎం, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి కాలనీవాసుల వినతి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



జగిత్యాల అర్బన్ కాలనీవాసులు పలు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జగిత్యాల అర్బన్ కాలనీ డబుల్ బెడ్ రూమ్ ఏరియాలో సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీ పక్కన ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ నుండి వచ్చే పొగ వల్ల కాలనీ వాసులకు ఇబ్బందిగా ఉందని దీన్ని వేరే చోటికి తరలించాలని వారు ఎమ్మెల్సీని కోరారు. జగిత్యాల అర్బన్ కాలనీవాసులు స్వామీ, కిషోర్, గంగాధర్, శివాజీ, జే.శైలజ, ఖలీల్, జగిత్యాల అర్బన్ కాలనీవాసులు, కమిటీ సభ్యులు తెలిపారు.

జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయన వెంట రూరల్ మండల అధ్యక్షుడు జున్ను రాజేందర్, గంగాధర్, వెంకన్న, రమేష్, కోల రాజన్న, సురేష్, నరేష్ పాల్గొన్నారు.

వరి పొలాల పరిశీలన

నవతెలంగాణ-మేడిపల్లి

భీమారం మండలంలోని కమ్మరిపేట్, భీమారం గ్రామాలలో వ్యవసాయ అధికారి ఎండి. షాహిద్ అలీ వరి పొలాలను క్షేత్ర స్థాయిలో నేరుగా పరిశీలించారు. ఇచ్చిన వరి మడికి మరలా మరలా నీరు ఇవ్వకుండా దశల వారిగా నీటిని పంట పొలాలలో సద్వినియోగ పరచుకొని వరిలో అధిక దిగుబడి పొందవచ్చునని రైతులకు క్షేత్రస్థాయిలో పర్యటనలో భాగంగా సూచించారు. ఈ కార్యక్రమంలో మండలం వ్యవసాయ విస్తరణ అధికారులు సురేందర్ నాయక్, నరేందర్, రైతులు రాకేష్, రాజిరెడ్డి ,శేఖర్ పాల్గొన్నారు.

ఇన్స్పైర్ అవార్డుకు విద్యార్థినుల ఎంపిక

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం







ప్రభుత్వం ఏటా నిర్వహిస్తున్న ఇన్స్పైర్ అవార్డుల కార్యక్రమంలో భాగంగా 2024-2025 సంవత్సరం కోసం ఇబ్రహీంపట్నం మండలం నుంచి ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్టు ఎంఈవో మధు తెలిపారు. మండల పరిషత్ ప్రాథమికొన్నత పాఠశాల కోమటి కొండాపూర్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థి ముక్కెర రనుషా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇబ్రహీంపట్నంకు చెందిన 6వ తరగతి విద్యార్థి దుబ్బాక ప్రగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వర్షకొండకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఆరెపెల్లి సాయి చందనలు వారి ఎగ్జిబిట్ లను గత సెప్టెంబర్ ఆన్‌లైన్‌లో పంపించగా, వీరి ఎగ్జిబిట్స్ ఉత్తమమైనవిగా ఎంపిక చేశారు. ఎంపికయిన ఒక్కో విద్యార్థికి రూ. 10 వేల చొప్పున బ్యాంకు ఖాతాలో వేయనున్నారు. ఈ నగదుతో గైడ్ టీచర్ మార్గదర్శకంలో ఎగ్జిబిట్స్ తయారు చేసి జిల్లా స్థాయిలో నిర్వహించే సైన్స్‌ఫేర్‌లో ప్రదర్శిస్తారని ఎంఈవో మధు తెలిపారు.

కోరుట్ల ఫిల్టర్ బెడ్ ఆధునీకరణకు నిధులు మంజూరుకు కృషి

నవతెలంగాణ-కోరుట్ల



కోరుట్ల పట్టణంలో ప్రజల దాహార్తి తీర్చాలనే ఉద్దేశంతో గతంలో స్వర్గీయ మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు హయాంలో నిర్మించిన ఫిల్టర్ బెడ్ ఆధునీకరణకు నిధులు మంజూరు చేయడానికి కృషి చేస్తామని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఫిల్టర్ బెడ్‌ను స్థానిక మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. వారి వెంట మున్సిపల్ కమిషనర్, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్, నయీమ్ రిజ్వాన్, చిట్యాల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణ కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-కోరుట్ల

పట్టణంలోని వాసవి కళ్యాణ భవన్‌లో ఈనెల 15, 16, 17 తేదీల్లో హార్ట్ ఫుల్ నెస్ సంస్థ శ్రీ రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో జరిగే మూడు రోజుల ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమం కరపత్రాన్ని మంగళవారం వాసవి కళ్యాణ భవనంలో ఆవిష్కరించారు.

దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలను చెల్లించాలి

మేడిపల్లి ప్యాక్స్ చైర్మన్ మిట్టపల్లి రమేష్ రెడ్డి

నవతెలంగాణ మేడిపల్లి

మేడిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని కట్లకుంట, మేడిపల్లి, తొంబర్రావుపేట్ గ్రామాలకు చెందిన రైతులు స్వల్పకాలిక రుణాలు, దీర్ఘకాలిక రుణాలు చెల్లించాలని సంఘ అభివృద్ధికి తోడ్పాటు కావాలని మేడిపల్లి ప్యాక్స్ చైర్మన్, కేడీసీసీ డైరెక్టర్ మిట్టపల్లి రమేష్ రెడ్డి, సీఈవో బొందయ్య తెలిపారు. స్వల్పకాలిక అప్పులు కలిగిన వారు 7 శాతం వడ్డీ చెల్లించాలని, లేని పక్షంలో 13.75 శాతం వడ్డీతో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

పోలీస్ బ్యాండ్ ప్రాముఖ్యత చాలా అవసరం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



భావోద్వేగాలకు తగ్గట్టుగా సంగీత భానులను వినిపించే పోలీస్ బ్యాండ్ పోలీసు శాఖలో ఎంతో ప్రాధాన్యత కలిగిన భాగంగా నిలుస్తుందని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ చేతుల మీదుగా పోలీస్ బ్యాండ్ సిబ్బందికి స్పోర్ట్ డ్రెస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ కవాతు ఉత్సాహంగా నిర్వహించడంలో బ్యాండ్ ప్రాముఖ్యత చాలా అవసరం అని, పోలీస్ బ్యాండ్ పోలీసు శాఖలో ఎంతో ప్రాధాన్యత కలిగిన భాగంగా నిలుస్తుందని, ఇది కేవలం సంగీత బృందంగా కాకుండా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగే అధికారిక వేడుకలకు పోలీస్ బ్యాండ్ ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బీంరావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ వేణు, బ్యాండ్ పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

40వేల నగదు,రెండు సెల్ ఫోన్లు స్వాధీనం

నవతెలంగాణ - మెట్‌పల్లి



ప్రభుత్వ అధికారిని బెదిరించి, డబ్బులు వసూలు చేసిన రౌడీ షీటర్ ముఠాను అరెస్ట్ చేసినట్టు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో అక్రమ ఇసుక, మొరం రవాణా, భూ సెటిల్మెంట్లు చేస్తూ వారి అక్రమాలపై ఎదురు తిరిగిన వారిని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడతామని బెదిరిస్తూ అమాయక ప్రజలు, వ్యాపారాలు, ప్రభుత్వ అధికారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న రెంజర్ల అజయ్ రాజేశ్వర్‌రావుపేట్, బత్తుల భరత్ ఇందిరానగర్, మెట్‌పల్లి జెట్టి లక్ష్మణ్, దుబ్బవాడ, ఎన్నం రమేష్ రాజేశ్వరరావుపేట్ నిందితులు ఒక ముఠాగా ఏర్పడి కొంత కాలం నుంచి అక్రమ ఇసుక, మొరం రవాణా చేస్తూ, సెటిల్‌మెంట్ దందాలు చేస్తున్నారు. బెదిరించి డబ్బులు వసూలు చేస్తూ మాట వినకపోతే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడతామని బెదిరిస్తూ వచ్చిన డబ్బులను పంచుకుని జల్సాలు చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 12న ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ డీఈఈ లక్కంపల్లి అరుణోదయ్ కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ లస్మయ్యలు అక్రమ మొరం తరలింపునుఅడ్డుకున్నారు. ఈ విషయాన్ని నిందితుడు అజయ్ మరో నిందితుడు ఎన్నం రమేష్‌కు ఫోన్ ద్వారా తెలియజేయగా, రమేష్ అక్కడికి వచ్చి డీఈఈ అరుణోదయ్ కుమార్‌ను దూషించాడు. వారి అక్రమ రవాణాను అడ్డుకుంటే డీఈఈ అరుణోదయ్ కుమార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని రమేష్ బెదిరించడంతో డీఈఈ అరుణోదయ్‌కుమార్ భయపడి వెళ్ళిపోయాడు. అనంతరం మరో నిందితుడు బత్తుల భరత్ డీఈఈ అరుణోదయ్ కుమార్‌కు ఫోన్ చేసి, కులం పేరుతో దూషించారని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని, చంపుతామని బెదిరించి, కేసు పెట్టకుండా ఉండాలంటే మూడు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ విషయాన్ని మరో నిందితుడు జెట్టి లక్ష్మణ్ డీఈఈ అరుణోదయ్ కుమార్‌కు ఫోన్ చేసి, వెంకట్రావుపేట్ గుట్ట వద్దకు వచ్చి మాట్లాడాలని, సమస్య పరిష్కరించుకోవాలని, లేకపోతే చంపుతామని బెదిరించడంతో భయపడిన డీఈఈ అరుణోదయ్ కుమార్ బత్తుల భరత్‌కు ఫోన్ పే ద్వారా రెండుసార్లు లక్షా పది వేల నగదు రూపంలో జెట్టి లక్ష్మణ్‌కు ఇచ్చాడు. తరుచూ డీఈఈ అరుణోదయ్ కుమార్‌కు ఫోన్ చేసిన నిందితులు మిగతా లక్ష యాభైవేల రూపాయలు ఇవ్వాలని లేకపోతే చంపుతామని బెదిరింపులకి పాల్పడ్డారు. వేదింపులు తట్టుకోలేక డీఈఈ అరుణోదయ్ కుమార్ ఇబ్రహింపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి, సోమవారం రాత్రి ముగ్గురు నిందితులను గండి హనుమాన్ దేవాలయం సమీపంలో అదుపులోకి తీసుకునీ వారి వద్దనుండి రెండు ఫోన్‌లు, ఎనుబై వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న నిందితుడు ఏన్నం రమేష్ కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

జగిత్యాలలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



జగిత్యాలలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగిత్యాల పరిసర ప్రాంతాల్లో ఇసుక క్వారీలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, గతంలో రామాలయం వద్ద ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసి నిర్వహణ లోపంతో మూసి వేశారన్నారు. నిర్మాణ రంగానికి ఇసుక అందుబాటులో లేకపోవ డంతో నిర్మాణ రంగం కుంటుపడుతోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిందని, ఇసుకను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ధర్మశాల స్థలంలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాన్నారు. రైతులు వరికి ప్రత్యామ్నాయంగా సాగు చేసిన మొక్కజొన్నకు గతేడాది క్వింటాల్‌కు రూ.2500లకు పైగా ఉన్న ధర, మొక్కజొన్న మార్కెట్‌కు చేరుకొనే సమయానికి ధర రూ.2000 లకు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కందులకు సైతం మద్దతు ధర కల్పించేందుకు కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎంకు లేఖ రాసినట్టు చెప్పారు. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించకపోవడంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, ఎమ్మెల్సీ అభ్యర్థులను పార్టీ సామాజిక కోణంలో ఎంపిక చేసినట్టు భావిస్తున్నాను అని అన్నారు. పదవితో సంబంధం లేకుండా ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల్లో ఒకడిగా సేవలు అందిస్తాను అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు.

రామగుండంను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

నవతెలంగాణ-కోల్‌సిటి



అధునాతన యంత్రాలను వినియోగించి నగరాన్ని స్వచ్ఛ రామగుండంగా తీర్చిదిద్దుతామని, మునిసిపల్ కార్పొరేషన్ శానిటేషన్ విభాగాన్ని బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. పదిహేనో ఆర్థిక సంఘం నిధులు రూ.76 లక్షలతో కొనుగోలు చేసిన రెండు లోడర్ యంత్రాలు, రూ. 4.70 లక్షలతో కొనుగోలు చేసిన హ్యాండ్ ఫాగింగ్ యంత్రాలను అదనపు కలెక్టర్ అరుణ శ్రీతో కలిసి ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. మునిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థపై పారిశుధ్య వాహనాల అద్దె భారం పడకుండా సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, జెన్ కో తదితర ప్రభుత్వ రంగ సంస్థలు, కేశోరాం సిమెంట్ కంపెనీలను భాగస్వాములను చేస్తూ నగర పాలక సంస్థ పారిశుధ్య విభాగానికి అవసరమైన యంత్రాలు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన పేర్కొన్నారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఎస్ఈ శివానంద్, ఈఈ రామన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగ భూషణం, కుమారస్వామి, మాజీ కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేష్, ముస్తఫా ,కాంట్రాక్టర్లు విశ్వతేజ, మెరుగు రాజేష్, విక్రమ్, సిబ్బంది పాల్గొన్నారు.

కుల గణన చేపట్టడం చారిత్రాత్మకము

- విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి

నవతెలంగాణ-పెద్దపెల్లిటౌన్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కుల గణన చేపట్టడం చారిత్రాత్మకమని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి అన్నారు. మంగళవారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. మేము ఎంతో మాకు అంతా అనే నినాదంతో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ముఖ్యమంత్రి నిర్ణయించడం హర్షణీయమన్నారు. కులగనున్న చేపట్టడం చారిత్రాత్మకమని, అలాగే విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. నాలుగు రోజుల క్రితం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భీమోజు సురేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లోజు రాజు,జిల్లా గౌరవ అధ్యక్షుడు ముల్కల గోవర్ధన్ శాస్త్రీ, జిల్లా ప్రధాన కార్యదర్శి రామగిరి రాజమౌళి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు శృంగారపు వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు నాగుల మల్యాల ప్రసాద్, అబ్బోజు కోటయ్య, నూతి రవిందర్ చారీ, గర్రెపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సామాజికవేత్త, ప్రాణదాత కటుకం గణేష్‌కు సన్మానం

నవతెలంగాణ-కోరుట్ల



పట్టణానికి చెందిన సామాజికవేత్త, రక్తదాన సంధానకర్త, ప్రాణదాత కటుకం గణేష్‌కు ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు తీసుకున్న సందర్భంగా కోరుట్లలోని శ్రీ నారాయణ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో స్కూల్ యజమాన్యం కరస్పాండెంట్ శ్రీమతి జ్యోతిర్మయి చేతుల మీదుగా అవార్డు గ్రహీత, ప్రాణదాత కటుకం గణేష్‌కు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాల నుండి కోరుట్ల, చుట్టుపక్కల గ్రామాలలో ఎవరికి అవసరం ఉన్న అత్యవసర సమయంలో రక్తాన్ని అందించడంలో ముందంజలో ఉన్న కటుకం గణేష్ ధన్యజీవి అని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ పిస్నం చెట్టి జ్యోతిర్మయి, పిస్నంశెట్టి శ్రీనివాస్, శ్రీహర్ష శ్రీ వాస్తవ్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాగిత రహిత కార్యకలాపాలపై అవగాహన

నవతెలంగాణ-రామగిరి

సింగరేణి సంస్థలో ప్రవేశ పెట్టనున్న ఈ-ఆఫీస్ విధానంలో భాగంగా సంస్థలోని వివిధ గనుల, విభాగాల కార్యాలయాలలో కాగిత రహిత కార్యకలాపాలు నిర్వహించడానికి క్లరికల్ ఉద్యోగులకు మంగళవారం సిఎస్‌సిఓఐ క్లబ్‌లో కార్పొరేట్ ఈఆంపి. విభాగం సీనియర్ ప్రోగ్రామర్ కె.శంకర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సులభతర కార్యాలయ విధానం అమలు చేయడంలో భాగంగా కాగిత రహిత సేవలు భద్రతతో నిర్వహించడమే కాకుండా, సకాలంలో సంబంధిత అధికారుల ఆమోదం పొందేలా ఈ-ఆఫీస్ విధానాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమంలో ఎంవిటిసి. మేనేజర్ సుజీత్, తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజ్ నివారణకు చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే విజయ రమణారావు

నవతెలంగాణ-ఎలిగేడు



వేసవి కాలంలో విద్యుత్ ఓల్టేజ్ సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని శివపల్లి గ్రామంలో ఓల్టేజ్ సమస్యను అధిగమించేందుకు విద్యుత్ అధికారులు 25కేవీ ఏ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి, దాన్ని రైతులు, ప్రజల సమక్షంలో ఛార్జ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాల్లో లైటింగ్, రైతులు ఉపయోగించుకునే ట్రాన్సఫార్మర్ ముందస్తుగా గుర్తించి వాటి స్థానంలో హై ట్రాన్స్‌ఫార్మార్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నీకల్ శ్రీనివాస్, ఏడిఈ సంపత్ కుమార్, ఏఈ సంపత్ కుమార్, లైన్ ఇన్స్పెక్టర్ సూర్య నారాయణ, లైన్ మెన్ లక్ష్మన్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీకి నివాళి

నవతెలంగాణ-కోరుట్ల :పట్టణంలోని సరస్వతి శిశు మందిర్‌లో మంగళవారం ఛత్రపతి శంభాజీ మహారాజ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు వడ్లకొండ రాజ గంగారం, చెట్పల్లి శంకర్, ముదిగొండ రాజేశం, ప్రబంధ కారిణి సభ్యులు వనపర్తి చంద్రమోహన్, కొండ బత్తిని అమర్నాథ్, పాఠశాల ప్రధానాచార్యులు గోపు వెంకటేష్, కరస్పాండెంట్ నీలి శ్రీనివాస్ పూర్వ విద్యార్థులు నపాల్గొన్నారు.

పొలం బాటలో విద్యుత్ అధికారులు

నవతెలంగాణ-రామగిరి :మండలం కల్వచర్ల గ్రామంలో మంగళవారం ఎన్‌పీడీసీఎల్ విద్యుత్‌శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా ఎస్ఈ కె. మాధవరావు, మంథని డివిజన్ డీఈ వి.ప్రభాకర్ పొలం బాటలో పాల్గొని, రైతులతో ముచ్చటించారు. ఓవర్ లోడ్ తగ్గించడానికి నూతన 100 కే.వి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎస్ఈ, డీఈలు కలిసి ప్రారంభించారు. రైతులకు విద్యుత్ సమస్యలపై ఇబ్బందులు ఉంటే తమ ప్రాంతంలోని అధికారులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ కనకయ్య, రామగిరి ఏఈ కె. మహేందర్‌రెడ్డి, సబ్ ఇంజనీర్ కె.సతీష్, సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ ఎస్.శ్రీనివాస్, లైన్ ఇన్స్పెక్టర్ ఏ. నాగరాజు, లైన్‌మెన్‌లు శ్రీనివాస్, శివకుమార్, ఏఎల్ఎంలు రమేష్, ప్రభాకర్, అంజయ్య చందు లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

5వ రోజు ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు

నవతెలంగాణ-ముత్తారం: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రంలో 5వ రోజు మంగళవారం ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు కొనసాగాయి. మాథ్స్ 1ఎ పరీక్షకు మొత్తం 57 మంది విద్యార్థులకు గాను 56 మంది హాజరై పరీక్ష వ్రాయగా, ఒకరు గైర్హాజరయ్యారు. అదేవిధంగా సివిక్స్ పరీక్షకు 60 మందికి గాను 56 మంది విద్యార్థులు హాజరై పరీక్ష వ్రాయగా, 4గురు గైర్హాజరయ్యారు. బాటనీ పరీక్షకు 31 మందికి గాను 30 మంది విద్యార్థులు ఒకరు గైర్హాజరయ్యారు. వొకేషన్ పరీక్షకు 20 మందికి గాను 19 మంది విద్యార్థులు హాజరై ఒకరు గైర్హాజరయ్యారు.

స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన కలెక్టర్ దంపతులు

నవతెలంగాణ- ధర్మపురి



ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సోమవారం నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం తరపున సకల ఏర్పాట్లు చేశారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం విప్ లక్ష్మణ్ కుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి కళ్యాణం సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన సత్రాన్ని విప్ లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. అలాగే ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్‌తో కలిసి అన్నదాన సత్రంలో జిల్లా కలెక్టర్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల డిఎస్పి రఘు చందర్, తహసిల్దార్ కృష్ణ చైతన్య, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న చల్మెడ

నవతెలంగాణ-మేడిపల్లి



భీమారం మండలంలోని గోవిందారం గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా మంగళవారం ప్రారంభం అయ్యాయి. బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఉమ్మడి మేడిపల్లి మండల అధ్యక్షుడు సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు నెల్లుట్ల ప్రభాకర్, గ్రామశాఖ అధ్యక్షుడు ఇరవేణి గంగాధర్, సీనియర్ నాయకులు తస్నీరు శ్రీనివాసరావు, ఆదిరెడ్డి, మకిలి దాస్, సురేందర్ చీటీ దిలీప్‌రావు, సతీష్, రాజుకుమార్, సురేష్‌రావు పాల్గొన్నారు.

కొండగట్టులో ఎమ్మెల్యే పూజలు

నవతెలంగాణ- మల్యాల



మల్యాల మండలం ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కొండగట్టు అంజన్న స్వామి దేవస్థానంలో జరిగిన పవిత్ర ఉత్సవాలలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మల్లేశ్వరి, దార మాదిరెడ్డి, వెలుమ లక్ష్మారెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్‌గౌడ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శనిగారపు తిరుపతి, మైపాల్‌రెడ్డి, రాజనర్సింగరావు, నల్ల తిరుపతిరెడ్డి, నరసింహారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్, హరినాథ్, సతీష్‌రెడ్డి, ముధం శ్రీనివాస్, మర్రి లక్ష్మణచారి, దూడం రామాంజ నేయులు, శ్రీకాంత్, బండి రవి, మల్లేశం, బివి రమణ, షేక్ హుస్సేన్, సుల్తాన్ సుదర్శన్, కోటపల్లి బాబు, మహిపాల్ రావు పద్విరాజ్ మారుతి, కిషన్ రెడ్డి, అనిల్, పొన్నం సాయి పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా లక్ష్మీవెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

నవతెలంగాణ-రాయికల్

మండలంలోని ఇటిక్యాల గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా జరిపించారు. మంగళ వాయిద్యాలతో, భక్తులు గోవిందా నామస్మరణ చేస్తుండగా ఆలయ అర్చకులు జగన్ మోహన్ ఆచార్యులు,వేద పండితులు కళ్యాణాచార్యులు, వేదమంత్రోచ్చా రణలతో స్వామి వారి కళ్యాణం కన్నుల పండుగగా చేశారు. కళ్యాణం అనంతరం స్వామివారికి తులా భారం జరిపించి అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బోడుగం మల్లారెడ్డి, సురకంటి నాగిరెడ్డి, సామల్ల వేణు, అనుపురం చిన్న లింబాద్రిగౌడ్, రఘునాథ చార్యులు, కనపర్తి శ్రీనివాస్, ఉట్నూరి గంగాధర్, భక్తులు పాల్గొన్నారు.

చక్కెర ఫ్యాక్టరీ, వాటి భూములను కాపాడాలి

బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు

నవతెలంగాణ-మెట్‌పల్లి



తెలంగాణకే తలమానికంగా ఉన్న నిజాం చక్కెర కర్మాగారాలను నాశనం చేసింది కేసీఆరే అని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ చిట్నేని రఘు అన్నారు. మంగళవారం చక్కెర కర్మాగారాలను, వాటి భూములను కాపాడాలని కోరుతూ చెరుకు రైతులు, రైతు సంఘ ప్రతినిధులతో కలిసి ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 2015లో లే ఆఫ్ ప్రకటించి మూసివేసారన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని మరిచిపో వడంతోనే చెరుకు రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. చక్కెర ఫ్యాక్టరీ తెరిపించాలని, భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, ధర్నా కార్యక్రమ కన్వీనర్, రాష్ట్ర నాయకులు ఏలేటి నరేందర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చెట్లపల్లి మీనా - సుఖేందర్ గౌడ్, నరేష్, రాష్ట్ర ఓబీసీ ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్ పాల్గొన్నారు.

యాదవుల చైతన్యానికి కృషి చేద్దాం

నవతెలంగాణ-కోరుట్ల

జిల్లాలో యాదవులను చైతన్య పరచడానికి నిరంతరం కృషి చేద్దామని, అందుకు యాదవ విద్యా వంతులు, మేధావులు ముందుకు రావాలని యాదవ సంఘం అడహాక్ కమిటీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్ అన్నారు. మంగళవారం కోరుట్ల మండలంలోని యూసుఫ్ నగర్‌లో గ్రామ యాదవ సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవవుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, సభ్యత్వాల ద్వార సంఘ బలోపేతం గురించి చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం సంఘ సభ్యులు మొత్తం 42 మంది సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘ సభ్యులు ముక్కెర గంగాధర్ యాదవ్,ముక్కెర నర్సయ్య యాదవ్, దండికే గంగాధర్ యాదవ్, పాశం రాములు యాదవ్, పంతంగి రాజేందర్ యాదవ్, పంతంగి కళ్యాణి యాదవ్, ముక్కెర హారిక యాదవ్, ముక్కెర వందన యాదవ్, అంగ నడిపి రాజు యాదవ్, కిషన్ రావ్ పల్లె మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి హైస్కూల్ ఐఐటి అకాడమీలో భారత్ స్కౌట్స్ అండ్ డేట్స్ దీక్షా స్వీకరణ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



జగిత్యాల పట్టణంలోని జ్యోతి హైస్కూల్ ఐఐటి అకాడమీలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో దీక్ష స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ భీమ్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు స్కౌట్స్‌లో రాణించాలని, సమాజసేవకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపయోగ పడుతుందన్నారు. క్రమ శిక్షణ కూడా అలవడుతుందన్నారు. సమాజ నిర్మాణంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ పాత్ర కీలకమని అన్నారు. అనంతరం జగిత్యాల విద్యాధికారి కె. రాము మాట్లాడుతూ.. స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణను విద్యార్థులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. స్కౌట్ శిక్షణ ద్వారా విద్యార్థులలో చిన్నప్పటి నుంచి దేశభక్తి, దైవభక్తి, క్రమశిక్షణ, సామాజిక సేవ అలబడుతుందన్నారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో కవాతు పాల్గొన్న స్కౌట్స్ అండ్ గైడ్స్‌కి ప్రశంస పత్రం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఏఎస్ఓసి ఎస్. వెంకటేశ్వర్లు, జిల్లా సెక్రెటరీ మధుసుధన్, జిల్లా కమిషనర్ బియ్యాల హరి చరణ్‌రావు, జాయింట్ సెక్రెటరీ జమున, డీఓసీ, డీటీసీ, స్కౌట్స్ మాస్టర్స్ అండ్ గైడ్ కెప్టెన్లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఆహ్లాదం ఆవిరి..!

- ఎండుతున్న పల్లె ప్రకృతి వనం
- లక్షల సొమ్ము ప్రజా ధనం వృథా


ఎండిపోయిన మొక్కలు

నవతెలంగాణ - చందుర్తి :
గత ప్రభుత్వం గ్రామాల్లో ఆహ్లాద వాతావరణం ఉండాలని పల్లె ప్రకృతి వనాలకు శ్రీకారం చుట్టింది. కానీ, వాటి నిర్వహణను చూడకపోవడంతో అవి ఎండిపోయి, ప్రకతి వనం ఎడారిలా తలపిస్తోంది. సోమవారం మూడపల్లి పల్లె ప్రకతి వనాన్ని నవ తెలంగాణ సందర్శించగా, దాదాపు వంద చెట్లు ఎండిపోయి ఉన్నాయి. నిర్వహణ లోపంతో పల్లె ప్రకతి వనం ఎడారిని తలపిస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. చౌట భూమి లో మట్టి పోసి మొక్కలను నాటడం కారణంగానే చెట్లు ఎండి పోవడానికి కారణంగానే మొక్కలు ఎండుతున్నాయని పలువురు వాపోతున్నారు. మరో వైపుగా భూమి లో పరుపు బండ ఉండగా మొక్కల వేర్లు విస్తరించక పోవడం దీంతో చెట్లు ఎండి పోయే అవకాశం ఉందని తెలుస్తోంది. దీనిపై ఏపీఓను ఫోన్లో వివరణ కోరగా తమ పరిధి కాదు గ్రామ సెక్రెటరీ బాధ్యత అని చెప్పారు.

16న సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :
సిరిసిల్ల పట్టణంలో ఈ నెల 16న సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ముశం రమేష్ తెలిపారు. మంగళవారం సమావేశానికి సంబంధించిన కరపత్రాలను సీపీఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముశం రమేష్ మాట్లాడుతూ, ఈ సమావేశానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు 16వ తేదీన ఉదయం 10గంటలకు తంగలపల్లి బ్రిడ్జి వద్ద నుంచి బైక్ ర్యాలీ ఉంటుందని తెలిపారు. సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జవ్వాజి విమల, మల్లారం అరుణ్ కుమార్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎర్రవెల్లి నాగరాజు, మల్లారపు ప్రశాంత్, సీపీఎం నాయకులు సంపత్, సిరిమల్లె సత్యం, ఉడుత రవి, కళ్యాణ్, మనోజ్, సంధ్య, గాజుల రాజు, ఆడెపు రాజు, సదానందం, బడుగు రాములు, వంగ సుదర్శన్, మెరుగు మహేష్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నవతెలంగాణ - చొప్పదండి : మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం శాస్త్రవేత్తలు రైతులకు వరి పంటలో పొట్ట దశలో ఎరువుల యాజమాన్యం, కీటకాల వ్యాప్తిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వరిలో తడి పొడి విధానం వలన అధిక దిగుబడులు వస్తాయని శాస్త్రవేత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి.వంశీకృష్ణ, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఫ్లెక్సీ షాపుల బంద్



నవతెలంగాణ - చొప్పదండి : చొప్పదండి మండల కేంద్రంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు మూడు రోజులు ఫ్లెక్సీ షాపులు బంద్ చేయనున్నట్లు చొప్పదండి ఫ్లెక్సీ ప్రింటింగ్ అసోసియేషన్, కరీంనగర్ ఫ్లెక్సీ ప్రింటర్స్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి మహ్మద్ ఆసిఫ్ మంగళవారం తెలిపారు. కేంద్రం ప్రకటించిన జీఎస్టీ పెంపు ధరలు, ముడి సరుకులు, ట్రాన్స్‌పోర్ట్ ధరలు అధికంగా పెరగడం వలన పాత ధరలతో తాము పనులు చేయలేక సతమతమవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఫ్లెక్సీ ప్రింటింగ్ యూనిట్ సభ్యులందరూ కలిసి ఒక ధరను నిర్ణయించి, వాటిని అమలుపరిచే ప్రయత్నంలో కరీంనగర్‌లోని 42 యూనిట్ల ఓనర్ల సభ్యులు కలిసి పెరిగిన ధరలను నిర్ణయిస్తామని తెలిపారు. దీనిని కస్టమర్లు గమనించాలని కోరారు.

డీలర్లు స్టాక్ ఎంట్రీ తప్పనిసరిగా చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి

నవతెలంగాణ - తిమ్మాపూర్ : జిల్లాలోని వివిధ మండలాల్లో పురుగుల మందులు విక్రయించే డీలర్లు స్టాక్ తప్పనిసరిగా ఎంట్రీ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆమె హాజరై మాట్లాడారు. పురుగుల మందు స్టాక్ వివరాలను అపెండెక్స్ బీ ఒలంస్ పురుగు మందుల యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయుట గురించి డీలర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల వ్యవసాయ అధికారి సురేందర్, గన్నేరువరం వ్యవసాయ అధికారి కిరణ్మయి, ఏడీఏ ఆఫీస్ ఏవో రమ్యశ్రీ, డీలర్లు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా ప్యాడ్ల పంపిణీ



నవతెలంగాణ - ముస్తాబాద్ :
గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం కింద మండలంలోని ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు సుమారు 475 కేటీఆర్ పరీక్షా ప్యాడ్లను సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, మాజీ ఎంపీపీ అక్కరాజ శ్రీనివాసు, మండల టీఆర్ఎస్ అధ్యక్షుడు బొంపల్లి సురేందర్ రావు, పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నరసింహారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు గాండ్ల సుమతి కృష్ణమూర్తి, నల్ల నరసయ్య, సర్వర్ పాషా, నాయకులు శీలం స్వామి, మెంగని మనోహర్, గూడూరి భరత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కరీంనగర్ ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

శబ్ద కాలుష్య వాహనాలు, మైనర్ డ్రైవింగ్‌పై చర్యలు



నవతెలంగాణ - కరీంనగర్ క్రైం :
కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాలతో, కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ విభాగం మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ డ్రైవ్‌లో భాగంగా, ప్రజలకు శబ్దంతో అసౌకర్యం కలిగిస్తున్న 8శబ్ద కాలుష్య వాహనాలు, 4మైనర్ డ్రైవింగ్ వాహనాలను పట్టుకున్నారు. వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. శబ్ద కాలుష్యం వల్ల ప్రజలకు కలిగే ఇబ్బందుల గురించి వివరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినట్లయితే, సంబంధిత వాహన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ కరీముల్లాఖాన్ తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ సీఐలు కరీముల్లా ఖాన్, పర్శ రమేష్, ట్రాఫిక్ ఎస్ఐ ఉపేంద్ర చారి, ఆర్ఎస్ఐ గణేష్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

నవతెలంగాణ - సిరిసిల్ల :
ఉత్తమ బోధన అందించడంతో పాటు, విద్యార్థుల ఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల విద్యాలయాన్ని సందర్శించి, దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. జాతీయ అంధత్వ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆర్‌బీఎస్‌కె మొబైల్ హెల్త్ బృందాలు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, జిల్లాలో మొత్తం 2,010 మంది విద్యార్థులు దృష్టి లోపంతో బాధపడుతున్నారని నిర్ధారించారు. ఇందులో ఈరోజు జిల్లా వ్యాప్తంగా 338 కంటి అద్దాలను పంపిణీ చేయడం జరిగిందని, అవసరమైన వారికి శస్త్ర చికిత్సల కోసం హైదరాబాద్ లోని సరోజిని కంటి ఆసుపత్రికి పంపడం జరిగిందని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. రజిత జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తమకు వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకుని చదువులో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యను అభ్యసిస్తున్న వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి, మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. అనంతరం దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు కలెక్టర్ కంటి అద్దాలను అందజేశారు. తదనంతరం విద్యాలయంలోని తరగతి గదులను, కిచెన్, స్టోర్ రూమ్‌ను కలెక్టర్ పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అనే వివరాలను విద్యార్థులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తనకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. ఇంటర్మీడియట్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులతో మాట్లాడి పరీక్షలు ఎలా రాస్తున్నారు అని అడిగారు. విద్యార్థులతో నిత్యం సాధన చేయించాలని ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సంపత్, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నయీం జహా, మెడికల్ ఆఫీసర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

- హాజరైన పలు విద్యార్థి సంఘాలు
- విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :
సిరిసిల్ల పట్టణం బివై నగర్‌లోని అమృతలాల్ శుక్ల కార్మిక భవన్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గుండెల్లి కళ్యాణ్ కుమార్ అధ్యక్షతన మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పలు విద్యార్థి, యువజన సంఘాల నాయకులు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని వారు ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాలలో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. వెంటనే విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో భవిష్యత్తులో అన్ని సంఘాలు కలిసి ఉద్యమ కార్యాచరణ రూపొందించుకొని విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పర్కాల రవీందర్, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సంపత్ కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్ కుమార్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి నాగరాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి జవ్వాజి విమల, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ముశం రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జాలపల్లి మనోజ్ కుమార్, గర్ల్స్ కన్వీనర్ సంజన, జిల్లా కమిటీ సభ్యులు సాయి భరత్, నాయకులు శ్రీధర్, తల్లిదండ్రుల సంఘం నాయకులు సత్యం, రవి పాల్గొన్నారు.

కార్మిక సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- మున్సిపల్ కమిషనర్‌కు వినతి
- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికుల వినతిపత్రం


కమిషనర్ కు వినతి పత్రం అందజేస్తున్న కార్మిక నాయకులు..

నవతెలంగాణ - వేములవాడ :
కార్మిక సమస్యలను త్వరగా పరిష్కరించాలని మంగళవారం వేములవాడ మున్సిపల్ కమిషనర్‌కు పారిశుధ్య కార్మికులతో కలిసి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ అనుబంధం, రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో వేములవాడ మున్సిపల్ కమిషనర్‌కు కార్మిక సమస్యలపై వినతిపత్రం ఇచ్చినట్లు రాములు తెలిపారు. మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వమే వేతనాలు ట్రెజరీ ద్వారా ఇవ్వాలని, వేతనాలు పెంచే వరకు తాత్కాలిక భృతి కింద రూ. 4 వేలు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 60 ప్రకారం పెంచిన వేతనంలోని మూడు నెలల బకాయిలను చెల్లించాలని, వేతన సవరణ కాలం 2022 జులైతో ముగిసిందని, వెంటనే వేతన సవరణ చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని కోరారు. మున్సిపల్ కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోతే రూ.25 లక్షలు ఇవ్వాలని, 60 సంవత్సరాల వయసు దాటిన ఔట్ సోర్సింగ్ కార్మికులకు పదవీ విరమణ జరిగితే రూ.10 లక్షలు ఇవ్వాలని అభ్యర్థించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సిబ్బంది, పారిశుధ్య కార్మికులను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మల్లేశం, రాజయ్య, దుర్గయ్య, మల్లయ్య, లక్ష్మిరాజం, చంద్రయ్య రాజు, నాగరాజు పాల్గొన్నారు.

విగ్రహాల ఆవిష్కరణకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవేందర్ రెడ్డి
- రిలే నిరాహార దీక్షలో నాయకులు


రిలే నిరాహార దీక్షలో కూర్చున్న నాయకులు

నవతెలంగాణ - తిమ్మాపూర్ :
తిమ్మాపూర్ మండల కేంద్రంలో గత రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలకు ఉన్న ముసుగులను తొలగించి, ఆవిష్కరణ చేసేలా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. అంబేద్కర్, జగ్జీవన్ రాం విగ్రహాల ముసుగులను తొలగించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని అన్ని రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజా సంఘాలతో ఏర్పడిన జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రెండో రోజు రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని దేవేందర్ రెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వంలో నాటి ఎమ్మెల్యే రసమయి ఒక సంకల్పంతో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలను ఒక ఉన్నతాధికారి అడ్డుకోవడం వల్లే ఈ సమస్యకు పరిష్కారం దొరకడం లేదని అన్నారు. నుస్తులాపూర్ సొసైటీ చైర్మన్ గుజ్జుల రవీందర్ రెడ్డి, ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు బోయిని కొమురయ్య, మాతంగి లక్ష్మణ్, కనకం రాములు, పొన్నం అనిల్, పాశం అశోక్ రెడ్డి, గుజ్జుల ప్రణీత్ రెడ్డి, చింతం శ్రీనివాస్, గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, బుట్ల శ్రీనివాస్ దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. జేఏసీ కన్వీనర్లు దుండ్ర రాజయ్య మాతంగి శంకర్, సుగుర్తి జగదీశ్వరాచారి, వంతడుపుల సంపత్, అంబాల సతీష్‌లతో పాటు వివిధ పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు సముద్రాల లక్ష్మణ్, పార్నంది జలపతి, ఉప్పులేటి రాజు, తాటిపెల్లి సంపత్, కొయ్యడ మురళి, గాజ సాగర్, అలువాల కుమార్, కామెర వెంకటేష్, మాతంగి రాజమల్లు, కొమ్ము సంపత్, గొల్లపెల్లి మల్లేశం గౌడ్, మేకల మహేష్, పబ్బ తిరుపతి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ


కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..

నవతెలంగాణ - వేములవాడ :
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడం లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆర్బీఎస్కే ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మన ప్రాంతంలో రుద్రంగి మండల కేంద్రంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. గత పదేళ్లుగా నిర్లక్ష్యంగా మారిన విద్యలో మార్పు తీసుకొచ్చి పేద విద్యార్థులకు మంచి విద్యను అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని అన్నారు. కేజీవీబీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు చేపట్టి కంటి సమస్యలు గుర్తించి అద్దాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 338 మంది విద్యార్థులను గుర్తించి కంటి అద్దాలను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట పట్టణంతో పాటు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 250 మంది పదో తరగతి విద్యార్థులకు యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు ఆధ్వర్యంలో ప్యాడ్లు, పెన్నులు, స్కేల్‌లు మంగళవారం స్థానిక జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, చదువుతోనే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని అన్నారు. యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు మాట్లాడుతూ, పదో పరీక్షల్లో కరీంనగర్ జిల్లాలోనే జమ్మికుంట మండలం అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు. 10/10 సాధించిన విద్యార్థులకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం, వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, జమ్మికుంట ఇల్లందకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోలుగురి సదయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, రాచపల్లి సాగర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పూదరి రేణుక పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ - చందుర్తి : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మాల్యాలలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పోతరాజు గంగాధర్ (45) తన ద్విచక్ర వాహనంపై గత శనివారం సొంత పనుల నిమిత్తం చందుర్తికి వచ్చి తిరుగు ప్రయాణంలో మాల్యాల వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం వేగంగా ఢీకొట్టడంతో గంగాధర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గంగాధర్‌ను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యులు హైదరాబాద్ కిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు.

మానకొండూరు ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు రూ.200 కోట్లు మంజూరు

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి నిధులు విడుదల



నవతెలంగాణ - తిమ్మాపూర్ :
మానకొండూరు నియోజకవర్గం పరిధిలోని యాదవులపల్లిలో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌తో సహా రాష్ట్రవ్యాప్తంగా 55 స్కూళ్లకు రూ.11,000 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఒక్కో స్కూల్‌కు రూ. 200 కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయని, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, అకాడమిక్ బ్లాక్, స్టాఫ్ క్వార్టర్స్, లైబ్రరీ, క్రీడా ప్రాంగణం, బాలురు, బాలికల హాస్టల్ బ్లాకులు నిర్మిస్తారని తెలిపారు. నిధుల మంజూరుపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసిన సీపీ

పెండింగ్ కేసులపై చర్చ



నవతెలంగాణ - కరీంనగర్ క్రైం:
కరీంనగర్ నూతన పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న గౌస్ ఆలం మంగళవారం కరీంనగర్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి బి.ప్రతిమను జిల్లా కోర్టులోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కమిషనరేట్ వ్యాప్తంగా కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలపై చర్చించారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ


విద్యార్థులకు పరీక్షా ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ - తంగళ్ళపల్లి :
త్వరలో జరిగే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మాజీ ఎంపీపీ పడిగల మానస ఆకాంక్షించారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు గిఫ్ట్ ఏ స్మైల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పరీక్షా ప్యాడ్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివితేనే భవిష్యత్తులో మంచి స్థానాల్లో ఉంటారని, ఇష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. పదో తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజబింక రాజన్న, తంగళ్ళపల్లి పట్టణ అధ్యక్షుడు బండి జగన్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల ఫలితాలు విడుదల చేయవద్దు

ఎంఆర్పీఎస్ నాయకుల నిరాహార దీక్ష



నవతెలంగాణ - తంగళ్ళపల్లి : తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోటీ పరీక్షల ఫలితాలను విడుదల చేయవద్దని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సావనపెల్లి బాలయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు నిరాహార దీక్ష చేపట్టారు. ఎస్సీ వర్గీకరణకు చట్టం వచ్చేంత వరకు గ్రూప్-1, గ్రూప్-2, ఇతర పోటీ పరీక్షల ఫలితాల ప్రకటన నిలుపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ దీక్షలో ప్రధాన కార్యదర్శి అవునూరి రమేష్, గౌరవ అధ్యక్షుడు మల్యాల లచ్చన్న, మండల కార్యదర్శి కొమ్మెట దేవయ్య, మహంకాళి రవి, సీనియర్ నాయకులు మునిగే శంకర్, మల్లారపు నరేష్, రాజశేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

మేట్లను యథావిధిగా కొనసాగించాలి



నవతెలంగాణ - శంకరపట్నం : శంకరపట్నం మండలం కన్నాపూర్, ధర్మారం గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ పనుల పర్యటనలో భాగంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వర్ష రాజు మంగళవారం పనులను సందర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ పనిలో పనిచేస్తున్న మేట్లను యథావిధిగా కొనసాగించాలని, వారిని పనిలో తీసుకోవాలని, పాత పద్ధతిలో పని చూపించాలని, వారికి పారితోషికం అందించాలని, పాత బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని 20 గ్రామాల్లో పనులు కల్పించాలని, పని ప్రదేశాల్లో ప్రమాదం జరిగితే వారికి రూ. 10 లక్షల ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. మేట్లను పనిలో తీసుకునే వరకు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఫెర్టిలైజర్ డీలర్లు నిల్వలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

నవతెలంగాణ - శంకరపట్నం : మండల కేంద్రంలోని కేశవపట్నం రైతు వేదికలో మంగళవారం ప్రైవేట్, పీఏసీఎస్ పురుగు మందుల డీలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మానకొండూరు సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీధర్ మాట్లాడుతూ, ప్రతి నెలా పురుగు మందుల నిల్వలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానం గురించి డీలర్లకు వివరించారు. డీలర్లు తప్పనిసరిగా ప్రతి నెలా తమ పురుగు మందుల నిల్వలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, స్టాక్ రిజిస్టర్లు, నిల్వలు, ఇతర రికార్డులను సరిగ్గా నిర్వహించాలని సూచించారు. రైతుల ప్రయోజనాలను కాపాడటానికి, నాణ్యమైన పురుగు మందులు అందుబాటులో ఉండేలా చూడటానికి ఇది సహాయపడుతుందని తెలిపారు.

స్వగ్రామంలో ప్రభుత్వ విప్ పూజలు


పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

నవతెలంగాణ - రుద్రంగి :
ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తన స్వగ్రామమైన రుద్రంగి గ్రామంలోని ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని రెండు ఆలయాల్లో ఆయన మంగళవారం స్థానిక నాయకులతో కలిసి దర్శనం చేసుకున్నారు. పాడి పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా చల్లగా చూడాలని కోరుకున్నట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. ఆయన వెంట రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, మాజీ జడ్పీటీసీ గట్ల మినయ్య, నాయకులు తర్రె మనోహర్, ఎర్రం గంగానర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, భూమేష్ గంగాధర్, రవి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ సీతారామ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



నవతెలంగాణ - తిమ్మాపూర్ :
మండలంలోని నల్లగొండ గ్రామంలోని శ్రీ సీతారామ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ సీతారామ లక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను ఉత్సవ కమిటీ చైర్మన్ బండారిపల్లి లక్ష్మణ్ సమర్పించారు. జిల్లా, మండల, చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కళ్యాణాన్ని తిలకించారు. ఈ నెల 14న బండ్లు తిరుగుట, 16న రథోత్సవం ఉంటుందని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కళ్యాణంలో ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో రామగుండంను నెంబర్ వన్‌గా నిలుపుతా

రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

నవతెలంగాణ-గోదావరిఖని:



అభివృద్ధిలో రామగుండంను నెంబర్ వన్‌గా నిలుపుతానని, పారిశ్రామిక ప్రాంతాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం, సింగరేణి సహకారంతో అభివృద్ధి చేయడం జరుగుతుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గోదావరిఖని లక్ష్మినగర్‌లో సింగరేణికి సంబంధించిన రూ.15 కోట్ల నిధులతో చేపడుతున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.15 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్ సంబంధించి ఇప్పటికే డిజైన్ పూర్తి చేశామని, ఇందుకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్, సింగరేణి ఆర్జీ-1 జీఎం డి.లలిత్ కుమార్, తాజా మాజీ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్, పెద్దెల్లి తేజశ్విని ప్రకాష్ పాల్గొన్నారు.

8వ కాలనీలో సానిటేషన్ స్పెషల్ డ్రైవ్

నవతెలంగాణ-యైటింక్లైన్‌కాలనీ

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ ఆధ్వర్యంలో 8వ కాలనీలో సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా 17వ డివిజన్ సంతోష్‌నగర్‌లో మురుగు కాలువలో పేరుకుపోయిన మట్టిని తొలగించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సూపర్వైజర్ రేపాల సారయ్య,డ్రైయిన్ క్లీనర్స్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన హార్టికల్చర్ అధికారి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల జిల్లా హార్టికల్చర్ అధికారిగా నూతనంగా నియామకమైన శ్యాం ప్రసాద్ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. వారి వెంట హార్టికల్చర్ అధికారిని స్వాతి, ఆయిల్ ఫామ్ మేనేజర్ విజయ భరత్, హార్టికల్చర్ అధికారులు అన్వేష్, ఉదయశ్రీ తదితరులు ఉన్నారు.

'నన్ను ఆకారణంగా తొలగించారు'

నవతెలంగాణ-మంథని

మంథని మండలంలోని గోపాల్‌పూర్ గ్రామ వసుంధర గ్రామైక్య సంఘం వీఓఏగా పని చేస్తున్న గొరిగే జయసుధ తనను ఆకరణంగా తొలగిం చారని, అధికారులు న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేసింది. కొంత మంది మహిళలు తానంటే గిట్టని వారు తనపై ఫిర్యాదు చేశారని, పెద్దపల్లి డీఆర్డీఏ నుంచి ఎలాంటి విచారణ చేయకుండానే విధుల నుంచి తొలగించారని వీవోఏ జయసుధ వాపోయారు. తాను ఎలాంటి అవినీతి అక్ర మాలకు పాల్పడలేదని పేర్కొన్నారు. అకారణంగా ఆరోపణలు చేస్తూ తొలగించిన వారిపై ఉన్న తాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

డబుల్ రోడ్డు నిర్మాణానికి

రూ.33.70కోట్లు మంజూరు

నవతెలంగాణ-ముత్తారం

ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి పంచాయతీ నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా వరకు డబుల్ రోడ్డు నిర్మాణం కోసం రూ.33.70 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. గతంలో రోడ్డుకు నిధులు మంజూరు కాగా, ఫారెస్ట్ నుంచి క్లియరెన్స్ లేక నిధులు నిలిచిపోయాయి. అయితే రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా భూపాలపల్లి వరకు రోడ్డు కోసం ఫారెస్ట్ క్లియర్స్ తీసుకొని జీవో నెంబర్ 113 ద్వారా 33 కోట్ల 70 లక్షలు నిధులను మంజూరు చేయించారు. ఖమ్మంపల్లి నుంచి భూపలపల్లికి 42 కిలోమీటర్ల దూరం ఉండగా, ఈ రోడ్డు నిర్మాణంతో 18 నుంచి 20 కిలోమీటర్ల లోపే చేరుకోవచ్చు. రోడ్డు నిర్మాణానికి ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించిన మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఖమ్మంపల్లి జడ్పిహెచ్‌ఎస్‌లో ట్విన్నింగ్ కార్యక్రమం

నవతెలంగాణ-ముత్తారం:



ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి జడ్పిహెచ్‌ఎస్ పాఠశాలలో, అదేవిధంగా సీతంపేట, ఇప్పలపల్లి యుపిఎస్ పాఠశాలల్లోని విద్యార్థులకు సమగ్ర శిక్ష పెద్దపల్లి వారి ఆధ్వర్యంలో ట్విన్నింగ్ కార్యక్రమాన్ని మంగళ వారం నిర్వహించారు. విద్యార్థులకు విజ్ఞాన శాస్త్ర ప్రయోగాలు, పాఠశాల గ్రంథాలయం, ఐఎఫ్‌పి, ప్యానల్స్ ద్వారా బోధన ప్రక్రియలను విద్యార్థులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎన్.హరిప్రసాద్, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు సిహెచ్.సునీల్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మల్లయ్య, లక్ష్మణాచారి, ఫిలిప్ తదితరులున్నారు.

రెండో రోజు విధులు బహిష్కరించిన న్యాయవాదులు

నవతెలంగాణ-గోదావరిఖని: బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తౌటం సతీష్‌పై తప్పుడు కేసు నమోదు చేశారని, న్యాయవాదులను దూషించిన వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని న్యాయవాదుల పరిరక్షణ చట్టం అమలు చేయాలని గోదావరిఖని న్యాయవాదులు రెండో రోజు మంగళవారం విధులు బహిష్కరించారు. విధులు బహిష్కరించటంతో 3 మున్సిఫ్ కోర్టులు, అదనపు జిల్లా న్యాయస్థానం, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులలో విధులు నిలిచి పోయినట్లు తెలిపారు. అనంతరం మున్సిఫ్ కోర్ట్ ఎదుట న్యాయవాదులు నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తౌటం సతీష్, ప్రధాన కార్య దర్శి జవ్వాజి శ్రీనివాస్, నాయకులు గోసిక ప్రకాష్, రామ టెంకి శ్రీనివాస్, పులిపాక ప్రవీణ్, మహేందర్, భాను కృష్ణ పాల్గొన్నారు.

బీసీ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-గోదావరిఖని



బిసి అసోసియేషన్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ బిసి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ చిలుక శ్రీనివాస్, ప్రెసిడెంట్ పి.వసంత్ కుమార్, జనరల్ సెక్రెటరీ వూట్ల దేవాచారి, ట్రెజరర్ దేవులపల్లి రాజేందర్, రీజినల్ వైస్ ప్రెసిడెంట్ దీపి, దీటి చంద్రమౌళి, కుమారస్వామి, చిందం శ్రీనివాస్, ఇప్పలపల్లి సతీష్, రావుల దామోదర్, అనుమండ్ల నవీన్ తదితరులున్నారు.

ఇంటర్ పరీక్షలకు 96.45 శాతం విద్యార్థులు హాజరు

నవతెలంగాణ-పెద్దపల్లి :జిల్లాలో మంగళవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 96.45 శాతం విద్యార్థులు హాజరు కావడం జరిగిందని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇంటర్ మొదటి సంవత్సరం మ్యాథ్స్ 1, బాటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఈ పరీక్షకు (5845) మంది హాజరు కావాల్సి ఉండగా, (5638)మంది హాజరు కాగా,(207) మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని తెలిపారు.

గుంజపడుగులో పారిశుధ్య పనులు పరిశీలన

నవతెలంగాణ-మంథని :మండలంలోని గుంజ పడకు గ్రామపంచాయతీలో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను ఎంపీడీవో శశికళ మంగళవారం పరిశీలించారు. గ్రామంలోని తాగునీటి ట్యాంకులను శుభ్రపరచి ఫ్లోర్నేషన్ పనులు చేయాలని సిబ్బందికి సూచించారు. నర్సరీ పనులపై పర్యవేక్షణ చేసి తగు సూచనలను ఆమె జారీ చేశారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శితో పాటు సిబ్బంది ఉన్నారు.

మంథనిలో ఇంటర్ 75వ బ్యాచ్ స్వర్ణోత్సవాలు

నవతెలంగాణ-మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1970 సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదువుతున్న బ్యాచ్ స్వర్ణోత్సవాలను విజయ వంతం చేయాలని మంథని విద్యార్థి యువత వ్యవస్థాపక అధ్యక్షులు కొండేల. మారుతి కోరారు. విద్యార్థి యువత కార్యాలయంలో స్వర్ణోత్సవాల పోస్టరును ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 15న విద్యార్థి యువత ఆధ్వర్యంలో స్వర్ణోత్సవాలను నిర్వహించనున్న మన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రుపట్ల సుధాకర్‌రెడ్డి, పోరెడ్డి వెంకటరెడ్డి, కొమరోజు శ్రీనివాస్, నర్సింగరావు,బోగోజు. శ్రీనివాస్, షరిపోద్దిన్, నారమల్ల కృష్ణ పాల్గొన్నారు.

యువత ఆలోచనలు కార్యరూపం దాల్చేందుకు వీహబ్ సహకారం

పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష

నవతెలంగాణ-పెద్దపల్లి



యువత ఆలోచనలు కార్యరూపం దాల్చేందుకు వీ హబ్ సహకారం అందిస్తుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విద్యార్థులకు నిర్వహించిన ఐడియేషన్ బూట్ క్యాంపులో పాల్గొని కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులు జాబ్ చేసే ధోరణి నుంచి జాబ్‌లు సృష్టించాలనే లక్ష్యాలు నిర్దేశించు కోవాలని తెలిపారు. చిన్నతనం నుంచి మనం పెరిగిన వాతావరణం ఒక మంచి జాబ్ దొరికితే లైఫ్ సెటిల్ అవుతుంది అని ఆలోచన మనకు ప్రేరేపి స్తుందని, వీ హబ్ ద్వారా యువతకు మరో వైపు గల అవకాశాలు, యువత ఆశయాలకు తోడ్పాటు అందించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. చుట్టూ ఉన్న చిన్న చిన్న సమస్యలను పరిష్కరించడంలో వినూత్న ఆలోచనలు చేసి యువత పెద్ద పెద్ద కంపెనీలను స్థాపించిందని తెలిపారు. స్విగ్గి, ఓయో, రాపిడో, ఓలా వంటి వివిధ కంపెనీలు చిన్న చిన్న ఆలోచనలతో ప్రారంభమ య్యాయన్నారు. యువత తనకు పరిమితులు విధించుకోవద్దని తెలిపారు. చిన్న చిన్న ఆలోచనలతో వచ్చే యువతకు వీహబ్ ద్వారా వివిధ సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని తెలిపారు. మన చుట్టూ ఉన్న ఏదైనా సమస్య పరిష్కారానికి యువత ఐడియాతో వస్తే దాన్ని కాదే రూపం దాల్చేందుకు అవసరమైన ఫైనాన్స్ సపోర్ట్, మార్కెటింగ్, ప్రోడక్ట్ తయారీ వంటి వివిధ దశల్లో తోడ్పాటు అందించేందుకు వీ హబ్ పని చేస్తుందని తెలిపారు. వీ హబ్ అసోసియేట్ డైరెక్టర్ ఊహ మాట్లాడుతూ.. 2018లో వీహబ్‌ను గ్లోబల్ ఎకనామిక్ సమ్మెలో భాగంగా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. సోషల్ ఇంపాక్ట్ లో భాగంగా మహిళలకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు శిక్షణ అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీ-హబ్ సంచాలకులు జహీద్ అక్తర్ షేక్,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. కాళిందిని, స్టూడెంట్ ప్రోగ్రామ్ లీడ్ జై, ప్రాజెక్టు కోఆర్డినేటర్ సాయిరాం, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేష్, జిల్లా పరిశ్రమల అధికారి కీర్తి కాంత్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మురళి, గోదావ రిఖని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఉష పాల్గొన్నారు.

ఇసుక రవాణాతో ఇంకెంత మంది ప్రాణాలు బలికావాలి?

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శెంకేషి రవీందర్

నవతెలంగాణ-రామగిరి



ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే ఇసుకను బంద్ చేస్తా అని ఇచ్చిన మాటకు కట్టుబడవా అని మంత్రి శ్రీధర్‌బాబును బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శెంకేషి రవిందర్ సూటిగా ప్రశ్నించారు. మంగళవారం రామగిరి మండల కేంద్రంలోని సెంటినరీకాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. ఎన్నికలకు ముందు ప్రజలను రెచ్చగొట్టి మీ తాతముత్తాతల ఆస్తి ఇసుకను బీఆర్ఎస్ నాయకులు కొల్లగొడుతున్నారని శ్రీధర్ బాబు చెప్పారని, మరి ఇప్పుడు ఈ ఇసుక ఎవరి ఆస్థి, ఇప్పుడు ఎవరు కొల్లగొడుతున్నరని ఆయన విమర్శించారు. ఎన్నికలకు ముందు అమలు సాధ్యం కాని ఆరు గ్యారంటీల మాదిరిగానే మంథని ప్రజలను మభ్యపెట్టేందుకు తాము గెలిచిన రెండు రోజుల్లోనే లారీలను ఆపేయిస్తా అని పదిహేను నెలలు గడిచినా ఇంకా ఎందుకు ఆపడం లేదని ఆయన ప్రశ్నించారు. మహదేవ్‌పూర్ నుండి కమాన్ పూర్ వరకు ఇసుక లారీలు మరణ మృదంగం మోగిస్తుంటే నిత్యం వరుస ప్రమాదాలతో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కమాన్‌పూర్ వద్ద జరిగిన ప్రమాదంలో పోలీసుల కళ్ల ముందే కల్వచర్లకు చెందిన దొంతుల వాణి అక్కడికక్కడే మృతి చెందిందనానరు.. ఇంకెంత మంది ప్రాణాలు బలైతే ఇసుకను బంద్ చేస్తారని ప్రశ్నించారు. ఇచ్చిన మాట ప్రకారం ఇసుక క్వారీలను బంద్ చేసి ఇసుక రవాణా ఆపకపోతే రాబోయే రోజుల్లో ప్రజలే మీకు బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్య నారాయణగౌడ్, రైతుబంధు అధ్యక్షుడు మేదరవేని కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కాపురవేన భాస్కర్, మాజీ ఎంపీటీసీ ధర్మల రాజసంపత్, నాయకులు కన్నూరి శ్రీశైలం, దామెర శ్రీనివాస్, పాల్గొన్నారు.

నేను ఎవరినీ డబ్బులు డిమాండ్ చేయలేదు

- పోచమ్మ ఆలయంలో కౌశిక హరి ప్రమాణం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం
- బహిరంగ చర్చకు రావాలని సవాల్

నవతెలంగాణ-కోల్‌సిటి



బూడిద, మట్టి, ఇసుక అక్రమ తరలింపుపై రామగుండం నియోజకవర్గం కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య పరస్పర ఆరోపణలు కొనసాగుతున్న నేపథ్యంలో మంగళవారం బీఆర్ ఎస్ నాయకుడు కౌశికహరి పోచమ్మ ఆలయంలో తడి దుస్తులపై స్నానం చేసి దేవుడి ఎదుట ప్రమాణం చేశారు. ఇటీవల అంతర్గాం మండలం నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని కౌశికహరి స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్, కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలు చేయగా దానిపై స్పందిస్తూ కాంట్రాక్టర్ ఆడెపు వెంకటేశ్ ప్రెస్‌క్లబ్ విలేకరులతో మాట్లాడుతూ.. కౌశికహరి డిమాండ్ చేసిన డబ్బులు ఇవ్వక పోవడంతోనే ఎమ్మెల్యే ఆరోపణలు చేస్తున్నారని, తన సచ్చీలతను నిరూపించుకోవాలంటే ఆయన పోచమ్మ ఆలయంలో ప్రమాణం చేయాలని సవాలు విసిరారు. దీనిపై స్పందించిన కౌశిక హరి బీఆర్ఎస్ నాయకులతో కలిసి మంగళవారం పోచమ్మ ఆలయానికి వచ్చి తడిదుస్తులతో స్నానం చేసి ఆలయం ఎదుట ప్రమాణం చేశారు. తాను అక్రమాలను మాత్రమే ప్రశ్నించానని, ఎవరినీ డబ్బులు డిమాండ్ చేయాలేదన్నారు. అక్రమ మట్టి రవాణాను నిలిపివేయాలని గోదావరిఖని గాంధీ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, గులాబీ శ్రేణులు హరికి మద్దతుగా నిలిచారు. నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ బూడిద మట్టి దందాలో ఎమ్మెల్యే హస్తం ఉందని అందుకు బహిరంగ చర్చకు తాము సిద్ధమని, సమయం, చోటు చెప్పాలని ప్రతి సవాల్ విసిరారు.

కొత్త గనులు వస్తేనే సింగరేణి మనుగడ సాధ్యం

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య
- జీడీకే 11వ గనిలో ఎఐటియుసి గేట్ మీటింగ్

నవతెలంగాణ-గోదావరిఖని:



కొత్త గనులు వస్తేనే సింగరేణి మనుగడ సాధ్యమని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థను నూతన బొగ్గు బ్లాకల వేలంలో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మంగళవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని జీడీకే 11వ ఇంక్లయిన్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడుతూ సింగరేణిలో ఇంకో పది సంవత్సరాల్లో గనులు మూతపడనున్నాయని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన బొగ్గు గనుల చట్టం ప్రకారం గతంలో వలే కొత్త గనులు రావడం లేదని ఆయన తెలిపారు. కొత్త గనులు కావాలంటే నూతన చట్టం ప్రకారం వేలంలో సింగరేణి సంస్థ పాల్గొని దక్కించుకోవాలని కేంద్రం చెబుతుందని ఆయన పేర్కొన్నారు. సింగరేణి సంస్థ మనుగడ కొనసాగాలంటే కొత్త గనులు రావాలంటే వేలంలో పాల్గొనేందుకు సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బ్రాంచి జీఎం కమిటీ మెంబర్ సిద్దమల్ల రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీ-1 బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, నాయకులు మాదన మహేష్, రంగు శ్రీను, ఎస్.వెంకట్‌రెడ్డి, నాయిని శంకర్, ఎం.చక్రపాణి, చెప్యాల భాస్కర్, బండి మల్లేష్, గొడిశెల నరేష్, తాళ్లపెల్లి శ్రీనివాస్, గడ్డం బాలక్రిష్ణ, కత్తుల మల్లేష్, బుడిమె సమ్మయ్య పాల్గొన్నారు.

సీపీని మర్యాదపూర్వకంగా

కలిసిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:



రామగుండం నూతన పోలీస్ కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అంబర్ కిషోర్ ఝాను బీజేపీ రామ గుండం ఇన్‌ఛార్జి కందుల సంధ్యారాణి, బిజెపి నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సిపికి పూలబొకే అందజేసి, శాలువా కప్పి సన్మానించి, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

ప్రణయ్ హత్య కేసులో కోర్టు తీర్పు హర్షనీయం

నవతెలంగాణ-మంథని



ప్రణయ్ హత్య కేసులో నల్గొండ జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పు పట్ల ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మంథని అంబేద్కర్ చౌరస్తాలో ప్రేమికులు ప్రణయ్ అమృతల చిత్రపటాలను ప్రదర్శిస్తూ మాట్లాడారు. ఏడు సంవత్సరాల క్రితం నల్గొండ జిల్లా మిర్యాలగూడలో కులాంతర వివాహం చేసుకున్న ప్రణయ్‌ని అతికిరాతకంగా హత్య చేశారని, ఈ విషయంలో జిల్లా కోర్టు సంచలన తీర్పునిస్తూ ఏ1 నిందితుడు మారుతిరావు గతంలోనే ఆత్మహత్య చేసుకున్నాడని, ఏ2 నిందితునికి ఉరిశిక్ష విధిస్తూ మిగతా ఆరుగురి నిందితులకు యావజీవ శిక్ష విధిస్తూ తీర్పునిచ్చిందన్నారు. గతంలో మంథని మండలం ఖానాపూర్ గ్రామంలో మంథని మధుకర్ ప్రేమ వ్యవహారంలో పరువు హత్యకు గురయ్యాడని, రీపోస్టుమార్టం రిపోర్టును కోర్టు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది రగోత్తంరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గొర్రెంకాల సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాబురవి, కేవీపీఎస్ జిల్లా నాయ కుడు మంథని లింగయ్య, కాంగ్రెస్ నాయకులు బూడిద తిరుపతి,బెజ్జంకి దిగం బర్, అజీమ్ ఖాన్, షరీఫ్ ఉద్దీన్,నాయకులు ఇరుగురాల ప్రసాద్‌లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కుంగ్ ఫూ, కరాటే పోటీలలో

జిల్లా విద్యార్థినుల అద్భుత ప్రదర్శన

నవతెలంగాణ-పెద్దపల్లి

జాతీయ స్థాయి కుంగ్ ఫూ, కరాటే పోటీలు 2005లో జిల్లా విద్యార్థినులు అద్భుత ప్రదర్శన కనబరిచారని వీరికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జాతీయ స్థాయి ఛాంపియన్షిప్ పోటీలలో అద్భుత ప్రదర్శన కనబరిచిన పెద్దపల్లి జిల్లా విద్యార్థినులను జిల్లా కలెక్టర్ అభినందించారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు

నవతెలంగాణ-పెద్దపల్లి



కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు అన్నారు.మంగళవారం సీఎంఆర్ఎఫ్, కల్యాణ లక్ష్మి చెక్కులను పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణా రావు పంపిణీ చేశారు.పెద్దపల్లి నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 471 మంది సీఎంఆర్ఎఫ్ కోటి ఇరవై ఏడు లక్షల డెబ్బై ఏడువేల ఐదు వందల రూపాయలు చెక్కులను, పెద్దపల్లి మండలం, పట్టణానికి చెందిన 86 మంది కల్యాణలక్ష్మి, షాది ముబారక్ రూ.86,60,034లక్షల చెక్కలను ఎమ్మెల్యే అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ అంతటి అన్నయ్యగౌడ్, పెద్దపల్లి తహసీల్దార్ రాజయ్య, పెద్దపల్లి మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, చైర్మన్ ఆల్లా సుమన్ రెడ్డి, చింతపండు సంపత్, నర్సింహా రెడ్డి,కడార్ల శ్రీనివాస్, మూల ప్రేమ్ సాగర్ రెడ్డి,గజవేన సదయ్య, బొజ్జ శ్రీనివాస్, సందవేణి రాజేందర్, బండారు రాంమూర్తి, మార్కెట్ డైరెక్టర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్ లు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గ్రామాల్లో డీపీవో సందర్శన

నవతెలంగాణ-జూలపల్లి

మండలంలోని వెంకట్రావుపల్లి, కాచాపూర్ గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని డీపీవో వీరబుచ్చయ్య పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులకు, సిబ్బందికి సేగ్రిగేషన్ షెడ్, నిర్వహణ, వాటర్ సప్లైలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండాలని తగు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి అనిల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

నవతెలంగాణ-ఎలిగేడు

వేసవి దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలని ఎంపీడీవో భాస్కర్‌రావు గ్రామపంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా సుల్తాన్‌పూర్, నర్సాపూర్, నారాయణ పల్లి, ఎలిగేడు గ్రామాలలో జరుగుతున్న పనులను ఎంపీడీవో పరిశీలించారు. గ్రామాల్లో మురుగునీటి కాలువల్లో పూడిక తీసి, పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ఆరిఫ్, కార్యదర్శులు శివకుమార్ లలిత, అంజలి, పాపయ్య, ఆయా గ్రామ పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధుల పట్ల అవగాహన

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ



ఆరోగ్యశాఖ వారి ఆధ్వర్యంలో ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య ఆదేశాల మేరకు ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్జీ-2 ఏరియా సెక్టార్ 3 డిస్పెంసరిలో మంగళవారం ఆరోగ్య అధికారిణి పద్మ కిడ్నీ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శరీరంలో అన్ని అవయ వాల కన్నా కిడ్నీలు మూత్రపిండాలు అద్భుతమైనవని రక్తంలోని విష పదార్థాలను వ్యర్థ పదార్థాలను ఎక్కువగా ఉన్న నీటిని తొలగిస్తాయన్నారు. రక్తాన్ని ఫిల్టర్ చేయడమే కాక రక్తపోటును నియంత్రిస్తాయన్నారు. కిడ్నీలు సరిగ్గా పని చేయాలంటే నిత్యం వ్యాయామం, రక్తపోటు గ్లూకోజులు నిలు వలను స్థిరంగా ఉంచుకోవడం, ఉప్పు వినియోగం తగ్గిస్తూ పొగాకు ఉత్పత్తుల వాడకూడదని సూచించారు.ఈ ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరిం టెండెంట్ డాక్టర్ మహిపాల్, సానిటరి ఇన్స్పెక్టర్ రామకోటి పాల్గొన్నారు.

రూ.436 ప్రీమియంతో రూ.2 లక్షల బీమా

పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష

నవతెలంగాణ-పెద్దపల్లి

ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు ద్వారా రూ. 436 ప్రీమియంతో రూ.2 లక్షల బీమా లభిస్తుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పీఎంజేజేబీవై పథకం కింద లబ్దిదారుడి కుటుంబ సభ్యులకు రూ.2లక్షల చెక్కులు పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద 2 సంవత్సరాలలో పెద్దపెల్లి జిల్లా ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ బ్రాంచ్ ద్వారా 20 మందికి బీమా క్లెయిమ్ సెటిల్ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్

నవతెలంగాణ-ఓదెల



ఓదెల మండలం పొత్కపల్లి గ్రామంలోని వెలుగు జ్యోతి గ్రామ ఐక్య సంఘం ఐకేపీ సీసీ మారెళ్ళ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ.. మహిళలు చైతన్యంతో ముందుకు సాగి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. సమాజంలో మహిళలు ముఖ్యంగా అభివృద్ధి దిశలో సాగుతూనే సమాజం అభివృద్ధి చెందుతు ందన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలను బాగా చదివించాలని ,చిన్న స్థాయిలోనే చదువు మాన్పించి బాల్య వివాహాలు చేయవద్దన్నారు. అమ్మాయిలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైన తమకు సమాచారం అందిస్తే మీ వద్దకు వచ్చి సమస్య పరిష్కారానికి ముందుకు సాగుతామని ఎలాంటి సందర్భంలోనైనా తమకు నేరుగా ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం మహిళా దినోత్సవ శు భాకాంక్షలు తెలిపి స్థానిక మహిళా సంఘాల ప్రతినిధులను పోలీసులు మహిళా సిబ్బందిని సన్మానిం చారు.ఈ కార్య క్రమంలో వీవోఏ లావణ్య,స్థానిక పోలీస్ హెడ్ కానిస్టేబుల్ ప్రవళిక, కానిస్టేబుల్ ధనలక్ష్మి, పోలీసు సిబ్బంది రాజేందర్, రమేష్ మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన

వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ముత్తారం



మండలంలోని మచ్చుపేట గ్రామంలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. భూకబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలని ముత్తారం తహసీల్దార్‌కు మచ్చుపేట గ్రామస్తులు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామంలో సర్వే నెంబర్ 105లో ప్రభుత్వ భూమి 1.03ఎకరాల ఉందని, ఇందులో కొంత భాగం ప్రభుత్వ పాఠశాలకు కేటాయించడం జరిగిందని, మిగిలిన భూమిని పక్కనే ఉన్న సర్వే నంబర్ 106లో పట్టాదారులై ఉన్న కొంతమంది వ్యక్తులు ఆక్రమించి తన భూమిలో కలుపుకున్నారని, ఈ భూమిలో గ్రామంకు సంబంధించి ప్రభుత్వ భవనాలను నిర్మించనివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు.వెంటనే ఆక్రమించిన వారి నుంచి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని, అభివృద్ధి పనులకు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మేడగొని సతీష్, గోవిందుల పద్మ ఆనంద్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు తాళ్ళపెల్లి కుమార్ ఉన్నారు.

ఓసిపి స్టోర్స్‌ను తనిఖీ చేసిన జీఎం స్టోర్స్ కార్పొరేట్

నవతెలంగాణ-గోదావరిఖని:



సింగరేణి ఆర్జీ 1 ఏరియాలోని ఓసిపి 5 స్టోర్స్‌ను జిఎం స్టోర్స్ కార్పొరేట్ ఎలీషా మంగళవారం తనిఖీ చేశారు. స్టోర్స్‌లో ఉన్న ఇన్వెంటరీ తగ్గించాలని, నాన్ మూవింగ్ ఐటమ్స్ రిటర్న్ చేయాలని, లేకపోతే వేరే ఏరియాకు ప్రొవైడ్ చేయాలని సూచనలను చేశారు. అనంతరం ప్రాజెక్ట్‌ను వ్యూ పాయింట్ ద్వారా సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ డివి రావు, ఓసి3 స్టోర్స్ ఇన్‌ఛార్జి డేవిడ్, ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ రమేష్, ప్రాజెక్ట్ మెనేజర్ డి.రమేష్, సేఫ్టీ ఆఫీసర్ పి.శ్రీనివాస్, ఎస్ఈ శైలేందర్, డివై ఎస్‌సి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓసిపి 5ని సందర్శించిన జిఎం సేఫ్టీ కార్పొరేట్

నవతెలంగాణ-గోదావరిఖని:

సింగరేణి ఆర్జీ 1 పరిధిలోని ఓసిపి 5ని జిఎం సేఫ్టీ కార్పొరేట్ చింతల శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. ఓసిపి తనిఖీలో భాగంగా స్టాచుటరీ రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిఎం సేఫ్టీ ఆర్జీ గుప్తా, ఎస్ఓటూజిఎం గోపాల్ సింగ్, ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.చంద్రశేఖర్, ఎఎస్ఓ సాయి ప్రసాద్, ప్రాజెక్ట్ ఇంజనీర్ రమేష్, ప్రాజెక్ట్ మెనేజర్ డి.రమేష్, ఎస్ఓఎం అనిల్ గబాలే, సేఫ్టీ ఆఫీసర్ పి.శ్రీనివాస్ తదితరులున్నారు.

నిబంధనలు పాటించని వైన్ షాపులను రద్దు చేయాలి

నవతెలంగాణ-గోదావరిఖని



నిబంధనలు పాటించని వైన్ షాపులు, బెల్టు షాపులకు మద్యం సప్లై చేస్తున్నవైన్ షాపులు, గ్రామాలు పట్టణాలలో బెల్ట్ షాపులు నడుపుతున్న వారిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని రామగుండం ఎక్సైజ్ సిఐ మంగమ్మకు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర నాయకులు కోడిపుంజుల లక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు మార్త రాధ, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వైద్యాధికారిణి నిస్సి క్రిస్టినా

నవతెలంగాణ-ఎలిగేడు

గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండి వ్యాధుల నివారణ పట్ల అవగాహన పెంచుకోవాలని ఎలిగేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి నిస్సి క్రిస్టినా సూచించారు. మంగళవారం ధూళికట్టలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సంధ్బంగా ఆమె మాట్లాడుతూ క్షయ, హెచ్ఐవి వ్యాధుల లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయవద్దన్నారు. వెంటనే వైద్య పరీక్షలు చేయించుకొని చికిత్స పొంది ఆరోగ్యాన్ని కాపాడు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మ పానీ సొసైటీ లింక్ వర్కర్ కవ్వంపల్లి లక్ష్మణ్, నరేందర్, ఆశకార్యకర్తలు శారదా, స్వప్న పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా పోస్టర్ల ఆవిష్కరణ

- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం
- ఐసో టీమ్ ఇండియా, సేఫర్ ఇండియన్ రోడ్స్ సంస్థలచే పోస్టర్ల రూపకల్పన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కరీంనగర్ పోలీస్ కమిషనర్

నవతెలంగాణ - కరీంనగర్ :

కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మంగళవారం తనకార్యాలయంలో ఐసో టీమ్ ఇండియా, సేఫర్ ఇండియన్ రోడ్స్ సంస్థలు రూపొందించిన రోడ్డు భద్రతా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ సంస్థల సభ్యులను అభినందిస్తూ, సమాజాభివృద్ధికి తమ పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. రోడ్డు వినియోగదారులు చట్టానికి కట్టుబడి, తోటివారిని గౌరవించాలని సూచించారు. ఈ పోస్టర్లు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి, ప్రమాదాల నివారణకు తోడ్పడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాకుండా, సంస్థ త్వరలో రాష్ట్రంలో "రోడ్ సేఫ్టీ ఫోటో ఎగ్జిబిషన్-2025"ను నిర్వహించనున్నట్లు అధ్యక్షులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్ బలరాం, ఘన్షమ్ ఓర్ఝా, శనిగరం శ్రీనివాస్, అన్మోల్ ఓర్ఝా పాల్గొన్నారు.

26న సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ అర్ధవార్షిక మహాసభ



మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ లక్ష్మీనారాయణ

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :

సిరిసిల్ల పట్టణంలోని పద్మశాలి కళ్యాణ భవనంలో ఈ నెల 26న సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ అర్ధ వార్షిక మహాసభ నిర్వహిస్తున్నట్లు బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం బ్యాంక్ ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకులో 7200మంది సభ్యులకు గాను 4600 మంది సభ్యులు ఖాతాలు కలిగి ఉన్నారని, ఖాతాలు లేని సభ్యులు బ్యాంకులో సేవింగ్ ఖాతాను తీసుకొని డివిడెండ్‌ను ఖాతాలో జమ చేసుకోవాలని సూచించారు. సేవింగ్ ఖాతాలకు సంబంధించి (కేవైసీ) ఆధార్, పాన్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని తెలిపారు. టర్మ్ డిపాజిట్లపై స్థానికంగా ఉన్న ఇతర బ్యాంకుల కంటే అధిక వడ్డీ చెల్లిస్తున్నామని, ఈ అవకాశాన్ని సిరిసిల్ల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 26న నిర్వహించే అర్ధ వార్షిక మహాసభకు సభ్యులందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అర్బన్ బ్యాంకు ఉపాధ్యక్షులు అడ్డగట్ల మురళి, కార్యవర్గ సభ్యులు గుడ్ల సత్యానందం, చొప్పదండి ప్రమోద్, పాటి కుమార్ రాజు, బుర్ర రాజు, వేముల సుక్కమ్మ, అడ్డగట్ల దేవదాస్, ఏనాగందుల శంకర్, వలుస హరిణి, పత్తిపాక సురేష్, కొడం సంజీవ్, బ్యాంకు సీఈఓ పాల్గొన్నారు.

వరి పంటలో తెగుళ్ల నివారణకు సూచనలు



రైతుల పంట పొలాలను సందర్శించిన శాస్త్రవేత్తలు

నవతెలంగాణ - వీర్నపల్లి :

వీర్నపల్లి మండలంలోని గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పంట పొలాలను మంగళవారం జిల్లా ఏరువాక కేంద్రం కరీంనగర్ కోఆర్డినేటర్ మదన్ మోహన్ రెడ్డి, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ శాస్త్రవేత్తలు పరిశీలించారు. యాసంగి వరిలో కాండం తొలిచే పురుగుతో పాటు అగ్గి తెగులు లక్షణాలు ఉన్నట్లు తెలిపారు. వరి పంటలో ఆశించే కాండం తొలిచే పురుగు నివారణకు 60 మి.లీ. క్లోరాంట్రానిలిప్రోల్ మందును లేదా 400 గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును లేదా 120 మి.లీ. ఐసోసైక్లోసీరమ్ మందును ఎకరా పొలానికి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే అగ్గి తెగులు సోకిన పంట పొలాల్లో తాత్కాలికంగా యూరియా వేయడం ఆపివేయాలని, ఈ తెగులు నివారణకు ఐసోప్రోథయోలిన్ 300 మి.లీ. మందును ఎకరాకు పిచికారీ చేయాలని తెలిపారు. అగ్గి తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే టేబుకోనజోల్ ట్రైఫ్లాక్సిస్ట్రోబిన్ 0.4 గ్రాముల లేదా పికాక్సీ స్ట్రోబిన్ ట్రై సైక్లోజల్ 400 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. గింజ మచ్చ తెగులు గమనించినట్లయితే ప్రోపికొనజోల్ 200 మి.లీ. మందును ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి జయ, వ్యవసాయ విస్తరణ అధికారిణి దీపిక, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరిస్తాం

తహసీల్దార్ ముద్దసాని రమేష్



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న తహసీల్దారు రమేష్

నవతెలంగాణ - చిగురుమామిడి :

రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు మండల అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా సుందరగిరి గ్రామంలో గత రెండు సంవత్సరాలుగా పనిచేయకుండా ఉన్న రక్షిత మంచినీటి బావి మోటారు మరమ్మతులు పూర్తి చేశారు. తహసీల్దారు, గ్రామ స్పెషల్ ఆఫీసర్ ముద్దసాని రమేష్ ఆదేశాలతో గ్రామ పంచాయతీ కార్యదర్శి గోదారి అజయ్ కుమార్ తక్షణమే చర్యలు చేపట్టి, చెడిపోయిన మోటారును రిపేర్ చేయించి గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని అందించారు. అంతేగాక, గత వారం రోజులుగా గ్రామంలో ఉన్న మిషన్ భగీరథ గేట్ వాల్వ్ లీకేజీల సమస్యను గుర్తించి మరమ్మతులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి నీటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు. గ్రామంలోని గేట్ వాల్వ్ మరమ్మత్తులు, నీటి సమస్య పరిష్కారమవడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ, సమస్యను వెంటనే పరిష్కరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

నిధులు కేంద్రానివి.. ప్రచారం రాష్ట్రానిదా..?

బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి ఫైర్

నవతెలంగాణ - వీణవంక :

గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీ పథకం(ఈజీఎస్) పనులకు రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుంటోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం వీణవంక మండలంలో ఈజీఎస్ పనులను పరిశీలించిన ఆయన, కేంద్ర నిధులతో జరుగుతున్న అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వంగా ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. స్థానిక ఎన్నికల కోసం కాంగ్రెస్ ప్రజలను మభ్యపెడుతోందని, గ్రామ పంచాయతీలను ఉత్సవ విగ్రహాలుగా మార్చిందని కృష్ణారెడ్డి దుయ్యబట్టారు. ప్రస్తుతం తెలంగాణలో గ్రామ పాలన అస్తవ్యస్తంగా ఉందని, కేంద్రం నిధులే గ్రామాలకు దిక్కని ఆయన అన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు వంటి పనులన్నీ కేంద్ర నిధులతోనే జరుగుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రజలను మోసం చేస్తోందని ఆయన విమర్శించారు. ఈ డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని కృష్ణారెడ్డి హెచ్చరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బత్తిని నరేష్ గౌడ్, జిల్లా కార్యదర్శి సిహెచ్. నరసింహ రాజు, ఇతర బీజేపీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామంలో మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పట్టణ సీఐ వరగంటి రవి ఒక ప్రకటనలో తెలిపారు. విలాసాగర్ గ్రామానికి చెందిన మండల ప్రశాంత్, కొదారి ప్రశాంత్ అక్రమంగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తూ ఉండగా, వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సమ సమాజ నిర్మాణంలో విద్యే కీలక పాత్ర

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

నవతెలంగాణ - గంగాధర :

సమ సమాజ నిర్మాణంలో విద్యే కీలకమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్న సందర్భంగా గంగాధర మైనార్టీ బాలికల పాఠశాలలో మంగళవారం రాత్రి కృతజ్ఞత సభను నిర్వహించగా, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, అధికారులు విద్యార్థులకు ఇంటర్నేషనల్ స్థాయి విద్యను అందించడానికి ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ప్రభుత్వం ప్రారంభిస్తుందన్నారు. ప్రపంచాన్ని మార్చగల శక్తి విద్యకు మాత్రమే ఉందని, సామాన్యుడిని సమాజంలో గొప్ప వ్యక్తిగా ఎదగడానికి తోడ్పాటును అందించేది విద్య ఒక్కటేనని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థులందరికీ ప్రపంచ స్థాయి విద్యను అందించాలన్న సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేస్తోందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో రూ.200కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కాన్సెప్ట్‌ను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. గత పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని, మాటలు చెప్పడమే తప్ప ఆచరణలో విఫలమైందని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, స్వామి వివేకానంద, ఏపీజే అబ్దుల్ కలాం వంటి గొప్ప వ్యక్తులు నిరుపేద కుటుంబంలో పుట్టి సమాజంలో గొప్ప వ్యక్తులుగా ఎదిగారన్నారు. విద్యార్థులు గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని గొప్ప వ్యక్తులుగా ఎదగాలని సూచించారు. సత్య నాదెళ్ల, సుందర్ పిచాయ్ వంటి వారు చదువుతోనే సమాజంలో గొప్ప వ్యక్తులుగా ఎదిగారని అన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు రూ. 200 కోట్ల నిధులు మంజూరు చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లకు చొప్పదండి నియోజకవర్గం ప్రజల పక్షాన కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రీజినల్ లెవెల్ కోఆర్డినేటర్ సురేష్, మైనార్టీ గురుకుల ప్రిన్సిపల్ వారుణి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

పన్నుల బకాయిలు చెల్లించని వారిపై చర్యలు

డిప్యూటీ కమిషనర్ స్వరూప రాణీ

నవతెలంగాణ - కరీంనగర్ :

నగరపాలక సంస్థ పరిధిలోని ప్రాపర్టీ టాక్స్, ట్రేడ్ లైసెన్స్, నల్లా పన్నులను సకాలంలో చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపై ఉందని డిప్యూటీ కమిషనర్ స్వరూప రాణీ అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగుస్తున్న నేపథ్యంలో, బకాయిలు ఉన్న ప్రతి యజమాని, వ్యాపార వర్గాలు తమకు సంబంధించిన పన్నులను వెంటనే చెల్లించాలని ఆమె సూచించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నగరపాలక సంస్థ కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు దుగ్గు మహేందర్ రాకేష్ నుంచి ప్రాపర్టీ టాక్స్ స్వీకరించిన అనంతరం స్వరూప రాణీ మాట్లాడారు. నగరంలోని ప్రతి కాంట్రాక్టర్ తమ ఇంటి పన్ను, నల్లా పన్నులను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్ల సంఘాన్ని కోరారు. పన్నులు చెల్లించని వారు వెంటనే తమ బకాయిలను పూర్తిగా చెల్లించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిఫాల్టర్ల జాబితాను ప్రజా ప్రదేశాల్లో ప్రదర్శించడంతో పాటు, ఆర్ఆర్ యాక్ట్‌ను అమలు చేసి అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నగరంలోని వ్యాపారస్తులు కూడా తమ ఇంటి పన్నులతో పాటు ట్రేడ్ లైసెన్స్ పన్నులను కూడా సకాలంలో చెల్లించాలని డిప్యూటీ కమిషనర్ సూచించారు. పాత లైసెన్స్ కలిగిన వారు మార్చి 15లోగా పన్నులు చెల్లించి లైసెన్స్‌ను రీన్యూవ్ చేసుకోవాలని, కొత్తగా వ్యాపారం ప్రారంభించేవారు వెంటనే దరఖాస్తు చేసుకొని లైసెన్స్ పొందాలని పేర్కొన్నారు. హెూటళ్లు, హాస్పిటల్స్, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాల్స్, ఇతర ప్రైవేట్ సంస్థలు, ప్రభుత్వ శాఖల ప్రాపర్టీలు కూడా తమ బకాయిలను తక్షణమే చెల్లించి, నగరపాలక సంస్థ అభివద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. నివాసితులు, వ్యాపారస్తులు తమ పన్నులను నగరపాలక సంస్థ కౌంటర్లలో నేరుగా చెల్లించగలరు. అలాగే వార్డు అధికారుల ద్వారా లేదా ఆన్‌లైన్‌లో కూడా చెల్లించడానికి అవకాశం ఉందని తెలిపారు. పన్నులు ఎప్పటికప్పుడు చెల్లిస్తే, భారం తగ్గుతుందని. నగర అభివద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పోడు భూముల సమస్యలు పరిష్కరించండి

సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యురాలు జవ్వాజీ విమల

నవతెలంగాణ - కొనరావుపేట :

పోడు భూముల సమస్యలు పరిష్కరించాలని, అటవీశాఖ అధికారులు దాడులు చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా సీపీఐ(ఎం) కార్యవర్గ సభ్యురాలు జవ్వాజీ విమల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం విమల మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా మరిమడ్ల గ్రామంలో పేద ప్రజలు వ్యవసాయం, కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారని, వారిపై అటవీశాఖ అధికారులు దాడులు చేయడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని భావించామని, కానీ అధికారులు అణగదొక్కుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి గత ఎన్నో సంవత్సరాల నుండి సేద్యం చేస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి వారి జీవనం సాఫీగా జరిగేటట్లు చూడాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు, పోడు బాధితులు, ప్రజలు పాల్గొన్నారు.



పోడుభూమి బాధితులతో మాట్లాడుతున్న జిల్లా నాయకురాలు

రాష్ట్రస్థాయి హాకీ క్రీడలను సమర్థవంతంగా నిర్వహించాలి

సర్దార్ సురేందర్ సింగ్

నవతెలంగాణ - హుజురాబాద్ : ఈ నెల 16 నుంచి హుజురాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ హాకీ క్రీడోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించాలని హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సర్దార్ సురేందర్ సింగ్ అన్నారు. మంగళవారం హుజురాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి హాకీ క్రీడల ఏర్పాట్లను ఆయన సందర్శించి పరిశీలించారు. హాకీ క్రీడోత్సవాల సందర్భంగా క్రీడాకారుల కోసం చేస్తున్న ఏర్పాట్లను ఆయన హాకీ క్లబ్ నాయకులను అడిగి తెలుసుకున్నారు. హుజురాబాద్ ప్రాంతంలోని క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో హాకీ ఆడి అనేక పథకాలు సాధించారని అన్నారు. హుజురాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో క్రీడాకారులు మంచి ప్రతిభను చూపి జిల్లాకు పేరు తేవాలని ఆయన అన్నారు. హుజురాబాద్ హాకీ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 16, 17, 18 తేదీల్లో జరిగే ఈ పోటీలకు క్రీడాకారులకు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాకీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్, హాకీ క్లబ్ ఉపాధ్యక్షుడు భూసారపు శంకర్, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



హుజురాబాద్‌లో హాకీ క్రీడోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

కేటీఆర్‌ను విమర్శిస్తే ఊరుకునేదిలేదు



మాట్లాడుతున్న రవిగౌడ్

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ను విమర్శిస్తే ఊరుకోబోమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ టీడీపీ నేత బుద్ధా వెంకన్న కేటీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఐటీ రంగంలో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత కేటీఆర్‌దేనని కొనియాడారు. కేటీఆర్‌ను విమర్శించే స్థాయి ఎవరికీ లేదన్నారు. రాజకీయం చేయాలనుకుంటే ఆంధ్రప్రదేశ్‌లో చేసుకోవాలని సూచించారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా తిరగనివ్వమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మట్టే శ్రీనివాస్, కొడం వెంకటేష్, నవీన్, రుద్రవీణ సుజిత్, గాజుల మహేష్, సాయి, కాసర్ల వినయ్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ - వీణవంక :

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై తోట తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం, వీణవంక పోలీసులు ఎల్లమ్మ గుడి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సుల్తానాబాద్ మండలం గట్టెపెల్లి గ్రామానికి చెందిన మానుపటి జయశంకర్ తండ్రి రాయమల్లు 10క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వం మెస్ ఛార్జీలు పెంచడం వల్లే పౌష్టికాహారం

కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో సహపంక్తి భోజనం చేస్తున్న సుడా చైర్మన్

నవతెలంగాణ - కరీంనగర్ :

నగరంలోని మహాత్మా జ్యోతిబాపూలే బలహీన వర్గాల సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థినులతో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి సహపంక్తి భోజనం చేశారు. ముందుగా వంటశాలలోని సరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మెస్ చార్జీలు పెంచడం వల్ల పౌష్టికాహారం అందించగలుగుతున్నామన్నారు. గతంలో ఇటువంటి పరిస్థితి ఉండేది కాదని పేర్కొన్నారు. భోజనం చేస్తూ విద్యార్థినులతో మెనూ పాటిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ నాణ్యత విషయంలో రాజీ పడొద్దని, కాంట్రాక్టర్ సరఫరా చేసే సరుకులు నాణ్యతతో ఉండేలా నిరంతర పర్యవేక్షణ చేయాలని నరేందర్ రెడ్డి సూచించారు. చిన్న చిన్న లోపాలు గుర్తించామని, వాటన్నిటినీ సరిచేసుకోవాలని, ప్రభుత్వం నిర్ణయించిన మెనూను నాణ్యతతో అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మెండి చంద్రశేఖర్, మిరాజ్, జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, కుర్ర పోచయ్య, పెద్ది తిరుపతి, కొట్టె ప్రభాకర్, కీర్తి కుమార్, అష్రఫ్ ఖురేషి, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

మానకొండూరు మార్కెట్ కమిటీ స్టడీ టూర్



నూజివీడు, గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ల సందర్శన

నవతెలంగాణ - మానకొండూర్ :

వ్యవసాయ మార్కెట్ కమిటీ స్టడీ టూర్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నూజివీడు, గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీలను కరీంనగర్ జిల్లా మానకొండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి తమ బృందంతో కలిసి సందర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీల పనితీరు, కార్యకలాపాలు, వసతులు, సౌకర్యాలు, మార్కెటింగ్ వంటి పలు అంశాలను అధ్యయనం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఎల్లుగొండ రాజు, బందెల మహేందర్, టేకుమల్ల అంజయ్య, మండల మహిపాల్ రెడ్డి, చలిగంటి ఓదెలు, రావుల రవి, మాతంగి సహదేవ్ పాల్గొన్నారు.

మహిళా సంఘానికి వాటర్ ఫ్రిడ్జ



నవతెలంగాణ - గన్నేరువరం : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనర సింహస్వామి మండల మహిళా సమైక్య సెర్ప్ కార్యాలయానికి వాటర్ ఫ్రిడ్జ్‌ను కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్ మంగళవారం బహుమతిగా అందజేశారు. వేసవిలో వివిధ గ్రామాల మహిళా సంఘాల సభ్యుల దాహార్తిని తీర్చడం కోసం తన వంతు కృషి చేశానని సునీల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్ రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాపోలు నవీన్, ఐకేపీ ఏపీఎం లావణ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు బద్దం కవిత పాల్గొన్నారు. మహిళా సంఘాల సభ్యులు బొడ్డు సునీల్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులకు పరీక్షా ప్యాడ్ల పంపిణీ



నవతెలంగాణ - గంభీరావుపేట :

గంభీరావుపేట మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 518 మంది విద్యార్థులకు సిరిసిల్ల శాసనసభ్యులు కేటీఆర్ సహకారంతో గిఫ్ట్ ఏ స్మైల్ ద్వారా పరీక్ష ప్యాడ్లు, పెన్నులను స్థానిక నాయకులు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు సెస్ డైరెక్టర్ గౌరీనేని నారాయణ రావు, మండలాధ్యక్షులు పాపగారి వెంకటస్వామి గౌడ్, బీఆర్ఎస్ నేతలు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గానికి నియామక పత్రాలు అందజేత



గర్జనపల్లి జాతీయ బీసీ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ - వీర్నపల్లి :

వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలో జాతీయ బీసీ సంఘం మండల అధ్యక్షుడు మల్లేశం ఆధ్వర్యంలో గర్జనపల్లి బీసీ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పెంట మల్లేశం, ఉపాధ్యక్షులుగా చిరంజీవి, దండు మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా గుమ్మడి రాజు, కార్యదర్శిగా దుంపటి భాస్కర్, సలహాదారులుగా శనిగరం మల్లేశం, దసరా సత్తయ్య కార్యవర్గ సభ్యులుగా గుమ్మడి భాస్కర్, చీకోటి బాలకిషన్, అబ్బనవేని సంతోష్, సలహాదారుడిగా దేశరాజు సత్తయ్య, కార్యవర్గ సభ్యులుగా శనగరం భాస్కర్, పెంట దేవరాజు, కోడిమేల రజనీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆరోపణలు నిరూపించాలి



నవతెలంగాణ - మానకొండూర్ :

మాజీ ఎమ్మెల్యే రసమయిపై చేసిన ఆరోపణలు నిరూపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్ గౌడ్ కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శేఖర్ గౌడ్ మాట్లాడారు. బీఆర్ఎస్‌కు చెందిన సొసైటీ చైర్మన్లు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కలవలేదన్న అక్కసుతో రాజకీయ కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారని ఆరోపించారు. సమాధానం చెప్పాల్సిన ఎమ్మెల్యే కవ్వంపల్లి కింది స్థాయి నాయకులతో ప్రెస్ మీట్‌లో మాట్లాడించారన్నారు.

గడువులోగా ఎల్ఆర్ఎస్ చెల్లిస్తే రాయితీ



నవతెలంగాణ - హుజురాబాద్ :

హుజురాబాద్ మున్సి పల్ పరిధిలోని ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఈ నెల 31 లోగా ఎల్ఆర్ఎస్ రుసు మును చెల్లిస్తే ప్రభుత్వం ఇచ్చే రాయితీ వర్తిస్తుందని హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ కె. సమ్మయ్య అన్నారు. మంగళవారం హుజురాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ పై అధికారులతో, లేఅవుట్ ప్లానర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఈ నెల 31లోగా ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించాలని అన్నారు. గడువులోగా చెల్లించిన వారికి ప్రభుత్వ రాయితీ వర్తిస్తుందని, ఒకవేళ రుసుము చెల్లించిన వారి దరఖాస్తు తిరస్కరణకు గురైతే చెల్లించిన డబ్బుల్లో 10శాతం డబ్బులు తగ్గించి మిగతా డబ్బులు కట్టినవారి ఖాతాలోకి పంపించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ భూపాల్ రెడ్డి, టీపీఓ అశ్విని గాంధీ, ప్లానర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు పెంపు

నవతెలంగాణ - శంకరపట్నం :

తెలంగాణ మోడల్ స్కూల్ 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో 100 సీట్లు, 7 నుండి 10వ తరగతిలో మిగిలిన సీట్ల ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు తేదీని మార్చి 20 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ సరిత తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, 2025-26 విద్యా సంవత్సరానికి తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్ శంకరపట్నం మండలంలోని విద్యార్థులకు 6వ తరగతిలో 100 సీట్లు మరియు 7 నుండి 10వ తరగతిలో భర్తీ కాని సీట్ల కోసం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని, అర్హత గల విద్యార్థులు మార్చి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్ష ఏప్రిల్ 20న ఉంటుందని తెలిపారు. ఓసీ విద్యార్థులకు రూ. 200, బీసీ, ఎస్సీ, ఎస్టీ మరియు పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ. 125 దగ్గరలోని ఆన్‌లైన్ సెంటర్‌లో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ తెలిపారు.

పేదల భూముల్ని కార్పొరేట్లకు అప్పగించే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

భూములను నిషేధిత జాబితాలో పెట్టడమే చట్టవిరుద్ధమని, ఆ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి రైతుభరోసా, రుణాలు, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని కోరారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని కుర్మిద్ద గ్రామంలో యాచారం, కందుకూరు మండలాలకు చెందిన ఫార్మాసిటీ బాధిత రైతులతో జాన్‌వెస్లీ ముచ్చటించారు. ఈ సందర్భంగా రైతులు తమ బాధలను ఆయన ముందు ఏకరువు పెట్టారు. అనంతరం రైతులనుద్దేశించి జాన్‌వెస్లీ మాట్లాడారు.

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీ పేరుతో రైతుల భూములను లాక్కొని వారికి తక్కువ పరిహారం చెల్లించి మోసం చేసిందన్నారు. ఫార్మాసిటీని రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. రైతులకిచ్చిన హామీని విస్మరించిందన్నారు. ఫోర్త్ సిటీ పేరుతో వేలకోట్లు ఉన్న బడాబాబులు ఇక్కడికి వ్యాపారం చేయడానికి వస్తే, ఈ ప్రాంతంలో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, పేదలు ఎలా బతకాలని ప్రశ్నించారు. భూములను గుంజుకొని అదే భూమిలో రైతులను కూలీలుగా మార్చే కుట్ర చేస్తోందన్నారు. ప్రతి రైతు కుటుంబానికీ 500 గజాల నుంచి 800 గజాల ప్లాట్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2013 భూ చట్టాన్ని అమలు చేసి రైతులందరికీ న్యాయం చేయాలని కోరారు. వ్యవసాయంతో పచ్చని పొలాలుగా వర్ధిల్లుతున్న ఈ ప్రాంతాన్ని విషతుల్యంతో నింపేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. రంగారెడ్డి జిల్లాలోని 7 మండలాలు, 70 గ్రామాల్లో లక్షకుపైగా ఎకరాల భూసేకరణ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుం దని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి రైతుల పక్షాన నిలబడాలని డిమాండ్ చేశారు.

20, 21 తేదీల్లో ఫార్మా గ్రామాల్లో సీపీఐ(ఎం) జీపు జాతా

ఫార్మాసిటీ బాధిత రైతుల సమస్యలపై ఈ నెల 20, 21వ తేదీల్లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జీపు జాతా నిర్వహిస్తామని జాన్‌వెస్లీ తెలిపారు. ఈ జాతా ద్వారా కళాకారులతో రైతులను చైతన్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామన్నారు. రైతుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తామని, కలెక్టర్ స్పందించి రైతులతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. లేదంటే 21వ తేదీన రైతులతో పాదయాత్రగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతులకు సీపీఐ(ఎం) అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుబ్బాక రామ్‌చందర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి, పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ, జిల్లా కమిటీ సభ్యులు పి.అంజయ్య, పార్టీ మండల కార్యవర్గ సభ్యులు పి.బ్రహ్మయ్య, ఆలంపల్లి జంగయ్య, ఐలు జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్ కుమార్, బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్‌లోకి అడుగుపెట్టగా కిందపడి పోలీస్ బెటాలియన్ కమాండెంట్ మృతి

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఘటన
- తెలంగాణ సచివాలయంలో సీఎస్‌ఓగా పని చేసిన గంగారాం



నవతెలంగాణ - సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ తోట గంగారాం(58) ప్రమాదవశాత్తు లిఫ్టులో మృతి చెందారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం సిద్దులం గ్రామానికి చెందిన గంగారాం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. సోమవారం రాత్రి పట్టణంలోని ఓ అపార్టుమెంట్‌లో లిఫ్ట్ వచ్చిందనుకుని డోర్ ఓపెన్ చేసి లోపలికి అడుగుపెట్టడంతో మూడో ఫ్లోర్ నుంచి ఒకటో ఫ్లోర్‌లో ఉన్న లిఫ్ట్‌పై ఆయన పడిపోయారు. వెంటనే ఆస్పత్రికి తరలించినా.. అప్పటికే గంగారాం మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. గంగారాంకు భార్య, కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గంగారాం కమాండెంట్‌గా 17వ పోలీస్ బెటాలియన్‌కు రాకముందు తెలంగాణ సచివాలయంలో సీఎస్‌ఓగా పని చేశారు. ఆయన మృతితో బెటాలియన్‌తోపాటు పోలీస్‌శాఖలో విషాదం నెలకొంది. కమాండెంట్ గంగారాం భౌతిక కాయానికి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖరరెడ్డి, 1వ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ, 3వ బెటాలియన్ కామండెంట్ జమీల్ ఫాష, 17వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావు, రాందాస్, బెటాలియన్ అధికారులు, సిబ్బంది గంగారం మృతదేహానికి నివాళులు అర్పించారు.

కేటీఆర్ సంతాపం..

సిరిసిల్ల బెటాలియన్ కమాండెంట్ తోట గంగారాం మృతి పట్ల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. పోలీసుశాఖకు ఉన్నతంగా సేవలందిస్తున్న గంగారాం ప్రమాదవశాత్తు లిఫ్టు ప్రమాదంలో మరణించడం బాధాకరమన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అన్నదాత అరిగోస !

- కుంటల్లో, చెరువుల్లో నీరు లేక రైతుల తంటాలు
- పంటచేలను మూగజీవాలకు వదిలేస్తున్న వైనం
- ప్రభుత్వం, ఎమ్మెల్యే, అధికారులు ఆదుకోవాలని వేడుకోలు

ఎండుతున్న పంటలు, ఆందోళనలో రైతులు





నవతెలంగాణ - స్టేషన్ ఘనపూర్

మండుతున్న ఎండలకు మార్చి నెలలోనే భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. కుంటలు, చెరువుల్లో నీళ్ల లేవు. తలాపునే రిజర్వాయర్ ఉన్నా.. సాగునీరు రాక కండ్ల ముందే పంటలు ఎండిపోతుంటే అన్నదాత తల్లడిల్లుతున్నాడు. దేవాదుల ద్వారా పాలకులు సాగునీరు అందించినట్లయితే పంటలు పండుతాయని, లేదంటే పెట్టిన పెట్టుబడి నష్టపోయి, అప్పులపాలయ్యే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని ఇప్పగూడెం, రంగరాయి గూడెం, సముద్రాల, పాలకుర్తి మండలం గూడూరు పరిధిలో చెరువులు, కుంటలు అడుగంటిపోయాయి. బోర్లలో, వ్యవసాయ బావుల్లో నీళ్ల లేక పంట చేలు ఎండిపోతున్నాయి. స్టేషన్ ఘన్‌పూర్-నవాబ్‌పేట ఆర్‌ఎస్ ప్రధాన కాలువ ద్వారా నీరు తలాపునుంచే తరలుతున్నా, అనుసంధానంగా ఉన్న 3ఎల్ కెనాల్‌లో నీరు రావడం లేదని రైతులు చెబుతున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు ప్రధాన కాలువ అనుసంధానంగా ఉన్న సబ్ కాలువలకు నీటిని విడుదల చేయడంతో సాగునీటిపై ఆధారపడిన రైతులు సుమారు 1000 ఎకరాలకు వరి, మొక్కజొన్న సాగు చేశారు. నీటిని వినియోగించుకుంటూ పంటచేలను తడుపుకుంటున్నారు. 3ఎల్ కాలవకు రావాల్సిన నీరు.. సుమారు నెల రోజులకుపైగా రాకపోవడంతో దిక్కుతోచని పరిస్థితి దాపురించిందని రైతులు వాపోతున్నారు. కెనాల్ వెంట సాగు చేసిన పంటచేలు ఎండిపోతుండటంతో లక్షల్లో అప్పు తెచ్చి పంటసాగు చేసిన తమ పరిస్థితి ఏంటని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. 3ఎల్ కాలువ ద్వారా సాగునీరు వచ్చినట్లయితే తద్వారా దిగువనున్న పెద్దకుంట, బండకుంట, సత్రోని కుంట, రాయికుంట, బ్రాహ్మణ కుంట, తీగల చెరువు, గూడూరు చెరువు, మరో ఇతర రెండు కుంటల్లో సాగునీరు నింపితే వందలాది రైతుల సమస్య తీరుతుందని అంటున్నారు.

మొక్కజొన్న రైతుకూ అడియాశలే...

నెల క్రితం 15 రోజులపాటు కెనాల్ ద్వారా నీరు రావడంతో అప్పటికే ఉన్న పనికిరాని పత్తి చేలను చెడగొట్టి మొక్కజొన్న సాగుచేసిన రైతులకు అడియాశలే మిగిలాయి. అనంతరం నెలకు పైగా 3ఎల్ కెనాల్ ద్వారా నీళ్ల రాకపోవడంతో రైతులు ఆవేదన వెలిబుచ్చారు. ఈ సారైనా మొక్కజొన్న పండిస్తే రైతు దిగుబడి బాగా వస్తుందని అనుకునే లోపు, నీరు సరిగ్గా అందక మొక్కజొన్న పంట వాడిపోతున్నదని పోతున్నారు. ప్రస్తుతం సాగునీరు అందకపోవడంతో ఎండిన పంటచేలు మూగజీవాల మేతకు వదిలేస్తున్నారు. కానీ, ప్రభుత్వం చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలుకాని పరిస్థితి నెలకొంది. మరో నెలైతే పంట చేతికి వచ్చే కాలం. పొట్టదశకు వచ్చిన మొక్కజొన్న, వరిని కాపాడుకోలేక దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించి సాగునీరు అందించి తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగానే రైతులు లక్షలాది రూపాయలు నష్టపోయారు. దేవాదులతో ఎనిమిది రిజర్వాయర్లలో నీళ్ల నింపితే, జిల్లాలో 769 పైగా చెరువులు, కుంటల్లో నీళ్ల నిలచి ఉండేవి. భూగర్భజలాలు పుష్కలంగా ఉండేవి. ప్రస్తుతం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. రైతులకు ఆదాయమేమో కానీ, అప్పుల పాలయ్యే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం వరిపంట నష్టాన్ని సర్వే చేసి జరిగిన నష్టం తేల్చాలి. దేవాదులతో 8 రిజర్వాయర్లకు నీళ్ల వదిలితే కనీసం ఈకాస్త పంటైనా చేతికొస్తుంది. నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ.50 వేలు నష్ట పరిహారం చెల్లించాలి.

- రాపర్తి రాజు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు


స్థానిక ఎమ్మెల్యే స్పందించి సమస్య తీర్చాలి



13 ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంట సాగు చేశాను. మొదట కాలువలో సాగునీరు ఆశలు చిగురించాయి. ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకుని చేస్తున్నాను. ఏప్రిల్ వరకు రావాల్సిన 3ఎల్ కెనాల్ నీరు పూర్తిగా బందయ్యాయి. ఉన్న రెండు బోర్లలో, బావిలో భూగర్భ జలాలు అడుగంటి చుక్కనీరు లేదు. మాపై దయుంచి స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించి 3ఎల్, 4ఎల్ కెనాల్‌లో సాగునీరు అందించి మిగిలిన పంటనైనా కాపాడుకునే విధంగా సహకరించాలని కోరుతున్నాం.

-తాటికొండ బాబు, ఇప్పగూడెం, రైతు

అప్పుల పాలయ్యే పరిస్థితి వచ్చింది



రెండు ఎకరాల్లో వరిపంట సాగు చేశాను. సాగునీరు అందక వరి పూర్తిగా ఎండిపోతుంది. అప్పులు తెచ్చి పంట వేశాను. ఆదాయమేమో కానీ, అప్పుల పాలయ్యే పరిస్థితి వచ్చింది. వరిపంట నష్టాన్ని సర్వే చేసి, ఎకరాకు నష్టపరిహారం చెల్లించాలని వేడుకుంటున్నా..

- లెంకలపల్లి క్రిష్ణమూర్తి, రైతు

గ్రూప్-2 టాపర్ ఎన్‌వి హరవర్ధన్

టీజీపీఎస్సీ చైర్మెన్ బుర్రా వెంకటేశం వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-2 రాతపరీక్షలకు సంబంధించిన జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్‌ఎల్)ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) మంగళవారం విడుదల చేసింది. గ్రూప్-2లో 447.088 మార్కులతో నారు వెంకట హరవర్ధన్ అగ్రస్థానంలో నిలిచారు. 444.754 మార్కులతో వడ్లకొండ సచిన్ రెండోస్థానంలో ఉన్నారు. 439.344 మార్కులను సాధించి బి మనోహర్‌రావు మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. మహిళల్లో 408.713 మార్కులను సాధించి ప్రథమ స్థానంలో ఉన్నారు. తొలి 500 ర్యాంకుల్లో మహిళలు 48 మంది ఉన్నారు. కొన్ని కేటగిరీల్లో 360, 370 ఆపైన మార్కులు వచ్చిన అభ్యర్థులు ఆయా రిజర్వేషన్, జోన్లలో ఉద్యోగాలు పొందే అవకాశమున్నది. మంగళవారం టీజీపీఎస్సీ పాలకమండలి సమావేశాన్ని చైర్మెన్ బుర్రా వెంకటేశం అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-2 పోస్టులకు 5,51,855 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. వారి కోసం గతేడాది డిసెంబర్ 15, 16 తేదీల్లో 33 జిల్లాల్లో రాతపరీక్షలను నిర్వహించామని తెలిపారు. వారిలో 2,49,964 మంది అభ్యర్థులు అన్ని పేపర్లకూ హాజరయ్యారని పేర్కొన్నారు. వారిలో 2,36,649 మంది అభ్యర్థులు జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్‌ఎల్)కు అర్హత సాధించారని వివరించారు. అభ్యర్థుల ఓఎంఆర్ పత్రాలను సంబంధిత అభ్యర్థుల లాగిన్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. రాష్ట్రంలో 13,315 మంది అభ్యర్థుల ఓఎంఆర్ పత్రాలు చెల్లనివిగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీజీపీఎస్సీ సభ్యులు అమీర్ ఉల్లాఖాన్, నర్రి యాదయ్య, యరబాది రామ్మోహన్‌రావు, పాల్వాయి రజినికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకే ఉద్యోగాలు

గ్రూప్-2 జీఆర్‌ఎల్‌లో ఎక్కువ మంది ప్రస్తుత ఉద్యోగులే ఉన్నట్టు తెలిసింది. సోమవారం గ్రూప్-1 ఫలితాల్లో, మంగళవారం గ్రూప్-2 జీఆర్‌ఎల్‌లో ఎక్కువ మంది ప్రస్తుతం ఉపాధ్యాయులు, పోలీసులు, గ్రూప్-4 ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, సింగరేణి, గురుకుల ఉద్యోగాలు చేస్తున్న ఉపాధ్యాయులే ఉన్నారు. వారే ఎక్కువ మార్కులను సాధించారు. ఇంకోవైపు సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు కూడా ఎక్కువ మార్కులను సాధించి గ్రూప్-1, గ్రూప్-2కు ఎంపికైన వారిలో ఉన్నట్టు సమాచారం.

గ్రూప్-2 టాపర్లు

ర్యాంకు	మార్కులు	అభ్యర్థి పేరు	కమ్యూనిటీ	మల్టీజోన్
1	447.088	నారు వెంకట హరవర్ధన్	ఓసీ	1
2	444.754	వడ్లకొండ సచిన్	ఓసీ	1
3	439.344	బి మనోహర్‌రావు	బీసీ-డీ	2
4	438.972	శ్రీరాం మధు	బీసీ-బీ	2
5	431.102	చింతపల్లి ప్రీతంరెడ్డి	ఓసీ	1
6	430.807	అఖిల్ ఎర్రా	ఓసీ	2
7	425.842	గొడ్డేటి అశోక్	బీసీ-బీ	1
8	423.933	చిమ్ముల రాజశేఖర్	ఓసీ	2
9	423.119	మేకల ఉపేందర్	బీసీ-డీ	1
10	422.989	కరింగు నరేష్	బీసీ-బీ	2

గ్రూప్-2 మహిళా టాపర్లు

ర్యాంకు	మార్కులు	అభ్యర్థి పేరు	కమ్యూనిటీ	మల్టీజోన్
32	408.713	లక్కిరెడ్డి వినీషారెడ్డి	ఓసీ	2
41	406.499	బైకది సుస్మిత	బీసీ-బీ	1
69	399.380	కొప్పు శ్రీవేణి	బీసీ-డీ	2
93	393.521	వీరంరెడ్డి శ్రీలత	ఓసీ	2
113	390.556	గొట్టిముక్కల స్నేహ	బీసీ-బీ	2
126	389.460	బిల్ల శ్రావణి	బీసీ-బీ	1
144	387.499	ఈరర్ల నిఖిత	ఓసీ	1
152	386.564	స్రవంతి లింగం	ఓసీ	2
162	386.113	మిల్కూరి సాయిచందన	బీసీ-డీ	1
163	385.556	దరావత్ అనూష	ఎస్టీ	2

కనిష్క్ రెడ్డికి కేటీఆర్ నివాళ్లు



నవతెలంగాణ- నాగోల్

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మాజీ కార్పొరేటర్ తీగల సుచరిత రెడ్డి కుమారుడు కనిష్క్‌రెడ్డి సంతాప సభను మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాగోల్ డివిజన్‌లోని పోచంపల్లి బలవంత్ రెడ్డి కన్వెన్షన్ హాల్లో నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై కనిష్క్ రెడ్డి చిత్రపటానికి పూల వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కనిష్క్ రెడ్డి చిన్న వయసులోనే రోడ్డు ప్రమాదంలో ప్రాణం కోల్పోవడం బాధాకరమన్నారు. ఆయనతో పాటు మాజీ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, పలువురు మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొని నివాళ్లర్పించారు.

దేశానికే రోల్ మోడల్ 'కొండపర్తి విలేజ్'

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి : మంత్రి సీతక్క
- దత్తత గ్రామంలో విస్తృత పర్యటన



నవతెలంగాణ -ములుగు

దేశానికే రోల్ మోడల్‌గా కొండపర్తి గ్రామం నిలవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. మంగళవారం ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామంలో గవర్నర్ పర్యటించారు. తొలుత కొమరం భీమ్, బిర్సాముండ విగ్రహాలను, పాఠశాలలో డిజిటల్ తరగతులను, అంగన్వాడీ కేంద్రాన్ని, రూ.7,84,700తో నిర్మించిన మసాలా యూనిట్, రూ.7,76,594తో కుట్టు మిషన్ యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం రిమోట్‌తో వ్యవసాయ మోటార్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ.. ఇది 70 గృహాలు, 285 మంది ప్రజలున్న చిన్న గ్రామమని, అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలని అన్నారు. తాను రాష్ట్రంలో ఏడు ఆదివాసీ గ్రామాలను దత్తత తీసుకున్నానని, వాటిలో ఈ గ్రామం ఒకటని, అన్ని గ్రామాలను అభివృద్ధిలో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దటానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. అటవీ ప్రాంతంలో ఉన్న ఈ గ్రామంలో డిజిటల్ తరగతులు ప్రారంభించుకోవడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు ఇంగ్లీషు బాగా మాట్లాడుతున్నారని తెలిపారు. స్వయం ఉపాధి యూనిట్ల ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. గుజరాత్‌లో అమూల్ ఏవిధంగా ప్రసిద్ధిగాంచిందో అదే తరహాలో కొండపర్తి గ్రామం కారం, పసుపు, మసాలా యూనిట్లకు పేరు ప్రఖ్యాతలు రావాలని ఆకాంక్షించారు. గ్రామంలో రూ.1.50కోట్లతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించినట్టు తెలిపారు. తాను, రాష్ట్రపతి, రాష్ట్ర మంత్రి సీతక్క అందరూ ఆదివాసీ బిడ్డలమేనని చెప్పారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఈ ప్రాంత అభివృద్ధికి జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగం సేవలను అభినందించారు. దట్టమైన అడవిలో రవాణా సౌకర్యం కూడా లేని ఈ గ్రామాన్ని గవర్నర్ దత్తత తీసుకున్నట్టు తెలిపారు. ఈ గ్రామాన్ని బయట ప్రపంచంతో అనుసంధానం చేస్తూ ఉత్పత్తులను అందించాలని, తద్వారా మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని అన్నారు. గ్రామానికి అనతి కాలంలోనే రహదారి సౌకర్యం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయటానికి గవర్నర్ ఏడు బోర్లు మంజూరు చేశారని, దాంతో రెండు పంటలు పండించడానికి అవకాశం కలిగిందని అన్నారు. 40 పరిశ్రమలు, దిశా స్వచ్ఛంద సంస్థ సహకారంతో 100 పాఠశాలలను దత్తత తీసుకున్నామని చెప్పారు. ఆదివాసీ గ్రామాల ప్రజలు ఐకమత్యంతో ఉండాలని, అప్పుడు సమైక్యతతో అభివృద్ధి సాధిస్తామని తెలిపారు. అనంతరం గవర్నర్ కార్యాలయ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో మహిళా స్వయం సహాయక సంఘాల వ్యాపారాల నిర్వహణకు ప్రముఖ ప్రాంతంలో దుకాణాన్ని కేటాయించినట్టు తెలిపారు. ఈ ప్రాంతంలో 150 ఎకరాల్లో లాభదాయకమైన మార్కెటింగ్ కలిగిన ఆధునిక వ్యవసాయ సాగు చేపట్టేందుకు చర్యలు చేపట్టనున్నట్టు చెప్పారు. అంతకుముందు మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ శబరీష్, గ్రామస్తులు గవర్నర్‌ను ఘనంగా సన్మానించి మెమోంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శబరిస్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, జిల్లా అటవీశాఖ అధికారి రాహూల్ కిషన్ జాదవ్, గవర్నర్ కార్యాలయ సంయుక్త కార్యదర్శి భవాని శంకర్, గవర్నర్ ఏడీసీ మేజర్ అమన్ కుండు, గవర్నర్ సీఎస్ఓ శ్రీనివాసరావు, గ్రంథాలయ కమిటీ చైర్మెన్ రవి చందర్, గ్రామ పెద్దలు లచ్చు పటేల్, ప్రజలు పాల్గొన్నారు.


సహాయక చర్యల్లో రోబో టెక్నాలజీ

కార్మికులను వెలికి తీసేందుకు అహర్నిశలూ కృషి

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో 14 కిలోమీటర్ల చివరన కదులుతున్న పైకప్పు

పొంచి ఉన్న ప్రమాదం, వెనక్కి తగ్గని టీం సభ్యులు





నవ తెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో ప్రమాదపుటంచున రెస్క్యూ టీం సభ్యులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. 14 కిలోమీటర్ల చివరన పైకప్పు కదులుతున్నా.. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కార్మికుల ఆచూకీ కోసం రాత్రింబవళు పని చేస్తున్నారు. మంగళవారం ఉదయం సొరంగంలోకి రోబోను తీసుకుని రెస్క్యూ టీం వెళ్లింది. 18 రోజుల నుంచి జరుగుతున్న సహాయక చర్యల్లో ఒక కార్మికుని మృతదేహం బయటపడగా.. మరో ఏడుగురి ఆచూకీ తెలియాల్సి ఉంది. ఒకవైపు కడావర్ డాగ్స్, మరోవైపు సింగరేణి నేవీ ఆర్మీ నిపుణులు, తాజాగా రోబోలు రంగంలోకి దిగాయి. మంగళవారానికి మరికొన్ని మృతదేహాలు లభిస్తాయన్న ఆశతో రెస్క్యూ టీమ్‌లు ప్రయత్నాలు చేస్తున్నాయి.

టీబీఎం మిషన్ ముందు 15 మీటర్లు డేంజర్ జోన్‌గా అధికారులు చెబుతున్నారు. సొరంగం కింది భాగాన తవ్వుతుంటే పైభాగం నుంచి మట్టి, నీళ్ల వస్తున్నాయి. దీంతో పైకప్పు కూలుతుందన్న భయంతో ఇప్పటికే సింగరేణిలో ఉపయోగించే సహాయక వస్తువులను తెప్పించారు. రోజుకు మూడు షిఫ్ట్‌ల్లో 110 మంది చొప్పున రెస్క్యూ టీం సభ్యులు పనిచేస్తున్నారు. మంగళవారం రోబో టెక్నాలజీతో అధికారులు సొరంగంలోకి వెళ్లారు. డి-వన్, డి-టు, డి-3 దగ్గర ఆపరేషన్ మొదలుపెట్టి డి-టు దగ్గర 8 మీటర్ల మేర మట్టిని తీశారు. ఇక్కడ కార్మికుల ఆనవాళ్లు కనిపించినట్టు తెలుస్తోంది. అయినా టీబీఎం మిషన్ ఉండటంతో దానిని గ్యాస్ కట్టర్ ద్వారా తొలగించి ముందుకు వెళ్లాల్సి ఉంది. టీబీఎం మిషన్ మట్టిలో కూరుకపోవడంతో దానిని వెలికితీయడం కష్టంగా మారిందని అధికారులు తెలిపారు.

సహాయక చర్యలపై సమీక్ష..

డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మంగళవారం టన్నెల్ ఆఫీసులో సహాయక చర్యలపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సహాయక చర్యల పురోగతిని సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. టన్నెల్ సహాయక చర్యలలో అనుసరించాల్సిన విధి విధానాలు, రోబోటిక్స్, మెకానికల్ పరికరాల వినియోగం, మట్టి తొలగింపు ప్రక్రియ, భద్రతా చర్యలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు హైదరాబాద్ నుంచి అన్వి రోబోటిక్స్ సంస్థకు చెందిన బెస్ట్ కెమెరా సదుపాయం గల రోబోటిక్‌తో సంస్థ ప్రతినిధులు విజయ్, అక్షయ్ లోకో ట్రైన్‌లో సొరంగంలోకి వెళ్లారు. కడావర్ డాగ్స్ కూడా ప్రమాద ప్రదేశానికి వెళ్లాయని తెలిపారు. ఈ సమావేశంలో జీయోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అన్వి రోబోటిక్స్, హైడ్రా అధికారులు, ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ టీం, ర్యాట్ మైనర్స్, దక్షిణ మధ్య రైల్వే కేరళకు చెందిన కడావర్ డాగ్స్ స్క్వాడ్ సహా సహాయక చర్యల్లో పాల్గొంటున్న అన్ని బృందాల అధికారులు పాల్గొన్నారు.

అడుగడుగునా సమస్యలే..

సొరంగంలో సహాయక చర్యలకు అడుగడుగునా సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రతి రెండున్నర కిలోమీటర్లకు ఒక దగ్గర నీటిని నిల్వ చేసి బయటకు పంపించేస్తున్నారు. రెండు గంటలకు ఒకసారి విద్యుత్ అంతరాయం ఏర్పడటం వల్ల వాటర్ పంపిణీ చేయడం సమస్యగా మారింది. ముఖ్యంగా సొరంగంలో వెలుతురు లేకపోవడం కూడా కష్టంగా ఉంది.

పసుపునకు మద్దతు ధర కల్పించాలి

- రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో రైతుల మహాధర్నా



నవతెలంగాణ- మెట్‌పల్లి

పసుపుకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని రైతు ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో మంగళవారం రైతు ఐక్యవేదిక నాయకులు పసుపు రైతులతో కలిసి మహాధర్నా చేపట్టారు. ముందుగా మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి పాత బస్టాండ్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి రోడ్డుపై బైటాయించారు. ఈ సందర్భంగా రైతు ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేసినా మద్దతు ధర దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నడూ లేని విధంగా పసుపు క్వింటాల్ రూ.5 వేల ధర ఉండటం బాధాకరమని అన్నారు. జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లో ప్రధాన పంట అయిన పసుపుకు మద్దతు ధర ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కనీస మద్దతు ధర రూ.15వేలు కల్పించాలని, మార్కెట్ ఇంటర్వేషన్ స్కీమ్‌లో పసుపును కలపాలని కోరారు.

పర్వతాలతో పోటీపడుతూ..

భారతీయ సమాజంలో అన్ని రంగాల్లోనూ లింగ అసమానత స్పష్టంగా కనిపిస్తుంది. అసమానత వల్ల ఆమె నాలుగు గోడలు దాటి ప్రకృతిలో సంచరించే అవకాశాలు బహుస్వల్పం. ద్వారాలు మూసి ఉంటాయి. ఇక సాహస క్రీడలు, యాత్రలు, ట్రెక్కింగ్ వంటివి పురుషులకు మాత్రమే సాధ్యం అనే తరతరాల నమ్మకాన్ని వమ్ము చేస్తూ మేమూ చేయగలం అంటూ మహిళలు సైతం సాహస యాత్రలు చేస్తున్నారు. సంఖ్యా పరంగా తక్కువే కావచ్చు కానీ సాహస ప్రయాణాలు చేస్తూ కొండలు లోయలే కాదు దేశాలు, ఖండాలు దాటుతున్నది నేటి మహిళ. అద్భుత శిఖరాలపై జెండా ఎగురవేస్తున్నది. ఆ మహిళా ట్రెక్కర్లు ఏం చెబుతున్నారో చూద్దాం...



- వి. శాంతి ప్రబోధ
9866703223

ఇప్పటివరకు ఈ రంగాల్లో మహిళలు చాలా తక్కువ. అయితే లింగ అసమానతలపై అవగాహన పెంచుకుంటూ, ఇతరుల్లో అవగాహన పెంచడానికి కృషి చేస్తున్నది ఆధునిక మహిళ. ఆ క్రమంలోనే అవుట్ డోర్ కార్యకలాపాల్లోకి వెళ్లే మహిళల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. పర్వతారోహణ, రాక్ క్లైంబింగ్, హైకింగ్, సర్ఫింగ్, ట్రెక్కింగ్ వంటి అనేక సాహస క్రీడల్లోకి మహిళలు ప్రవేశిస్తున్నారు. భూ ప్రపంచమే హద్దుగా ప్రయాణం సాగిస్తున్నారు. పురుషులతో కలిసిపోయి మహిళలూ వెళుతున్నారు. అంతేకాకుండా పురుషాధిక్యత ఉన్న ఈ రంగంలో మహిళలు బృందాలుగా ఏర్పడి యాత్రలు చేస్తున్నారు. అలాంటి వారి కోసం లధాఖీ వుమన్ ట్రావెల్ కంపెనీ, హిమాలయాల్లో ట్రెక్కింగ్ గ్రూపులు నిర్వహిస్తున్నారు. సాహసమే ఊపిరిగా ఎవరెస్టు, కిలిమంజారో వంటి పర్వతారోహణ చేస్తున్నారు. అంతేనా ఆయా రంగాలలో ఉద్యోగాలు వెతుక్కుంటున్నారు.

కొత్తగా ఉంది



నేను చేసిన తుంబురు తీర్థం ట్రెక్ అడ్వెంచరస్, ఎడ్యుకేటివ్. కొత్తవాళ్ల చాలామందిని కలవడం, వాళ్ల అనుభవాలు తెలుసుకోవడం, నా అనుభవాలు పంచుకోవడం కొత్తగా ఉంది. నేను మా ఆయన ఇద్దరం వచ్చాము. ఒక్కదాన్నే అయితే వచ్చేదాన్ని కాదేమో!

- రాధ, యోగ ట్రైనర్, హైదరాబాద్

భర్త ప్రోత్సాహంతో...



తుంబురు తీర్థం ట్రెకింగ్ బయలుదేరుతూ మా ఆయన నన్ను కూడా రమ్మన్నాడు. మూడు రోజులని నేను అంత ఆసక్తి చూపలేదు. తిరుపతి చుట్టుపక్కల చిన్న చిన్న ట్రెకింగ్‌లు మిత్రులు, మా ఆయనతో కలిసి చాలా చేశా. కానీ మూడురోజుల ట్రెక్ అంటే నా వల్ల కాదనుకున్నా. మా ఆయన ప్రోత్సాహంతో వచ్చా. ఒంటరిగా వచ్చిన మహిళలను చూస్తుంటే ఆశ్చర్యంతో పాటు ఆనందం కూడా కలిగింది.

- సంతోషి, తిరుపతి

వయసును మరిచిపోయి...



నేను ఒంటరి మహిళను. తెలిసిన గ్రూప్స్‌తో కలిసి టూర్లకు వెళ్తుంటాను. అయితే ట్రెక్కింగ్‌కి ఎప్పుడు వెళ్ళలేదు. యూ ట్యూబ్‌లో చూసి అలా ట్రెకింగ్ వెళ్లాలని అనుకున్నా. మార్గం కోసం అన్వేషించా. yhai ఇటువంటి ట్రెక్కింగ్‌లు నిర్వహిస్తుందని మిత్రులు చెప్పారు. yhai సభ్యత్వం తీసుకున్నా. శేషాచలం అడవుల్లోకి తుంబురు తీర్థం ట్రెక్కింగ్‌కి వచ్చా. ఇంత పెద్ద కొండలు, వాగులు వంకలు దాటుకుంటూ వచ్చినప్పుడు ప్రకృతి గొప్ప జీవిత సత్యాలు బోధించినట్లు అనిపించింది. నన్ను, నా వయసును మరిచిపోయేలా చేసి మరింత ధైర్యం, స్థైర్యం ఇచ్చింది. ఇక ముందు మరిన్ని ట్రెక్కింగ్‌లు చేస్తా.

- జి. వాణి, భీమవరం యోగ ట్రైనర్, హైదరాబాద్

అంతరాలు లేకుండా



నేనూ, నమ్రత గతంలో పూనాలో పనిచేశాం. అప్పుడు తనతో నేను కూడా ఒక ట్రెక్‌కి వెళ్ళా. కుటుంబంతో కాకుండా ట్రెక్కింగ్ గ్రూప్‌తో కలిసి వెళ్లడం కొత్త అనుభవం. అడవులు, కొండలు, పర్వతాలు ఆడ, మగ, చిన్న, పెద్ద, కుల, మత ప్రాంతాల అంతరాలు లేకుండా అందరినీ ఒకేలా ఆదరిస్తాయి. వాటి చెంత చేరిన మనుషులు కూడా కలసిమెలసి ఉండడం నాకెంతో నచ్చింది. మొదట్లో నేను నా దేశంలోనే నేన్నానా? అని సందేహం వచ్చేది. తోటి మనిషిని, ప్రకృతిని, పరిసరాల్ని ప్రేమించడం నేర్చుకున్నా. ట్రెక్కింగ్ తర్వాత మంచు కొండలు, దట్టమైన అరణ్యాలు, ప్రకృతితో ప్రేమలో పడిపోయా.

- ముక్త ఉమర్జీ, ఐటి ప్రొఫెషనల్, బెంగుళూరు

ఎన్ని చుట్టుకుంటాయో...



మా ఆయన పాతికేండ్లకు పైగా ట్రెకింగ్ చేస్తున్నాడు. నేను మాత్రం మూడేండ్లుగా ఆయనతో కలిసి వెళుతున్నా. మగవాళ్ళు వెళ్లినట్లు ఆడవాళ్లకు కుదురుతుందా! ఇంట్లోంచి బయటికి రావాలంటే ఎన్ని చూసుకోవాలి. మన కాళ్లకు ఎన్ని చుట్టుకుని ఆపేస్తాయో మీకు తెలియదా చెప్పండి. ఇప్పుడు ఇంట్లో ఇద్దరమే మిగిలాం. ఇద్దరం ట్రెక్కింగ్ అందిస్తున్నాం. ఒక్కదాన్నయితే రాలేనేమో!

- రత్న మాండ్య, కర్ణాటక

భయాలన్నీ పోయాయి



పిల్లలతో, కుటుంబంతో టూర్‌కి వెళ్లడం అలవాటు. ట్రెకింగ్ ఈ మధ్యనే మిత్రుల ద్వారా పరిచయం అయింది. ఇది నా మూడో ట్రెక్. ఒకప్పుడు ట్రెక్కింగ్ చేయలేనేమో అనుకునేదాన్ని, భయపడేదాన్ని. ఇప్పుడు ఆ భయాలన్నీ పోయాయి. శారీరకంగా, మానసికంగా మహిళలు దృఢంగా ఉంటారని అనుభవం పూర్వకంగా చెబుతున్నాను. ఉద్యోగ బాధ్యతల నుంచి తప్పుకున్నాక విస్తృతంగా ట్రెక్కింగ్ చేయాలని నా అభిలాష.

- సుమలత, టీచర్, మైసూర్

కొత్త కోణంలో



గతంలో హిమాలయ ట్రెక్కర్స్‌తో కలిసి ట్రెక్ చేశాను. హిమాలయ పర్వత పాదాల దగ్గరకు వెళ్తున్న ఉత్సాహం నన్ను నిలువనీయలేదు. కొత్తవారైనా అందరూ మనవాళ్లే అయిపోవడం నాకు చాలా నచ్చింది. చిన్న బాధ అనిపించినా ఎంతో శ్రద్ధ తీసుకుంటారు. ఒంటరిగా వెళ్లిన ఫీలింగ్ లేకుండా అందరూ కుటుంబ సభ్యుల్లా మెలగడం ట్రెక్కింగ్ పట్ల ఆసక్తి పెరిగింది. హై ఆల్టిట్యూడ్‌లో మంచు కొండల్లో జీవనం చూసి ఒకే దేశంలో ఎంత విభిన్నత అని ఆశ్చర్యపోయాను. జీవితాన్ని కొత్త కోణంలో చూడడానికి కొత్త ప్రాంతాలు, కొత్త మనుషులు దోహదం చేస్తాయి.

- నమ్రత బాగెల్, ఐటీ ఉద్యోగిని, ఒరిస్సా

సజీవంగా నిలుపుకుంటా..



చిన్నప్పటి నుంచి ప్రకృతిలోకి ప్రయాణం అంటే ప్రాణం. అన్ని పనులు వదిలి బయలుదేరుతా. నేను మా ఆయన ఇద్దరం కలిసి ట్రెకింగ్‌కి వెళ్లిపోతుంటాం. ఒకరోజు ట్రెకింగ్‌లు చాలా చేసాం. నేను ఒక్కదాన్నే ఎప్పుడూ వెళ్ళలేదు. సాంప్రదాయ కుటుంబంలో మహిళ ఒంటరిగా ట్రెక్ చేయడానికి మద్దతు ఇస్తారని అనుకోవడం లేదు. కానీ నా అభిరుచి, అభిలాష సజీవంగా నిలుపుకోవాలనుకుంటున్నాను.

- సుష్మ, తమిళనాడు

ఒంటరిగా పంపరు



మా అన్నయ్య, బంధువులతో కలిసి ట్రెక్కింగ్ చేయడం ఉత్తేజకరమైన అనుభవం. మా అన్నయ్య ఒక్కడే చాలా సార్లు ట్రెక్కింగ్‌కి వెళ్ళాడు. నన్ను మాత్రం పంపరు. పెళ్లయ్యాక నా భర్తతో వెళ్లచ్చు అంటారు. పోరాడి, పోట్లాడి మా అన్నయ్య సపోర్టుతో వచ్చాను. ఎందుకంటే పెళ్లి కాని ఆడపిల్లను కదా! భద్రత గురించి ఆలోచిస్తారు. ఏ కాలో చెయ్యో విరిగితే పెళ్లి ఎలా అవుతుందని వారి భయం. ఒంటరిగా పంపే ప్రసక్తే లేదు.

- మైత్రేయి ఆర్జే, కర్ణాటక

సమిష్టితత్వం అలవడుతుంది



మేఘాలయ, గోవా మాన్సూన్ ట్రెక్, చార్ధామ్, అహోబిలం ఉగ్ర స్తంభం, తుంబురు తీర్థం వంటి ట్రెక్ అనుభవాలున్నాయి. తోటి ట్రెక్కర్లు ఎవరూ ఈ వయసులో ట్రెక్కింగ్ అవసరమా అన్న ప్రశ్న వేయలేదు. కానీ మన సమాజంలో వృద్ధులు, మహిళలు ట్రెక్కింగ్ చేయలేరని ప్రజల నమ్మకం. ఆడపిల్లలు ట్రెక్ చేస్తే ఏ కాలో చెయ్యో విరిగితే పెళ్లి కాదని భయం. నేను వెళ్లిన ట్రెక్స్‌లో మహిళలు చాలా తక్కువ. ఉన్నవాళ్లు కూడా 40 లోపు వాళ్లే. 60 పైబడిన నాలాంటి వారు మరింత తక్కువ. ఉగ్ర స్తంభం వెళ్ళినపుడు యువ ట్రెక్కర్లు నా స్ఫూర్తితో తమ తల్లిని తీసుకువస్తామని చెప్పడం ఆనందం కలిగించింది. ట్రెక్కింగ్ వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆనందం కలుగుతుంది. పరస్పర సహకారం, సమిష్టితత్వం అలవడుతుంది. మానవ సంబంధాలు దృఢమవుతాయి. ఫిట్నెస్‌పై శ్రద్ధ పెడతాం. అది జీవన ప్రమాణాన్ని పెంచుతుంది.

- గిరిజ పైడిమర్రి, వైస్ ప్రెసిడెంట్, yhai విహంగ మహిళా విభాగం, హైదరాబాద్

నేనేంటో తెలుసుకుంటూ...



వారాంతాల్లో ఎక్కడికి వెళ్లాలని పిస్తే అక్కడికి ఒక్కదాన్నే బ్యాక్ పాక్‌తో వెళ్లి పోతుంటా. అలా వెళ్లడం నాకు చాలా ఇష్టం. ఇలాంటి సందర్భాల్లో నాలోకి నేను ప్రయాణిస్తున్నట్లు ఉంటుంది. నేనేంటో నేను తెలుసుకుంటూ ఉంటా. ఇంట్లో వాళ్ళు మొదట భయపడ్డారు. కానీ ఇప్పుడు వాళ్ల అలవాటుపడ్డారు. ఇంతవరకు పెద్ద సవాళ్ల ఏమీ ఎదుర్కోలేదు.

- అంకిత, మైసూర్

పాల రైతులకు బకాయి బిల్లులు చెల్లించాలి

(మొదటిపేజీ తరువాయి)

పరిశ్రమను ప్రభుత్వాలు క్రమానుగుణంగా నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయివేట్ సంస్థలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వడం వల్ల ప్రభుత్వ సంస్థలైన విజయడెయిరీ, మదర్‌డెయిరీలు నష్టాల్లోకి నెట్టివేయబడుతున్నా యని తెలిపారు. విదేశాల నుంచి పాలను కేంద్ర ప్రభుత్వం దిగుమతి చేసుకోవడం వల్ల దేశీయ పాల రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని అన్నారు. పాల ఉత్పత్తులపై సుంకాలను పెంచి దిగుమతులను అరికట్టాలని కోరారు. ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో విస్తరించి ఉన్న మదర్‌డెయిరీ సంస్థ అప్పుల్లో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. సంస్థను గట్టెక్కించా లంటే దాని ఆస్తులను అమ్మాల్సి వస్తుందని డెయిరీ చైర్మెన్ ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించారు. సంస్థలో అవినీతి పెరిగిపోవడం వల్లే నష్టాల పాలవుతున్నదని, రోజుకు లక్షా15 వేల లీటర్ల పాలను సేకరిస్తున్న యాజమాన్యం వ్యాపారం చేయడంలో విఫలమవడమే నష్టాలకు ప్రధాన కారణమని అన్నారు. నష్టాల్లో ఉన్న సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్స్ రూపంలో సహకరించాలని కోరారు. అదే విధంగా సంస్థ లాభాల్లోకి వచ్చేందుకు అధికార యంత్రాంగం, సిబ్బంది కావాల్సిన చర్యలు చేపట్టాలన్నారు.

విజయడెయిరీ ప్రభుత్వ సంస్థ అయినప్పటికీ 15 రోజులకు ఒకసారి ఇవ్వాల్సిన పాల బిల్లులను ఇవ్వకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రోజుకు మూడు లక్షల 50 వేల లీటర్ల పాలు సేకరించే సంస్థ, పాల ఉత్పత్తుల విక్రయాలను పకడ్బందీగా చేసి సంస్థను మరింత లాభాల్లోకి తీసుకురావాలని కోరారు. రెండేండ్లుగా పెండింగ్‌లో ఉన్న లీటర్ పాలకు రూ.5 చొప్పున చెల్లించాల్సిన అదనపు మొత్తాన్ని పాలరైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. పాల ఉత్పత్తికయ్యే ఖర్చులను, పెరుగుతున్న ఇతర ముడి సరుకుల ధరలను దృష్టిలో పెట్టుకొని పాల రేట్లు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో జగన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేక అశోక్‌రెడ్డి, మాటూరి బాలరాజుగౌడ్, నాయకులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, మంగ నరసింహులు, బూరుగు కృష్ణారెడ్డి, చీరిక అలివేలు, చీరిక సంజీవరెడ్డి, కందడి సత్తిరెడ్డి, కోట రామచంద్రారెడ్డి, బబ్బూరి పోశెట్టి, రాగిరి కిష్టయ్య ర్యాకల శ్రీశైలం, రేసు రామచంద్రారెడ్డి, గన్నెబోయిన విజయభాస్కర్, బోయిన ఆనంద్, ఎదునూరిమల్లేశం, గాడి శ్రీనివాస్, పల్లెర్ల అంజయ్య, మచ్చ భాస్కర్, సిల్వరు ఎల్లయ్య, భీమగాని రాములు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ లీడర్లను నియమిస్తాం

(మొదటిపేజీ తరువాయి)



శాసనసభ్యులు, మండలి సభ్యులు నిర్ణీత సమయానికే అసెంబ్లీకి రావాలని ఆదేశించారు. సభల్లో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలనీ, రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపైనా, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపైనా చీల్చి చెండాడలని సూచించారు. బీఆర్‌ఎస్ మీద రాష్ట్ర సర్కారు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎండిన పంటలు, అందని కరెంటు, సాగునీరు, కాలిపోతున్న మోటార్లు తదితర రైతాంగ సమస్యలపైనా, తాగునీటి కొరతపైనా సభలో లేవనెత్తాలని సూచించారు. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా గొంతు వినిపించాలన్నారు. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు నిర్వీర్యమవుతున్నాయనీ, దీన్ని కూడా సభలో లేవనెత్తాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్, డీఏల పెండింగ్, పీఆర్సీ అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. మహిళలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని కొట్లాడాలని సూచించారు. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని నిలదీయాలన్నారు. దళిత బంధు, గొర్రెలు, చేపల పంపిణీ పథకాలను నిలిపివేయడాన్ని ప్రశ్నించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాలను, వారి ఆకాంక్షలను అర్థం చేసుకొని వారి గొంతుకగా సభ్యులు ఉభయ సభల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్‌ఎస్‌కు చెందిన శాసనసభ, శాసనమండలి సభ్యులు పాల్గొన్నారు.

యువత కోసం రాజీవ్‌యువవికాసం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజీవ్ యువ వికాసం ద్వారా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నిరుద్యోగ యువతీ యువకులకు రూ.6 వేల కోట్లతో ఐదు లక్షల మందికి స్వయం ఉపాధి పథకాలు అందిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో వీర వనిత చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. యువ వికాసాన్ని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోలేదనీ, ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే యువతకు స్వయం ఉపాధి పథకాలు అందించి వారి అభ్యున్నతికి దోహదపడాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని ఈ సందర్భంగా వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధి పథకాలు అందక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నందున ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా యువతకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఒక్కో లబ్దిదారుడికి రూ.3 లక్షల చొప్పున సాయం చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెల్లడించారు. 5 లక్షల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఈ సంవత్సరం స్వయం ఉపాధి పథకం అందించడానికి ఈ నెల 15న నోటిఫికేషన్ విడుదల చేస్తామని వెల్లడించారు. ఈ పథకం కొరకు ఆన్‌లైన్‌లో ఏప్రిల్5 వరకు దరఖాస్తు చేసుకోవా లని చెప్పారు. ఏప్రిల్ 6 నుంచి మే 31 వరకు దరఖాస్తుల పరిశీలన, లబ్దిదారుల ఎంపిక జరుగు తుందని తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న స్వయం ఉపాధి పథకాలకు ఎంపికైన లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తామని వివరించారు. లబ్దిదారుల ఎంపికకు సంబంధించి తగిన మార్గదర్శకాలను అధికారులు రూపొందిస్తున్నారని చెప్పారు.

చాకలి ఐలమ్మ యూనివర్సిటీకి రూ.540 కోట్లు

చాకలి ఐలమ్మ యూనివర్సిటీ నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం రూ.540 కోట్లు కేటాయించిందని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. దేశంలోనే ఉత్తమ యూనివర్సిటీగా తీర్చిదిద్దడానికి అద్భుతమైన నిర్మాణాలు చేయడానికి ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ డిజైన్ చేసిందని ఈ సందర్భంగా తెలిపారు. యూనివర్సిటీలో ఉన్న హెరిటేజ్ భవనాలను పునరుద్దరిస్తామని తెలిపారు. యూనివర్సిటీ ప్రధాన ద్వారం మూసీ రివర్‌ను ఆనుకుని ఉందని మూసి పునర్జీవమైన తర్వాత యూనివర్సిటీ ప్రధాన ద్వారాన్ని తిరిగి ప్రారంభిస్తామని తెలిపారు. యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న వారసత్వ కట్టడాల పునరుద్ధరణకు రూ.15.5 కోట్లు, అదేవిధంగా నూతన భవన నిర్మాణాలకు తక్షణమే రూ.100 కోట్లు విడుదల చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం వెల్లడించారు. హెరిటేజ్ భవనాలు, పునరుద్ధరణ ప్రణాళికలను అధికారులతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్వయంగా పరిశీలించారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు, సమాచార, పౌర సంబంధాల కమిషనర్ హరీష్, ఐలమ్మ యూనివర్సిటీ వీసీ సూర్య ధనుజయ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విద్యాశాఖమంత్రి క్షమాపణ చెప్పాలి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తమిళ ప్రజలను అవమానించిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ క్షమాపణ చెప్పాలని పార్లమెంట్‌లో డీఎంకే ఎంపీలు డిమాండ్ చేశారు. మరోవైపు కేంద్ర మంత్రికి వ్యతిరేకంగా డీఎంకే ఎంపీ కనిమొళి ప్రివిలేజ్ నోటీస్‌ను అందజేశారు. మంగళవారం రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయం అనంతరం విద్యాశాఖ పనితీరుపై చర్చ మొదలైంది. చర్చ ప్రారంభించాలని కాంగ్రెస్ సభ్యుడు దిగ్విజయ్ సింగ్‌కు డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ సూచించారు. ఇదే సమయంలో తమిళనాడు ప్రభుత్వంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యలకు గానూ ఆయన క్షమాపణ చెప్పాలని డీఎంకే ఎంపీలు డిమాండ్ చేశారు. ఈ గందరగోళం మధ్య జోక్యం చేసుకున్న ఖర్గే తాను ఉదయం మాట్లాడేటప్పుడు విద్యాశాఖ మంత్రి సభలో లేరన్నారు. కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా ప్రవర్తిస్తోందని తెలిపారు. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షాలు సిద్ధంగా ఉన్నాయని అర్థం వచ్చేలా ఓ హిందీ పదాన్ని వాడారు. దీనిపై అధికార పక్షం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రతిపక్ష నేత వాడిన పదజాలం ఖండించదగిందని దుయ్యబట్టింది. చైర్‌ను ఉద్దేశిస్తూ అటువంటి వ్యాఖ్యలు చేయడం క్షమించరానిదని రాజ్యసభా పక్షనేత జేపీ నడ్డా అన్నారు. ఖర్గే క్షమాపణలు చెప్పాలని, ఆయన అన్న మాటలను రికార్డుల నుంచి తొలగించాలని పట్టుబట్టారు. వెంటనే స్పందించిన ఖర్గే.. తాను ఆ పదజాలాన్ని వాడినందుకు క్షమాపణలు చెబుతున్నానని అన్నారు. అయితే, అవి చైర్‌ను ఉద్దేశించి చేయలేదని, ప్రభుత్వ విధానాల గురించి అలా మాట్లాడానని స్పష్టత ఇచ్చారు. తన వ్యాఖ్యలు బాధపెట్టి ఉంటే క్షమించాలంటూ చైర్‌కు విజ్ఞప్తి చేశారు.

కేంద్ర మంత్రికి వ్యతిరేకంగా ప్రివిలేజ్ మోషన్

లోక్‌సభలో సోమవారం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తమిళనాడు ప్రజలను అనాగరికులంటూ వ్యాఖ్యానించడంపై డీఎంకే ఎంపీ కనిమొళి తప్పుపట్టారు. కేంద్ర మంత్రి సభను తప్పుదోవ పట్టించారని, తమిళ ప్రజల మనోభావాలను దెబ్బతీశారని పేర్కొంటూ ఆయనపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం (ప్రివిలేజ్ మోషన్) ప్రవేశపెట్టారు. "తమిళనాడు ప్రజలు అనాగరికులు అంటూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలను నేను తీవ్రంగా ఖండిస్తున్నా. ఆయన తక్షణమే క్షమాపణలు చెప్పాలని డీఎంకే, 8 కోట్ల మంది తమిళుల తరఫున నేను డిమాండ్ చేస్తున్నా. పీఎం శ్రీ పథకం విషయంలో తమిళనాడు ప్రభుత్వం ఎంఓయూపై సంతకాలకు అంగీకరించి, ఆపై వెనక్కి తగ్గిందని ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యల్లో ఏమాత్రం నిజం లేదు" అని అన్నారు. ఈ ప్రకటన పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించేదేనని, ఇది సభా హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని పేర్కొన్నారు. ఎంపి కనిమొళి ఇచ్చిన తీర్మానాన్ని స్పీకర్ ఓం బిర్లా పరిశీలించనున్నారు. ఒకవేళ స్పీకర్ గనుక ఆ తీర్మానాన్ని అంగీకరిస్తే దర్యాప్తునకు ఆదేశిస్తారు. అందులో ఉల్లంఘన జరిగినట్టు తేలితే క్రమశిక్షణా ఉల్లంఘన కింద చర్యలు తీసుకుంటారు

నల్ల దుస్తులతో డీఎంకే ఆందోళన

కేంద్ర ప్రభుత్వ హిందీని రుద్దే విధానాన్ని నిరసిస్తూ నిరసన తెలిపిన డీఎంకే ఎంపీలను అనాగరికులుగా కేంద్ర విద్యా మంత్రి చేసిన ప్రకటనపై నిరసనలు కొనసాగించారు. మంగళవారం, విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అభ్యంతరకరమైన ప్రకటనకు వ్యతిరేకంగా డీఎంకే ఎంపీల నేతృత్వంలో పార్లమెంటు లోపల, వెలుపల పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయి. ఇతర ప్రతిపక్ష పార్టీలు కూడా డీఎంకేకు మద్దతుగా నిలిచాయి. నిరసనకు డీఎంకే ఎంపీలు నల్లటి దుస్తులు ధరించి పార్లమెంటుకు వచ్చారు. తమిళనాడులో పిల్లల భవిష్యత్తును కేంద్ర ప్రభుత్వం నాశనం చేస్తోందని కనిమొళి ఆరోపించారు. జాతీయ విద్యా విధానం, త్రిభాషా విధానాన్ని అమలు చేయకపోతే విద్యా రంగానికి నిధులు నిలిపివేస్తామని కేంద్ర ప్రభుత్వం బెదిరిస్తోందని విమర్శించారు. తమిళనాడులో పిల్లలకు రావాల్సిన నిధులను నిలిపివేసే అధికారం కేంద్రానికి లేదని, కేంద్ర ప్రభుత్వం పిల్లల భవిష్యత్తును నాశనం చేస్తోందని కనిమొళి ధ్వజమెత్తారు.

గత లోక్‌సభ ఎన్నికల వరకే ఇండియా బ్లాక్

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాన కారణం. తమిళనాడు, బీహార్ వంటి కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే ఇండియా బ్లాక్ కంటే ముందుగానే ఈ పార్టీల మధ్య పొత్తు వుందని కరత్ చెప్పారు. "లోక్‌సభ ఎన్నికల తర్వాత, తమకు ఒక వేదిక అవసరమా అని ఈ పార్టీలు ఆలోచించాల్సి వుంది. ఒకవేళ వుంటే దాన్ని ఎలా రూపొందించుకోవాలి అని కూడా ఆలోచించాలి. కేవలం ఎన్నికలను దృష్టిలో వుంచుకునే చేశారా? అదే గనుక అయితే ఇప్పుడు చేయాల్సిన అవసరమేమీ లేదు." అని కరత్ చెప్పారు.

కేరళలో బీజేపీ పనితీరు

దాదాపు దశాబ్ద కాలంగా సీపీఐ(ఎం) నేతృత్వంలోని సంకీర్ణం అధికారంలో వున్న కేరళలో పార్టీ ముందున్న సవాలు రాజకీయమే గానీ సంస్థాగతం కాదని అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు చూసినట్లైతే, కేరళలో కొన్ని భాగాల్లో, కొన్ని వర్గాల్లో బీజేపీ విస్తరించింది. "లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై మా సమీక్షలో, ఈ అంశం చాలా స్పష్టంగా బయట పడింది. అంతర్జాతీయంగా సాధారణంగా మితవాదుల వైపు మళ్ళింపు వుంది. కేరళ సమాజంలోనూ అలాగే వుంది. దాన్ని మీరు ఎలా ఎదుర్కొంటారన్నదే ప్రశ్న? ఈ రాష్ట్ర మహాసభలో తీవ్రంగా చర్చిస్తున్న పలు అంశాల్లో ఇది కూడా ఒకటి" అని కరత్ చెప్పారు. ఇటీవల అన్ని వర్గాల్లో మతతత్వం బాగా పెరిగిందని, మత తత్వ శక్తులు కూడా దాన్ని బాగా ఉపయోగించుకుంటున్నాయని కరత్ చెప్పారు. "ఇది హిందువు లను, ముస్లింలను, క్రైస్తవులను, ఇతరులను ప్రభావితం చేస్తోంది. భారతదేశానికి ఇది మంచిది కాదు, దీన్ని సాంస్కృతికంగా, సామాజికంగా పరిష్కరించడానికి కొన్నిమార్గాలను మేం రూపొందించాం" అని చెప్పారు.

ప్రధాని మోడీకి మారిషస్ అత్యున్నత పురస్కారం

పోర్ట్‌లూయిస్ : ప్రధాని మోడీకి మారిషస్ అత్యున్నత పురస్కారం దక్కింది. తమ దేశ అత్యున్నత పురస్కారం "ది గ్రాండ్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ అండ్ కీ ఆఫ్ ది ఇండియన్ ఓషన్"ను మోడీకి ఆ దేశ ప్రధాని నవీన్ రామ్‌గులాం ప్రకటించారు. ఈ గౌరవాన్ని దక్కించుకున్న తొలి భారత ప్రధానిగా మోడీ ఘనత సాధించారు. ప్రస్తుతం మారిషస్ పర్యటనలో ఉన్న మోడీ.. ప్రధాని నవీన్‌చంద్ర రామ్‌గులాం, ఆయన సతీమణి వీణా రామ్‌గులాంలకు 'ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా (ఓసీఐ)' కార్డులు ప్రకటించారు. పర్యటనలో భాగంగా అక్కడున్న భారతీయులతో ప్రధాని మోడీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "పదేండ్ల క్రితం సరిగ్గా ఇదే రోజున మారిషస్‌కి వచ్చాను. అప్పటికీ హెూలీకి పది రోజులే ఉంది. ఈ సారి హెూలీ రంగులను నాతో పాటు భారత్‌కు తీసుకెళ్తా. ఈ ప్రాంతానికి వస్తే నా సొంత ప్రదేశంలా అనుభూతి కలుగుతుంది. మనమంతా ఒకే కుటుంబం" అంటూ ప్రసంగించారు. అనంతరం.. తనను అత్యుత్తమ పురస్కారంతో సత్కరించిన మారిషస్ ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. కాగా పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పుడు ప్రధాని విదేశీ పర్యటనలకు వెళ్లడమేంటని ప్రతిపక్షాలు నిలదీస్తున్నాయి.

యూపీఐ చెల్లింపులపైనా ఫీజు..

న్యూఢిల్లీ : యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), రూపే డెబిట్ కార్డుల ద్వారా నిర్వహించే లావాదేవీలపై మర్చెంట్ ఫీజులను తిరిగి వసూలు చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకు సంబంధించిన బ్యాంకింగ్ అసోసియేషన్ ప్రతిపాదనకు కేంద్రం సానుకూలంగా స్పందించినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం యూపీఐ లావాదేవీలపైన ఎటువంటి అదనపు చార్జీలు లేవు. కాగా.. వార్షిక ఆదాయం రూ. 40 లక్షల కంటే ఎక్కువ ఉన్న వ్యాపారుల యూపీఐ చెల్లింపుల మీద మర్చెంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)ను మళ్ళీ తీసుకురావాలని ప్రతిపాదిస్తూ బ్యాంకింగ్ ఇండస్ట్రీ ప్రతినిధులు కేంద్రానికి పంపించారు. ఇది త్వరలోనే అమల్లోకి రానుందని రిపోర్టులు వస్తోన్నాయి. వీసా కార్డు, మాస్టర్ కార్డు వంటి డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డుల లావాదేవీలపై మర్చెంట్ డిస్కౌంట్ రేట్ చెల్లిస్తున్నారు. అదే తరహాలో యూపీఐ, డెబిట్ కార్డుల చెల్లింపుల పైనా కూడా చార్జీలు వసూలు చేయాలని కేంద్రం భావిస్తోంది. అయితే రూ.40 లక్షల కంటే తక్కువ ఆదాయం కలిగిన వ్యాపారులపై ఎలాంటి చార్జీలు ఉండవు. ఫిన్‌టెక్ సంస్థల ప్రతినిధులు ఇటీవల ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రాతో భేటీలోనూ ఎండీఆర్ అమలు అంశాన్ని ప్రస్తావించారు.

పనిభద్రత కోల్పోతున్నా పట్టదా?

ట్రేడ్ యూనియన్లపై కార్పొరేట్ మీడియా దాడిని తిప్పికొట్టండి



యువ కార్మికుల్లారా మేల్కొనండి

- 80 శాతం కంపెనీల్లో యూనియన్లే లేవు..ఉత్పత్తికి ఆటంకం అనేది అసత్యప్రచారం
- కార్మికులకు తక్కువ వేతనాలు.. కంపెనీలకు అధిక లాభాలు
- యువ కార్మికుల సదస్సులో సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'యువ కార్మికుల్లారా..కార్మిక చట్టాలపై దాడి జరుగుతున్నా, పనిభద్రత కోల్పోతున్నా పట్టదా? కార్పొరేట్ల చేతిలో బానిసలుగా మారే ప్రమాదం ముంచుకొస్తున్నది. మేల్కొనండి. హక్కుల కోసం కొట్లాడండి. ట్రేడ్ యూనియన్లు అభివృద్ధికి ఆటంకం అని కార్పొరేట్ మీడియా చేస్తున్న దాడిని తిప్పికొట్టండి' అని యువ కార్మికులకు సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు పిలుపునిచ్చారు. దేశంలోని 80 శాతం పరిశ్రమల్లో యూనియన్లే లేవనీ, అలాంటప్పుడు ఉత్పత్తికి ట్రేడ్ యూనియన్లు ఎలా ఆటంకం అవుతాయని ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో యువ కార్మికుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలోని పరిశ్రమల్లో పనిచేస్తున్నవారిలో 40 ఏండ్ల లోపు ఉన్న యువ కార్మికులే 76 శాతం ఉన్నారని చెప్పారు. కంపెనీల్లో కార్మికుల వేతనాలు తగ్గడం, కార్పొరేట్లలాభాలు పెరుగుతుండటాన్ని బట్టే శ్రమదోపిడీ ఏ స్థాయిలో జరుగుతున్నదో అర్థం చేసుకోవచ్చునన్నారు. మోడీ ప్రభుత్వం వచ్చాక కార్మిక వర్గంపై దాడి తీవ్రమైందన్నారు. ప్రపంచంలో ఏ దేశంలోనూ లేని విధంగా భారత్‌లో అసమానతలు రోజురోజుకీ పెరుగుతున్న తీరును ఉదాహరణలతో వివరించారు. చాలా పరిశ్రమలు అనధికారికంగా ఎక్కువ పనిగంటలను అమలు చేస్తున్నాయనీ, రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్యను క్రమంగా తగ్గిస్తూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పెంచుకుంటూ పోతున్నాయని చెప్పారు. ఇప్పుడు కొత్తగా అప్రెంటీస్ విధానాన్ని తీసుకొచ్చి కేవలం స్టయిఫండ్ ఇచ్చి కార్మికుల శ్రమదోపిడీ చేస్తున్న కంపెనీల తీరును ఎండగట్టారు. కంపెనీల్లో కార్మికులు కలిసి ఐక్యంగా ఉండకుండా రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, అప్రెంటీస్, డైలీవేజ్ ఇలా అనేక రకాలుగా కార్మికులను విభజించి పనిచేయించుకుంటున్న తీరును వివరించారు. కార్మికులతో పాత పనులే చేయిస్తూ ప్రమోషన్ల పేరుతో వారిని ట్రేడ్ యూనియన్ల నుంచి తప్పిస్తున్న విషయాన్ని ఎండగట్టారు. కార్మికులు శ్రమకు తగ్గ వేతనం అడిగితే అభివృద్ధి నిరోధకులు ఎలా అవుతారని ప్రశ్నించారు. బేసిక్ వేతనం పెంచకుండా కేవలం ఇన్సెంటీవ్‌లు ఇచ్చే ధోరణి పెరగటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ మీడియా తప్పుడు ప్రచారానికి కౌంటర్ వాదనలు ఇవ్వాలని యువ కార్మికులకు పిలుపునిచ్చారు. కార్మికవర్గంపై జరుగుతున్న దాడిని తిప్పకొట్టేందుకు యువ కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు మాట్లాడుతూ..ఉత్పత్తి రంగంలో కార్మికుల భాగస్వామ్యం కీలకమైనదని చెప్పారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి, వస్తున్న మార్పులకు అనుగుణంగా యువ కార్మికులు తమలోని నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఏఐ టెక్నాలజీ ప్రభావం కార్మికవర్గంపై పెద్ద ఎత్తున పడే అవకాశమున్న నేపథ్యంలో సాంకేతికంగానూ పరిణతి సాధించాలన్నారు. సామ్‌సంగ్ కంపెనీలో కార్మికుల పోరాట విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని యువకార్మికులను పిలుపునిచ్చారు. పరిశ్రమల్లో యువ కార్మికులు నాయకత్వ లక్షణాలను అందిపుచ్చుకోవాలని దిశానిర్దేశం చేశారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికవర్గం పై దాడి తీవ్రమవుతున్న ఈ సందర్భంలో సమరశీల పోరాటాల్లో యువ కార్మికులు ముందుండాలని పిలుపునిచ్చారు. బలమైన కార్మిక ఉద్యమాలను క్షేత్రస్థాయి నుంచి నిర్మించాలని సూచించారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ మాట్లాడుతూ..కేవలం పనికే పరిమితం కాకుండా కార్మిక చట్టాలపైనా, పరిశ్రమల ఉత్పత్తిపైనా యువ కార్మికులు దృష్టి సారించాలన్నారు. లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికులపై జరుగుతున్న దాడి గురించి అధ్యయనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఎస్వీ.రమ, జయలక్ష్మి, జె.మల్లిఖార్జున్, రాష్ట్ర కార్యదర్శులు మధు, బి.మల్లేశం, పద్మశ్రీ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

- ఉదయం 11 గంటలకు ప్రారంభం :

ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించనున్న గవర్నర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11 గంటలకు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగించనున్నారు. అనంతరం సభ గురువారానికి వాయిదా పడనుంది. సమస్యలపై సర్కారును ఇరుకున పెట్టేందుకు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, ఆ పార్టీతోపాటు బీజేపీ, ఇతర పక్షాల సవాళ్లకు ధీటుగా సమాధానం చెప్పేందుకు అధికారపక్షం సిద్ధమయ్యాయి. గత బడ్జెట్ సమావేశాలకు సాంకేతికంగా, మొక్కుబడిగా హాజరైన బీఆర్ఎస్ పక్ష నేత, మాజీ సీఎం కేసీఆర్ రాకపై ఈసారి కూడా సర్వత్రా ఆసక్తి నెలకొంది. గవర్నర్ ప్రసంగించే రోజైన బుధవారంతోపాటు బడ్జెట్ ప్రతిపాదించే రోజు మాత్రమే ఆయన సభకు హాజరయ్యే అవకాశముందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. సీఎం రేవంత్, మంత్రులు, ఇతర కాంగ్రెస్ సభ్యుల నుంచి విమర్శలు ఎదుర్కోవటం, వాటికి సమాధానం ఇవ్వటం గులాబీ బాస్‌కు ఇష్టం లేదని ఆయా వర్గాలు అభిప్రాయపడ్డాయి. అందుకే సాంకేతికంగా రెండు రోజులపాటు ఆయన సభకు హాజరవుతారని వివరించాయి. ఆ తర్వాత శాసనసభలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, మండలిలో కవిత... తమ పార్టీ సభ్యులను ముందుండి నడిపిస్తారని బీఆర్ఎస్‌కు చెందిన ఓ సీనియర్ నేత వ్యాఖ్యానించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఘటన, సీఎం రేవంత్‌పై టీడీఆర్ కుంభకోణానికి సంబంధించిన ఆరోపణలు, సీఎం, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పరస్పర విమర్శలు, నిధుల కోసం కేంద్రంపై యుద్ధం చేస్తామంటూ ముఖ్యమంత్రి ప్రకటనలు, బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాల నేపథ్యంలో ఈ దఫా బడ్జెట్ సమావేశాలు హాట్‌హాట్‌గా కొనసాగనున్నాయి. గత ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులు, వాటికి వడ్డీలు, బకాయిలకు సంబంధించి అధికార, ప్రధాన ప్రతిపక్ష సభ్యుల మధ్య వాదోపవాదాలు చోటు చేసుకునే అవకాశముంది. మరోవైపు తనకు శాసనసభాపక్ష నేత పదవిని ఇవ్వనందుకు నిరసనగా అసెంబ్లీకి డుమ్మా కొడుతున్న బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఈసారైనా సభకు వస్తారా? లేదా? అనేది చూడాలి. బడ్జెట్‌తోపాటు బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ ముసాయిదా బిల్లులకు ఈ సమావేశాల్లోనే చట్టబద్ధత కల్పిస్తారా? లేదా? అనేది కూడా తేలాల్సి ఉంది. సభను ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై గురువారం జరిగే సభా వ్యవహారాల కమిటీ (బీఏసీ) సమావేశంలో చర్చించి, ఒక నిర్ణయం తీసుకోనున్నారు.

లక్నోకు ఎదురుదెబ్బ!

గాయంతో మయాంక్ యాదవ్ ఔట్



ముంబయి : ఐపీఎల్ 18 సీజన్ ఆరంభానికి ముందే లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ)కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. యువ పేసర్ మయాంక్ యాదవ్ గాయంతో సీజన్ తొలి దశ మ్యాచులకు దూరం కానున్నాడు. నిరుడు అక్టోబర్‌లో బంగ్లాదేశ్‌పై అరంగేట్రం చేసిన మయాంక్.. గాయం నుంచి కోలుకుంటున్నాడు. బెంగళూర్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇటీవల మయాంక్ సాధన షురూ చేశాడు. మయాంక్ వేగంగా కోలుకుంటున్నాడని, బౌలింగ్ వర్క్‌లోడ్ సైతం పెంచుకుంటూ వెళ్తున్నాడని సమాచారం. ఐపీఎల్ మలి దశ మ్యాచులకు మయాంక్ అందుబాటులో ఉండే అవకాశం కనిపిస్తోంది. రూ.20 లక్షల కనీస ధరకు 2024లో మయాంక్‌ను తీసుకున్న లక్నో సూపర్‌జెయింట్స్ ఈ సీజన్‌కు రూ.11 కోట్ల ధరతో యువ స్పీడ్‌స్టర్‌ను అట్టిపెట్టుకుంది.

అఫ్గాన్ సభ్యత్వం రద్దు చేయండి

ఐసీసీకి హ్యూమన్ రైట్స్ వాచ్ లేఖ



న్యూఢిల్లీ : అంతర్జాతీయ క్రికెట్‌లో పోటీపడకుండా అఫ్గనిస్థాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ)కి మానవ హక్కుల వాచ్ (హెచ్ఆర్‌డబ్ల్యు) అనే స్వచ్ఛంద సంస్థ లేఖ రాసింది. 'ఆగస్టు 2021లో అధికారం చేపట్టిన నాటి నుంచి తాలిబన్ ప్రభుత్వం అఫ్గాన్‌లో మహిళల ప్రాథమిక హక్కులను కాలరాస్తోంది. విద్య, ఆటలతో పాటు స్వేచ్ఛ, సమానత్వం నిరాకరిస్తున్నారు. మెన్స్ జట్టును అనుమతిస్తూ, మహిళలపై నిషేధం విధించి వివక్ష నిరోధక విధానాన్ని అఫ్గాన్ ప్రభుత్వం తుంగలో తొక్కుతుంది. 2021 నుంచి అమ్మాయిల క్రికెట్‌కు ఐసీసీ నిధులు నిలిపివేశారు. అఫ్గాన్ అమ్మాయిల క్రికెట్ జట్టు విదేశాల్లో తలదాచుకుంటోంది. మహిళా క్రికెటర్ల శిక్షణ, వసతి, సౌకర్యాలు కోసం ఐసీసీ యథావిధిగా నిధులు ఇవ్వాలని కోరుతున్నాం. లేదంటే, మానవ హక్కుల ఉల్లంఘన కింద అఫ్గనిస్థాన్ క్రికెట్ బోర్డు సభ్యత్వాన్ని రద్దు చేయండి' అని ఐసీసీ రాసిన ఈమెయిల్‌లో హ్యూమన్ రైట్స్ వాచ్ పేర్కొంది. ఎన్‌జీఓ లేఖపై ఐసీసీ అధికారులు స్పందించాల్సి ఉంది.

డబ్ల్యూఎఫ్ఐపై సస్పెన్షన్ ఎత్తివేత

కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ నిర్ణయం

న్యూఢిల్లీ : రెండేండ్లుగా వివాదాలకు చిరునామాగా మారిన భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)పై నిషేధం ఎత్తివేస్తూ కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖ నిర్ణయం తీసుకుంది. 2023, డిసెంబర్ 24న డబ్ల్యూఎఫ్ఐపై వేటు వేసిన క్రీడాశాఖ.. ఇప్పుడు పరిస్థితులు చక్కబడటంతో సస్పెన్షన్‌ను తొలగిస్తూ మంగళవారం ఉత్తర్వులు వెల్లడించింది. నిషేధం ఎత్తివేయటంతో దేశవాళీ టోర్నమెంట్ల నిర్వహణతో పాటు అంతర్జాతీయ ఈవెంట్లకు జాతీయ జట్లను ఎంపిక చేసేందుకు రెజ్లింగ్ సమాఖ్యకు లైన్ క్లియర్ అయ్యింది. నిషేధం తొలగిస్తూ.. క్రీడాశాఖ కొన్ని షరతులను సైతం విధించింది. 'ఆఫీస్‌బేరర్ల నడుమ అధికార సమతూకం ఉండాలి. సస్పెన్షన్‌కు గురైన లేదా తొలగించిన అధికారులతో సంబంధాలు కొనసాగించకూడదు. ఇందుకోసం ఎగ్జిక్యూటివ్ కమిటీ అండర్‌టేకింగ్ 4 వారాల్లో సమర్పించాలి. లేదంటే న్యాయపరమైన చర్యలతో పాటు స్పోర్ట్స్ కోడ్ ప్రకారం చర్యలు తీసుకుంటాం. అన్ని స్థాయిల్లో సెలక్షన్స్ అత్యంత పారదర్శకంగా జరగాలని' క్రీడాశాఖ తన ఉత్తర్వులో పేర్కొంది.

నిషేధం ఎత్తివేతపై భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు సంజయ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. 'రెజ్లింగ్ సమాఖ్య కార్యాలయంను ఇప్పటికే మార్చాం. త్వరలోనే ఎగ్జిక్యూటివ్ సమావేశం ఏర్పాటు చేసి సెలక్షన్ ట్రయల్స్‌కు సర్క్యూలర్ జారీ చేస్తాం. క్రీడాశాఖ సూచించిన రూల్స్ పాటించేందుకు మాకు ఎటువంటి ఇబ్బంది లేదని' సంజయ్ సింగ్ తెలిపారు. మార్చి 25 నుంచి జోర్డాన్‌లో ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనుండగా.. ఈ టోర్నమెంట్‌కు జాతీయ సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించాల్సి ఉంది. బిజెపి మాజీ ఎంపీ, డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు సంజయ్ సింగ్ అత్యంత సన్నిహితుడు. మహిళా రెజ్లర్లపై వేధింపుల అంశంలో బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని భారత స్టార్ రెజ్లర్లు బజరంగ్ పూనియా, సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్ తదితరులు తీవ్రస్థాయిలో ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే.

కార్తీక్ రాజుకు టెన్నిస్ టైటిల్

ముగిసిన జాతీయ స్థాయి టోర్నమెంట్



హైదరాబాద్ : హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్ (హెచ్ఓటీఏ), జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో వ్యాపారవేత్త, ఔత్సాహిక క్రీడాకారుడు కలిదిండి కార్తీక్ రాజు సత్తా చాటాడు. పురుషుల సింగిల్స్ (30 ప్లస్) విభాగంలో కార్తీక్ రాజు చాంపియన్‌గా నిలిచాడు. జెఐసి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన టైటిల్ పోరులో సూర్య పవన్‌పై కార్తీక్ రాజు 10-6పై అలవోక విజయం సాధించాడు. పురుషుల డబుల్స్ (30 ప్లస్) విభాగం ఫైనల్లో కార్తీక్ రాజు, సూర్య పవన్ జోడీ రన్నరప్‌గా నిలిచారు. డబుల్స్ ఫైనల్లో సిద్దార్థ్ ఆలపాటి, తేజస్విని రావు జోడీ చేతిలో 5-10తో కార్తీక్, పవన్‌లు పరాజయం పాలయ్యారు. జెఐసిలో జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమానికి మాజీ ఎంపీ దగ్గుబాటి వెంకటేశ్వర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కూతురు ఐరా రాజుతో కలిసి కార్తీక్ రాజు సింగిల్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను అందుకున్నారు.




లక్ష్యసేన్ శుభారంభం

ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్

బర్మింగ్‌హామ్ : భారత యువ షట్లర్ లక్ష్యసేన్ ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ (సూపర్ 1000)లో శుభారంభం చేశాడు. పురుషుల సింగిల్స్‌లో చైనీస్ తైపీ షట్లర్‌పై లి యాంగ్‌పై 13-21, 21-17, 21-15తో మూడు గేముల్లో గెలుపొందాడు. మరో షట్లర్ హెచ్.ఎస్ ప్రణయ్ 19-21, 16-21తో వరుస గేముల్లో ఫ్రాన్స్ ఆటగాడి చేతిలో పరాజయం పాలయ్యాడు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బాన్సోద్ ముందంజ వేసింది. తొలి రౌండ్లో 21-13, 10-21, 21-17తో సింగపూర్ షట్లర్‌ను చిత్తు చేసింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సతీశ్, ఆద్య జోడీ 6-21, 15-21తో చైనా జంట చేతిలో తేలిపోయింది.

నవచిత్రం

'దిల్ రూబా'.. న్యూ ఏజ్ కమర్షియల్ సినిమా



కిరణ్ అబ్బవరం

హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న మూవీ 'దిల్ రూబా'. ఈ సినిమాలో రుక్సర్ ఢిల్లాన్ హీరోయిన్‌గా నటిస్తోంది. శివమ్ సెల్యులాయిడ్స్, ప్రముఖ మ్యూజిక్ లేబుల్ సారెగమ తమ నిర్మాణ సంస్థ అయినటువంటి ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకుడు. న్యూ ఏజ్ కమర్షియల్ మూవీగా ఈ నెల 14న హోలీ పండుగ సందర్భంగా ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది.

ఈ నేపథ్యంలో మంగళవారం హీరో కిరణ్ అబ్బవరం మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

■ ఈ సినిమా ఫైనల్ అవుట్ పుట్ చూశాక చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. సాంగ్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. టీజర్, ట్రైలర్ అందరికీ బాగా రీచ్ అయ్యింది. ఈ సినిమా ఉమెన్ రెస్పెక్ట్ ఫీలయ్యేలా ఉంటుంది. మిగతా వారితో పాటు మహిళా ప్రేక్షకులు ఈ సినిమాని బాగా ఇష్టపడతారు. 2 గంటల 20 నిమిషాల మూవీలో ఎక్కడా బోర్ ఫీల్ అవ్వరు. థియేటర్స్ నుంచి బయటకు వచ్చేప్పుడు ఒక మంచి మూవీ చూశామనే ఫీలింగ్‌తో వస్తారు. 'క' కంటే ముందు చేసిన సినిమా కదా ఇందులో కొత్తగా ఏదీ ఉండకపోవచ్చు అనుకుంటారు. కానీ ఓ 10 నుంచి 20% సీన్స్ ఎక్కడైనా చూసినట్లు అనిపించినా మిగతా మూవీ మొత్తం న్యూ ఏజ్ కమర్షియల్ దారిలో వెళ్తూ ఆకట్టుకుంటుంది.

■ ఈ సినిమా చూస్తున్నప్పుడు లవ్‌లోని మ్యాజిక్ మూవ్‌మెంట్స్‌ను ఎంజాయ్ చేస్తారు. హీరో క్యారెక్టరైజేషన్ బాగుంటుంది. మనం సారీ, థ్యాంక్స్ ఎలా పడితే అలా చెప్పేస్తుంటాం. కానీ హీరోకు అలా చెప్పడం నచ్చదు. సారీ, థ్యాంక్స్ మాటలకు ఒక విలువ ఉందనేది అతని వెర్షన్. ఎక్స్ లవర్, ప్రెజెంట్ లవర్స్‌ను కలపడం కొత్తగా ఉంటుంది. ఇప్పటిదాకా ఎక్స్ లవర్‌తో కూడా ఒక స్నేహాన్ని షేర్ చేసుకోవచ్చు, మోరల్ సపోర్ట్ ఇవ్వొచ్చనే మంచి పాయింట్ ను మా మూవీలో చూస్తారు.

గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవానికి రంగం సిద్ధం



దిల్‌రాజు

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

ఈ మేరకు విధి, విధానాలు ఖరారు చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈనెల 13 నుంచి దరఖాస్తులు చేసుకోవచ్చు.


గత పదేండ్లుగా ఇవ్వని నంది పురస్కారాల స్థానంలో ఇక ప్రతి ఏటా గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్ పేరిట ఇవ్వనున్నారు. ఈ అవార్డులను ఉగాది రోజునే ఇవ్వాలని నిర్ణయించారు. 2013 నుంచి గత ప్రభుత్వం సినిమా అవార్డులు ఇవ్వనందున వాటిని కూడా పరిగణనలోకి తీసుకుని ఒక్కో ఏడాదికి ఒక్కో ఉత్తమ చిత్రానికి పురస్కారం ఇవ్వనున్నారు. ఇక 2024వ సంవత్సరానికి నటీనటులు సాంకేతిక నిపుణుల వ్యక్తిగత అవార్డులతో పాటు ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ బాలల చిత్రం, జాతీయ సమైక్యత చిత్రం, పర్యావరణం, చారిత్రక సంపద తదితర విభాగాల సినిమాలకు గద్దర్ అవార్డులు అందజేయనున్నారు.

అలాగే యువ ప్రతిభను ప్రోత్సహించేందుకు తొలి ఫీచర్ ఫిల్మ్, సోషల్ ఎఫెక్ట్ ఫిల్మ్, డాక్యుమెంటరీ ఫిల్మ్ షార్ట్ ఫిల్మ్ యానిమేషన్ ఫిల్మ్ విభాగాల్లోను పురస్కారాలు, నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారు.

తెలుగు సినిమా పై పుస్తకాలు, విశ్లేషణాత్మక వ్యాసాలు రాసే ఫిల్మ్ జర్నలిస్టులకు కూడా అవార్డులు ఇస్తాం. అలాగే పైడి జయరాజ్, కాంతారావు, ఎం.ప్రభాకర్ రెడ్డి పేర్లతో అవార్డులను కొనసాగించాలని నిర్ణయించాం అని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు తెలిపారు.

గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవాన్ని చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. అవార్డులు అనేవి కళాకారులకు మరింత ఉత్సాహాన్నిస్తాయి. అలాగే మరిన్ని మంచి పాత్రలు చేయాలనే బాధ్యతని కూడా పెంచుతాయి అని దిల్‌రాజు అన్నారు.

'కళ్లలో కాన రాకున్నా..'



విక్రమ్, దుషార విజయన్

హీరో విక్రమ్ నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్-ప్యాక్డ్ మూవీ 'వీర ధీర సూరన్ పార్ట్ 2'. ఎస్.యు. అరుణ్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఎస్.జె. సూర్య, సూరజ్ వెంజరాముడు, దుషార విజయన్ కీలక పాత్రలు పోషించారు. హెచ్ఆర్ పిక్చర్స్ రియా శిబు నిర్మించిన ఈ సినిమా ఒక యాక్షన్ థ్రిల్లర్. ప్రేక్షకులకు సీట్ ఎడ్జ్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది అని చిత్ర బృందం తెలిపింది.

మంగళవారం మేకర్స్ ఈసినిమా నుంచి 'కళ్లల్లో కాన రాకున్నా..' అంటూ సాగే సాంగ్‌ని రిలీజ్ చేశారు. జీవి ప్రకాష్ కుమార్ ఈ పాటని బ్యూటీఫుల్ లవ్ మెలోడీగా కంపోజ్ చేశారు. శరత్ సంతోష్, రేష్మ శ్యామ్ తమ ఫ్లజెంట్ వోకల్స్‌తో మెలోడీ, గ్రేస్‌ని మరింత ఎలివేట్ చేశారు. రాజేష్ గోపిశెట్టి రాసిన లిరిక్స్ మనసుని హత్తుకుంటున్నాయి. ఈ సాంగ్‌లో విక్రమ్, దుషార విజయన్ కెమిస్ట్రీ చాలా నేచురల్‌గా ఉంది. ఈ లవ్ ట్రాక్ ఇన్‌స్టంట్ హిట్‌గా నిలిచింది.

విక్రమ్-దర్శకుడు అరుణ్ కుమార్-నిర్మాత రియా శిబు కొలాబరేషన్‌లో వస్తున్న ఈ సినిమా పై ట్రేడ్ వర్గాలు, ప్రేక్షకులలో చాలా అంచనాలు ఉన్నాయి. తెలుగులో ఎన్వీఆర్ సినిమాస్ ద్వారా ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈనెల 27 ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ : తేని ఈశ్వర్, ఎడిటింగ్ : జి.కె. ప్రసన్న, ఆర్ట్ డైరెక్టర్ : సి.ఎస్. బాలచందర్.

సాయికుమార్‌కు కొమురం భీమ్ జాతీయ పురస్కారం



సాయికుమార్

నటుడు సాయి కుమార్‌కి అరుదైన గౌరవం లభించింది. 2024 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మక జాతీయ పురస్కారానికి సాయికుమార్‌ని ఎంపిక చేసినట్లు సెలక్షన్ చైర్మన్ సి.పార్థ సారధి, కో-చైర్మన్ నాగబాల డి.సురేష్ కుమార్, కన్వీనర్ కొమురం సోనే రావు, శిడాం అర్జు మాస్టారు ఓ అధికారిక ప్రకటనలో తెలిపారు. గత 12 సంవత్సరాలుగా 'భారత కల్చరల్ అకాడమి, ఓం సాయి తేజ ఆర్ట్స్, ఆదివాసి సాంస్కృతిక పరిషత్' సంయుక్త నిర్వహణలో ఈ అవార్డ్‌ను అందిస్తున్నారు. గతంలో ఈ కొమురం భీమ్ అవార్డును సుద్దాల అశోక్ తేజ, అల్లాణి శ్రీధర్, రాజేంద్ర ప్రసాద్, గూడ అంజయ్య వంటి దిగ్గజాలకు ఈ పురస్కారంతో సన్మానించారు. ఈ అవార్డుతో పాటు జ్ఞాపికను, యాభై ఒక వెయ్యి రూపాయల నగదు అందిస్తామని కమిటీ సభ్యులు తెలియజేశారు.

ఈనెల 23వ తేదీ ఈ పురస్కరోత్సవం కొమురం భీమ్ జిల్లా, ఆసిఫాబాద్ కేంద్రంలోని ప్రమీల గార్డెన్స్‌లో జరుగనుంది. శాసనసభ్యులు కోవా లక్ష్మి, బిజేపి నాయకులు అరిగెల నాగేశ్వర రావు పర్యవేక్షణలో ఈ వేడుక జరుగనుందని నిర్వాహకులు తెలిపారు.

సమ్మర్ స్పెషల్‌గా రిలీజ్



ఇంద్రా రామ్

క్రైమ్-కామెడీ డ్రామా 'చౌర్య పాఠం' సినిమాతో డైరెక్టర్ త్రినాథరావు నక్కిన చిత్ర నిర్మాణంలోకి అడుగుపెడుతున్నారు. ఈ సినిమా ద్వారా ఇంద్రా రామ్‌ను హీరోగా పరిచయం చేస్తున్నారు. దర్శకుడు చందూ మొండేటి వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేసిన నిఖిల్ గొల్లమారి ఈ మూవీతో దర్శకునిగా పరిచయం అవుతున్నారు.

నక్కిన నెరేటివ్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ మూవీకి వి.చూడమణి సహ నిర్మాత. ఈ చిత్ర టీజర్ థ్రిల్లింగ్ క్రైమ్, డార్క్ హ్యూమర్ బ్లెండ్‌తో ఇప్పటికే బజ్ క్రియేట్ చేసింది. నాగ చైతన్య లాంచ్ చేసిన ప్రమోషనల్ సాంగ్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. సమ్మర్‌లో వన్ ఆఫ్ ది బిగ్గెస్ట్ అట్రాక్షన్‌గా ఈ సినిమా ఏప్రిల్ 18న థియేటర్లలోకి వస్తుందని మేకర్స్ అనౌన్స్ చేశారు. పరీక్షలు ముగిసి, వేసవి సెలవులు ప్రారంభమౌతున్నందున ఈ రిలీజ్ డేట్ పాఠశాల, కళాశాల విద్యార్థులకు పర్ఫెక్ట్ టైం. వినోదాన్ని ఆస్వాదించాలనుకునే స్నేహితులకూ ఈ మూవీ ఒక సరదా ప్రయాణంగా ఉంటుంది.

ఈ చిత్రంలో పాయల్ రాధాకృష్ణ కథానాయికగా నటిస్తుండగా, రాజీవ్ కనకాల, మస్త్ అలీ ముఖ్యమైన కీలక పాత్రలను పోషిస్తున్నారు. ఈ చిత్ర కథని సినిమాటోగ్రాఫర్ కార్తీక్ ఘట్టమనేని రాశారు. ఆయన ఈచిత్రానికి కెమెరా వర్క్ కూడా అందిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైన్ - శ్రీ నాగేంద్ర తంగాల, సంగీతం - దావ్‌జాండ్, ఎడిటర్ - ఉత్తర, సహ నిర్మాత - వి చూడామణి, కొరియోగ్రఫీ - విజయ్ బిన్ని, విజయ్ పోలాకి.

భిన్న డివోషనల్ థ్రిల్లర్



ఆది సాయికుమార్, అవికాగోర్

కొత్త తరహా కథలతో రూపొందే డివోషనల్ థ్రిల్లర్స్‌కు ప్రేక్షకుల్లో మంచి ఆదరణ ఉంది. ఇప్పుడు అదే తరహాలో ఓ ఇంట్రెస్టింగ్ డివోషనల్ కథతో రూపొందుతున్న చిత్రం 'షణ్ముఖ' కూడా ఆ జాబితాలో చేరడానికి రెడీ అవుతోంది.

డివోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో ఆది సాయికుమార్ కథానాయకుడు. అవికాగోర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి షణ్ముగం సాప్పని దర్శకుడు.

'శాసనసభ' అనే పాన్ ఇండియా చిత్రంతో అందరికి సుపరిచితమైన సంస్థ సాప్‌బ్రో ప్రొడక్షన్స్ సంస్థ తమ ద్వితీయ చిత్రంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేష్ యాదవ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఈనెల 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నారు.

ఈ సందర్భంగా హీరో ఆది సాయికుమార్ మాట్లాడుతూ, 'విడుదలకు ముందే ఈ సినిమా అన్ని డిజిటల్ హక్కులు, అన్ని భాషల శాటిలైట్ హక్కులు, థియేట్రికల్ హక్కులు ఫ్యాన్సీ రేటుకు అమ్ముడు పోవడం ఆనందంగా ఉంది. ఈ సినిమా క్రెడిట్ అంతా దర్శక, నిర్మాత షణ్ముగం సాప్పనిదే. రవిబసూర్ అందించిన సంగీతం, నేపథ్య సంగీతం సినిమాను మరో లెవల్‌కు తీసుకెళ్తుంది. అవికాతో పనిచేయడం హ్యాపీగా ఫీలయ్యాను. మంచి సినిమాకు తప్పకుండా ప్రేక్షకుల ఆదరణ ఉంటుంది. అలాంటి ఓ మంచి కంటెంట్‌తో తెరకెక్కిన ఈ సినిమా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు.

డ్రగ్స్ మాఫియాపై 'అభినవ్' పోరాటం



శ్రీ లక్ష్మి ఎడ్యుకేషన్ ఛారిటబుల్ ట్రస్ట్, సంతోష్ ఫిల్మ్ నిర్మిస్తున్న బాలల చిత్రం 'అభినవ్' చేజ్డ్ పద్మ వ్యూహ. ఈ చిత్ర పోస్టర్, ట్రైలర్‌ను తెలంగాణా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,'ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సుధాకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. సమాజ శ్రేయస్సు కోసం, లాభాపేక్ష లేకుండా ఈ చిత్రాన్ని నిర్మించడం అభినందనీయం. ఇలాంటి చిత్రాలకు ప్రభుత్వ సహకారం తప్పకుండా ఉంటుంది. ట్రైలర్ ఎంతో ఇన్‌స్పైరింగ్‌గా ఉంది' అని తెలిపారు.

'గంజాయి, డ్రగ్ మాఫియా కబంధ హస్తాల్లో ఇరుకున్న గిరిజన అనాథ బాల కార్మికులను, హైదరాబాద్‌లోని ప్రముఖ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు యోగ, ఆర్మీ శిక్షణ తీసుకుని, ఆ గంజాయి, డ్రగ్ మాఫియాను ఎలా అంతం చేసారు అనే కథాంశంతో చిత్రం ఉంటుంది. బాలల చిత్రం అయినా యాక్షన్ సన్నివేశాలతో బలమైన కథాంశంతో, పూర్తిగా ఉత్కంఠ భరితంగా ఉంటుంది. సారథి స్టూడియో సహకారంతో ఈ చిత్రాన్ని పూర్తి చేశాను. తెలంగాణ విద్యార్థులకు అతి త్వరలో నూన్ షోగా థియేటర్లలో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నాం' అని దర్శక, నిర్మాత డా. భీమగాని సుధాకర్ గౌడ్ చెప్పారు. ఈ చిత్రానికి కథ మాటలు పాటలు, నిర్మాత, దర్శకుడు డా. భీమగాని సుధాకర్ గౌడ్, సంగీతం: వందేమాతరం శ్రీనివాస్, ఎడిటర్: నందమూరి హరి.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.